Dwaraka

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ పంచమి మ. 12.55 వరకు, అనంతరం షష్ఠి; నక్షత్రం: ఉత్తరాభాద్ర తె. 4.49 వరకు, అనంతరం రేవతి; అమృతకాలం: రా. 12.10 నుండి 1.50 వరకు; వర్జ్యం: మ. 2.20 నుండి 3.58 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమ గండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;



సంపుటి:56 • సంచిక:281 • సోమవారం 22 జనవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad


9 లో

మేడారం జాతరకు పోటెత్తిన భక్తజనం

కాంగ్రెస్ వద్దు... విపక్షాలూ వద్దు


ఆసేతు హిమాచలం మేమే ఉండాలి

ఏకవీర!

- యావద్దేశం కమలం గుప్పిట ఉండాలి
- ఇదే మోడీ-షా ద్వయం లక్ష్యం
- వరుస విజయాలతో...ఆత్మ విశ్వాసంతో ఏకంగా హిందూరాజ్యస్థాపన వైపు అడుగులు
- ఏకపార్టీ పాలన కోసం తహతహ



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
నరేంద్రమోడి గత సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ ప్రచార బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇచ్చిన తొలి నినాదం "కాంగ్రెస్ ముక్త భారత్". ఈ దేశం నుంచి శతాబ్ధిక చరిత్ర కలిగిన కాంగ్రెస్‌ను సంపూర్ణంగా తుడిచిపెట్టే లక్ష్యంతోనే ఆయన బీజేపీని ముందుకు ఉరికించారు. లక్ష్యం పూర్తిగా నెరవేరకపోయినా 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించింది. ఆయన ప్రధాని అయ్యారు. అప్పటి నుంచి ఎన్నికలు జరుగుతున్న ఒక్కో రాష్ట్రాన్ని బీజేపీ ఛత్రఛాయలోకి తెచ్చేందుకు ఆయనతోపాటు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా ఓ పక్కా వ్యూహం ప్రకారం ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇదింత వరకు ఈ దేశం నుంచి సైద్ధాంతిక వైరుధ్యంతో కూడిన కాంగ్రెస్‌ను తుడిచిపెట్టేయడం వరకే వీరి లక్ష్యంగా పరిశీలకులు భావించారు. కానీ ఇప్పుడు వీరి వ్యూహాల్లో స్పష్టమైన మార్పు గోచరిస్తోంది. ఒక్క కాంగ్రెస్‌నే కాదు.. దేశంలోని విపక్షాలన్నింటిని నిర్మూలించి భారతీయ జనతాపార్టీ మాత్రమే జమ్మూకాశ్మీర్ నుంచి కేరళ వరకు, రాజస్థాన్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు ఏకఛత్రాధిపత్యంగా ఒకే పార్టీ పాలనలోకి ఈ భారత్‌ను తీసుకురావాలన్న లక్ష్యం ఇప్పుడు వీరి వ్యూహాల్లో ద్యోతకమౌతోంది. ఆసేతు హిమాచలం కమలనాథుల ఏలుబడిలోకి తీసుకురావడం ద్వారా దేశాన్ని హిందూరాజ్యంగా మార్చే లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలన్న ఆతృత వ్యక్తమౌతోంది. గతంలో ఏకపార్టీల పాలన ఉండేది. కానీ రెండున్నర దశాబ్దాల క్రితమే దేశ వ్యాప్తంగా ఒకే పార్టీ ప్రజల మద్దతు కూడగట్ట లేకపోయింది. అక్కడి నుంచి కూటముల పాలన మొదలైంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు వైరి కూటములకు నాయకత్వం వహించాయి. కొంతకాలం ఎన్‌డీఏ, ఆ తర్వాత యూపీఏ రాజ్యాలేలాయి. అయితే స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంలో కూటముల పాలనా వైఫల్యాలకు ప్రజలు ➪ 3వ పేజీలో...



కొండగట్టు నుంచి ప్రజాయాత్ర

- మూడు రోజుల పాటు యాత్ర
- ఉదయం 9 గంటలకు జనసేన ఆఫీసు నుంచి కొండగట్టుకు
- ఆంజనేయునికి ప్రత్యేక పూజలు
- అనంతరం కరీంనగర్‌కు...

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజాయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఇక్కడి ప్రశాసననగర్ జనసేన పరిపాలన కార్యాలయం నుంచి యాత్ర ప్రారంభం కానుంది. మధ్యాహ్నం మూడు గంటలకు జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకోనున్న పవన్‌కల్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రానికి కరీంనగర్ జిల్లా కేంద్రానికి పయనమవుతారు. ఆ రోజు రాత్రి కరీంనగర్‌లోనే బస చేసే ఆయన మంగళవారం ఉదయం 10.45 గంటలకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన జనసేన పార్టీ ముఖ్యులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ విధి విధానాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వారి సమస్యలపై ఆరా ➪ 3వ పేజీలో...



ఆప్‌కు షాక్

- ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు రాష్ట్రపతి ఆమోదం
- న్యాయ ప్రత్యామ్నాయాలపై ఆమ్ ఆద్మీ దృష్టి
- కేంద్రం వేధిస్తోంది... మాకు దేవుడు అండగా ఉన్నారు
- సత్య పంథా వీడం... న్యాయానిదే విజయం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆమ్ ఆద్మీ పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదించారు. దీంతో ఢిల్లీ అసెంబ్లీలో ఒక్క వేటుకు 20 నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. రాష్ట్రపతి నిర్ణయంతో పదవులను కోల్పోయే ఎమ్మెల్యేల్లో రవాణా మంత్రి కైలాష్ గెహ్లాట్, చాందినీ చౌక్ ఎమ్మెల్యే అల్కా లాంబ, బురారీ ఎమ్మెల్యే సంజీవ్ ఝా, కల్కాజి ఎమ్మెల్యే అవతార్ సింగ్, నరేలా ఎమ్మెల్యే శరద్ కుమార్ వంటి ప్రముఖ నేతలున్నారు. త్వరలోనే ఈ స్థానాల కోసం ఉప ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే న్యాయపరమైన ఇతర ప్రత్యామ్నాయాలపై ఆమ్ ఆద్మీ పార్టీ దృష్టి పెట్టింది. ఎన్నికల ➪ 10వ పేజీలో...

ట్రంప్ దిగొస్తేనే!

పట్టువీడని డెమోక్రాట్లు.. స్తంభించిన ఆర్థిక వ్యవస్థ



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
ఈ నెల 20వ తేదీ నుంచి అమెరికా మొత్తం స్తంభించిపోయింది. ఆర్థిక లావాదేవీలు ఆగిపోయాయి. ప్రభుత్వం ఒక డాలర్ కూడా ఖర్చుపెట్టగలిగే పరిస్థితుల్లేవు. ప్రభుత్వోద్యోగులందరికీ వేతనం లేని సెలవులిచ్చేశారు. ట్రంప్ అధికారంలోకొచ్చిన ఏడాదిలోనే అమెరికా ఇంతటి సంక్షోభానికి గురైందంటూ ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఆసియా దేశాల్లోని మీడియా మొత్తం దీన్నే ప్రధానాంశంగా పరిగణించింది. అమెరికాలో మీడియా మాత్రం దీన్నో సాధారణ వ్యవహారంగానే భావించింది. పెద్ద ప్రాధాన్యతాంశంగా వార్తలు పుంఖాను పుంఖాలుగా వెలువరించలేదు. అమెరికన్లకు ఇటువంటి సంఘటనలు చాలా సహజమే. అక్కడ ఆర్థిక బిల్లులు పార్లమెంట్ ఆమోదానికి నోచుకోకపోవడం చాలా సహజ ప్రక్రియ. ఇప్పటికే ఇలాంటివి 18సార్లు జరిగాయి. ఇది 19వ సారి షట్‌డౌన్. ఇంతకుముందు 2013 అక్టోబర్ 1 నుంచి 17వ తేదీ వరకు ఇలాంటి ఆర్థిక స్తంభన అమెరికాలో చోటు చేసుకుంది. మొదటి స్తంభన 1976 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 11వరకు సాగింది. అప్పట్లో గెరాల్డ్‌ఫోర్డ్ అమెరికా అధ్యక్షునిగా ఉండేవారు. ఆ తర్వాత జిమ్మీకార్టర్ సమయంలో ఐదుసార్లు అమెరికా షట్‌డౌన్ జరిగింది. ఇక రొనాల్డ్ రీగన్ అధ్యక్షుడిగా ఉండగా 8 సార్లు, జార్జి హెచ్‌డబ్ల్యు బుష్ అధ్యక్ష కాలంలో ఒకసారి, బిల్‌క్లింటన్ హయాంలో రెండుసార్లు, ఒబామా హయాంలో ఒకసారి అమెరికా ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఇది ట్రంప్ పాలనా వైఫల్యంగా కాకుండా అమెరికాలో పటిష్టంగా ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థకు అద్దంపడుతోంది.

కాకతాళీయంగా ఈసారి షట్‌డౌన్ జనవరి 20వ తేదీ నుంచి జరిగినా సరిగ్గా 753 ఏళ్ళ క్రితం 1265 జనవరి 20వ తేదీనే ప్రపంచంలోనే అతిపురాతన ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన బ్రిటన్‌లో పార్లమెంట్ తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో లార్డ్స్‌తో పాటు అన్ని ప్రధాన నగరాల ప్రతినిధుల్ని ➪ 3వ పేజీలో...

ట్రంప్ ఏడాది పాలన

నిరసన సెగలు!

10 లో

- ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా కదంతొక్కిన మహిళలు
- యూరప్, ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనూ ర్యాలీలు



ఫ్లోరిడాలోని పామ్‌బీచ్ నుంచి ట్రంప్ నివాసానికి మహిళల నిరసన ర్యాలీ


10

కొత్త సీఈసీ ఓపీ రావత్

- రేపు బాధ్యతల స్వీకరణ


2

గవర్నర్‌గా వెళ్లను ప్రజలతో ఉంటా

- 2019లో పోటీ చేస్తా
- బండారు దత్తాత్రేయ

రైతు సమన్వయ సమితిల వ్యూహం ఫలిస్తే...

పరపతి సంఘాలు రద్దు?

- రైతు సమాఖ్య ద్వారా చేయూత ఇవ్వాలన్నది లక్ష్యం
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మరిన్ని పథకాలు
- వ్యవసాయంవైపు యువతను ఆకర్షించే ప్రయత్నం
- రూ. 15వేల కోట్లతో ప్రత్యేక రాయితీ నిధి ఏర్పాటు

TSCAB

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రైతు సమన్వయ సమితుల ద్వారా సరికొత్త గ్రామీణ వ్యవసాయ పరపతి వ్యవస్థను ఆవిష్కరించి మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరులోగా జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమాఖ్యలు ఏర్పాటుచేసి అధికారాలు, బాధ్యతలపై మార్గదర్శకాలు జారీ చేయనుంది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచే అమలుచేసి ఫలితాలను అంచనా వేస్తారు. రైతు సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ రాష్ట్ర రైతు సమాఖ్య ద్వారానే అందిస్తారు. ఈ వ్యవస్థ సఫలీకృతమైతే వచ్చే ఏడాది నుంచి వ్యవసాయ సహకార పరపతి సంఘాలను రద్దు చేయాలన్న దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ అంశంపై ఇప్పటివరకు జరిగిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల తరహాలో రైతు సమన్వయ సమితుల పేరుతో మరో కొత్త పరపతి వ్యవస్థను నెలకొల్పబోతున్నారు. ప్రతి సీజన్‌లో ఎంచుకున్న లక్ష్యాలు సాధ్యపడక పోవడంతో పంట రుణాలను బ్యాంకుల ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారానే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతియేటా బడ్జెట్‌లో సహకార పరపతి వ్యవస్థకు రూ.15వేల కోట్లకు తగ్గకుండా నిధులు కేటాయించి కేవలం బడుగు రైతుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్న లక్ష్యంతో నిబంధనలు రూపొందిస్తున్నారు. ప్రత్యేక రాయితీలతో కూడిన మరిన్ని పథకాలను వచ్చే ఏడాది నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే పూర్తయిన రుణామాఫీ ప్రక్రియ, తాజాగా ప్రకటించిన పెట్టుబడి రాయితీ పథకాలపై గ్రామస్థాయిలో వివిధ వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతుల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు సూక్ష్మసర్వే నిర్వహిస్తున్నారు. మెజారిటీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త పథకాల నియమ నిబంధనలు ఖరారు ➪ 3వ పేజీలో...



కాళేశ్వరం పరుగులు పెట్టించాలి

2



- అన్నారం గ్రావిటీ కెనాల్ పనులు పరిశీలన
- కన్నెపల్లి అధికారుల వద్ద ప్రాజెక్టుపై సమీక్ష
- అర్ధరాత్రి మంత్రి హరీష్ ఆకస్మిక తనిఖీలు

'పెట్టుబడి మద్దతు' కార్యాచరణ సిద్ధం

7



- 71.75 లక్షల మంది రైతులకు రూ.ఆరు వేల కోట్లు నిధులు
- చెక్‌లు పంపిణీ... రొటేషన్‌లో నగదు

కాళేశ్వరం బాహుబలి

• ఇరిగేషన్‌లో సరికొత్త విప్లవం • ప్రపంచ రికార్డులు సృష్టిస్తున్న ప్రాజెక్టు • ప్రాజెక్టులకు ఫాదర్‌గా కేంద్ర జలసంఘం కితాబు • శరవేగంగా నిర్మాణం.. 36 లక్షల ఎకరాల ఆయకట్టు • ప్రతీదశ చారిత్రాత్మకమే.. జులైనాటికి తొలి ఫలాలు • కేసీఆర్ కలల ప్రాజెక్టుకు సర్వత్రా జేజేలు

ఇది ఓ మహాయజ్ఞం. ఇంజనీరింగ్ నిపుణులనే ఆశ్చర్యపరుస్తున్న అద్భుతం. దేశ నీటిపారుదల రంగంలోనే ఒక విప్లవం. సాగునీటి ప్రాజెక్టులను ఎలా నిర్మించాలో చాటిచెప్పే ఆదర్శ ప్రాజెక్టు. మూడు బ్యారేజీలు.. 1832కిలోమీటర్ల నీటి సరఫరా మార్గం.. 20లిఫ్టులు.. 19పంప్‌హౌజ్‌లు.. 36లక్షల ఎకరాల ఆయకట్టు.. రూ.80వేల కోట్ల వ్యయంతో కూడిన భారీ ప్రాజెక్టు కేవలం మూడేళ్ళలో పూర్తవడం అద్భుత ఘట్టమే. నిన్న జాతీయ జలసంఘం.. నేడు గవర్నర్.. ఇలా దేశమంతా తెలంగాణ వైపు ఆశ్చర్యంగా చూసేలా చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం. మరే ప్రాజెక్టులో ఉపయోగించనన్ని భారీ మోటార్లు.. మూడుషిఫ్ట్‌ల్లో పనులు.. లైవ్‌లో పనుల పర్యవేక్షణ.. ఇలా ఏ కోణంలో చూసినా కాళేశ్వరం ప్రత్యేకమే. సాగునీటిరంగానికి ఊపిరిలూదే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను తెలంగాణ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేస్తోంది. జూలై నాటికే తొలిదశ సాగునీరందించనున్న ఈ ప్రాజెక్టు పనులపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో ప్రాజెక్టు లక్ష్యాలు, నిర్మాణం తీరు, విశిష్టతలపై ఆంధ్రప్రభ ప్రత్యేక కథనం.



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి విస్తృతంగా సాగు నీరందించే బృహత్తర ప్రాజెక్టు ఇది. ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన కేంద్రజలసంఘం డైరెక్టర్ దీనిని ఫాదర్ ఆఫ్ ప్రాజెక్ట్స్‌గా కొనియాడారు. అంతేకాదు డిజైనింగ్ గొప్పతనానికి ముగ్ధులయ్యారు. గతంలో ప్రాణహిత చేవెళ్లపేరుతో ఉన్న ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి కేసీఆర్ రీడిజైన్ చేశారు. అనేక అడ్డంకులను అధిగమించి కాళేశ్వరం మహాప్రాజెక్టుగా రూపుదిద్దుకుంది. ఆయకట్టు సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంది. ప్రతిబంధకాలను ఛేదించుకుని అనుమతులు సాధించింది. శరవేగంగా నిర్మాణ పనులతో చారిత్ర ఘట్టంగా నిలుస్తోంది.

ప్రపంచంలోనే తొలిసారి..

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి అనేక ప్రత్యేకతలున్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఉపయోగించే భారీ మోటార్లు సాగునీటిరంగంలో వినియోగించడం ప్రపంచంలోనే తొలిసారి. 139మెగావాట్ల సామర్థ్యంతో పనిచేసే 7మహామోటారు పంపులు ఈ ప్రాజెక్టులో బిగిస్తున్నారు. ఒక మోటారు శక్తి 1,86,402 హార్స్‌పవర్. ప్రపంచంలోనే ఇంత భారీమోటార్లను ఎక్కడా వాడలేదు. ప్రాజెక్టులో మొత్తం 82మోటారు పంపులను ఇందుకు అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకం 400కెవిసామర్థ్యం గల మోటార్లు బిగిస్తున్నారు. రామడుగు పంప్‌హౌజ్‌లో నిర్మిస్తున్న ఒక్కో మోటారు బరువు 1407టన్నులు కావడం గమనార్హం. నీటిని పంపింగ్ చేయడానికి ఇంత భారీ మోటార్లు వినియోగించడం భారతదేశంలో ఇదే ప్రథమం.

తాగు, సాగు నీటి ప్రాజెక్టు

తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టు కాళేశ్వరం. ఈ ప్రాజెక్టు పూర్తయితే 18.25లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందనుంది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు జలాశయాల కింద ఉన్న 18.82లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పొందుతుంది. కొత్తగా సాగులోకి వచ్చే ఆయకట్టు 18.25లక్షల ఎకరాలలో, 11.84లక్షల ఎకరాలు దక్షిణ తెలంగాణ జిల్లాలవే. సిద్దిపేట 3.80, మెదక్ 2.59, యాదాద్రి 2.32, సంగారెడ్డి 2.34లక్షల ఎకరాలకు నీరందనుండగా, మేడ్చల్‌లో 50వేల ఎకరాలు, నల్లగొండలో 29వేల ఎకరాలకు నీరు అందుతుంది. కాళేశ్వరం ద్వారా స్థిరీకరణ పొందే ఆయకట్టులో ఎస్సారెస్పీ రెండోదశ ఆయ కట్టు 4.4లక్షల ఎకరాలు, సింగూరు ఆయకట్టు 40 వేల ఎక రాలు, ఘనపురం ఆనికట్ ఆయకట్టు 25వేల ఎకరాలు. హైదరా బాద్ తాగునీటి కోసం ప్రస్తుతం 10టిఎం సిల నీరు ఎల్లంపల్లి నుండి వస్తుండగా, మనో 30టిఎం సిలు కూడా పరిస్థితిని బట్టి తీసుకునేలా దీనిని రూపొం దించారు.

కాలంతో పోటీ పడుతూ..

ఏడాదిలోనే 215కు పైగా అనుమతులు సాధించిన ఏకై క భారతీయ ప్రాజెక్టుగా చరిత్ర సృష్టించిన కాళేశ్వరం పనులు కాలంతో పోటీ పడుతున్నాయి. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల సాగునీటి అవసరాలు తీర్చే ఈప్రాజెక్టును జూలై నాటికి సిద్ధం చేసేలా పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఓవైపు బ్యారేజీల పనులు, మరోవైపు పంపులు, మోటార్ల బిగింపు, ఇంకోవైపు సబ్‌స్టేషన్లు, విద్యుత్ సరఫరా ఏర్పాట్లను సమాంతరంగా చేపట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ పంప్‌హౌజ్‌ల మోటార్లు ఫిబ్రవరి చివరినాటికి విదేశాల నుండి రానుండగా, ఎల్లంపల్లి దిగువన జరుగుతున్న ప్యాకేజీల పనుల్లో పంపుల బిగింపు ఇప్పటికే మొదలైంది. బ్యారేజీలు, పంప్ హౌజ్‌ల పనులు వేగంగా పూర్తిచేసి జూలై నాటికి రోజుకు ఒకటిఎంసి చొప్పున గోదావరి జలాలు తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద పనులు ఆలస్యమైనా పంప్‌హౌజ్ ద్వారా నీటిని తీసుకునేందుకు అధికారయంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. అన్నారం బ్యారేజీలో 66గేట్లు, మేడిగడ్డలో 85, సుందిళ్ళలో 74గేట్లు అమ ర్చనున్నారు.

ప్రతిరోజూ.. పరీక్షే

ఇరిగేషన్ ఇంజనీర్లకు ప్రతిరోజూ పరీక్షే. మంత్రి హరీష్ పనులను క్షేత్ర స్థాయిలో సందర్శించి పరుగు పెట్టించ డంతో పాటు ప్రతిరోజూ వాట్సాప్ ద్వారా స్టేటస్ తెలుసుకుంటారు. ఎంత కాంక్రీట్ వేశారు.. ఎక్కడ ఎంత పని జరిగింది తెలుసుకుంటారు. ఎక్కడైనా తగ్గితే.. కారణాలు తెలుసుకుని వేగం పెరిగేలా చూస్తారు. అర్ధరాత్రి వరకు మనసు నిండా కాళేశ్వరాన్ని పెట్టుకుని.. నిరంతరం మథిస్తుంటారు. తాజాగా కాళేశ్వరంలో పర్యటించిన గవర్నర్.. మంత్రి హరీష్ శ్రమను స్వయంగా పరిశీలించి కాళేశ్వరరావుగా చరిత్రకెక్కు తారంటూ ప్రశ్నించారు.

కాళేశ్వరం విశిష్టతలు

కొత్త ఆయకట్టు	18.25లక్షల ఎకరాలు
స్థిరీకరించే ఆయకట్టు	18.82లక్షల ఎకరాలు
నీటిసరఫరా మార్గం పొడవు	1832కిమీ
వాలు కాల్వల పొడవు	1531కిమీ
టన్నెళ్ల పొడవు	203కిమీ
ప్రెషర్ పైప్‌లైన్ పొడవు	98కిమీ
మొత్తం నీటివినియోగం	225టిఎంసిలు
నీటిని ఎత్తిపోసే లిఫ్టులు	20
పంప్‌హౌజ్‌లు	19
అవసరయమ్యే విద్యుత్	4627.24మెగావాట్లు
సిద్ధంగా ఉన్న జలాశయాలు	5
కొత్తగా నిర్మిస్తున్న జలాశయాలు	20

ఫిబ్రవరిలో డ్రైరన్

ఎల్లంపల్లి దిగువన ఉన్న ప్యాకేజీ-6, 8లలో ఫిబ్రవరి మొదటివారంలో రెండు పంపులను డ్రైరన్ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్యాకేజీ-6లో గ్రావిటీ కెనాల్ టన్నెల్.. పంపుహౌజ్‌లు నిర్మిస్తుండగా.. 88శాతం పనులు పూర్తయ్యాయి. మొత్తం 124మెగావాట్ల సామర్థ్యమున్న రెండు పంపులను ఇప్పటికే సిద్ధం చేశారు. మరో రెండు పంపుల పనులు పురోగతిలో ఉన్నాయి. ఇక ప్యాకేజీ-7లో మేడారం రిజర్వాయర్‌తో పాటు 11.24కిమీ టన్నెల్ నిర్మాణం అవసరం కాగా, టన్నెల్స్ నిర్మాణం పూర్తయి లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఇక ప్యాకేజీ-8లో 139మెగావాట్ల సామర్థ్యం తో 22,036 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే ఏడు పంపులు అమర్చుతున్నారు. ఈ అతి భారీ మోటార్లలో రెండింటిని ఫిబ్రవరి తొలివారంలో డ్రైరన్ నిర్వహించి పరిశీలిం చనున్నారు. మిగతా మోటార్లు జూన్ నాటికి సిద్ధం చేసేలా ప్రణాళిక రూపొందిం చుకు న్నారు.

సమీక్షలతో బిజీబిజీ

• కాళేశ్వరం పనులపై మంత్రి హరీశ్ ముద్ర
• ముగిసిన రెండురోజుల కాళేశ్వరం టూర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విరామం లేకుండా.. రెండురోజుల పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పనులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించిన రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు రాష్ట్ర రాష్ట్ర గవర్నర్ వెంట పర్యటించిన మంత్రి హరీష్ శనివారం రాత్రి నుండి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షా సమావేశాలు జరిపారు. శనివారం రాత్రి కాళేశ్వరం ప్యాకేజీ 6,7,8పనులను పరిశీలించి అక్కడే సైట్ వద్ద సమీక్షించారు. ఆదివారం ఉదయం గోలివాడ, సుందిళ్ళ, అన్నారం పంపుహౌజ్‌ల పనుల పురోగతిని సమీక్షించారు. ఆదివారం సాయంత్రం కన్నెపల్లి పంపుహౌజ్ దగ్గర కాళేశ్వరం పనులపై ఇరిగేషన్ ఇంజనీర్లు ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్షించారు. కాళేశ్వరంను ఇరవైమాసాల్లో పూర్తిచేస్తామని హరీష్ ప్రకటించారు. వేగంగా అటవీ, పర్యావరణ అనుమతులు సాధించడం సిఎం కెసిఆర్‌కు మాత్రమే సాధ్యపడిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీని ఈఏడాది డిసెంబర్‌కు పూర్తిచేస్తామని, కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. కన్నెపల్లి-అన్నారం అప్రోచ్ కాలువ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు.

వచ్చే మే కల్లా ఈకెనాల్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయితే 125కిమీ మేర నదిలో 365రోజుల మేర నిల్వ ఉంటుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పెద్దపల్లి జిల్లా మంథని రూపురేఖలు మారిపోతాయని హరీష్ అన్నారు. కాగా ఈ పర్యటన సందర్భంగా గవర్నర్ నరసింహన్ మంత్రి హరీష్‌రావును భుజం తట్టి అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 125కిమీ దూరమంతా గోదావరిని సజీవంగా ఉంచేందుకు రచించిన ప్రణాళికలు, అమలు చేస్తున్న తీరును మంత్రి హరీష్ వివరిస్తుంటే గవర్నర్ విస్తుబోయారు. రైతుల ఆత్మ కెసిఆర్ అయితే తెలంగాణ ఆత్మగా కాళేశ్వరం రూపుదిద్దుకుంటున్నదని గవర్నర్ ఆనందం వ్యక్తం చేశారు. గత నెలలోనూ మూడురోజులు పర్యటించిన హరీష్, ఇపుడు రెండురోజుల పర్యటించి ప్రాజెక్టు పనుల వేగంపై తనదైన ముద్ర వేస్తున్నారు.

పరుగులు పెట్టించాలి

• కోటి 30లోల మీటర్ల మేర మట్టి తవ్వకాలు పూర్తి చేయాలి
• కాంట్రాక్టు సంస్థలకు మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు • 2 గంటల పాటు అడవిలో పర్యటన



మహాదేవపూర్, ప్రభన్యూస్ : తెలంగాణ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతంగా చేయాలని కాంట్రాక్టు సంస్థలకు భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదేశాలు జారీ చేశారు. శనివారం గవర్నర్‌తో కలిసి ప్రాజెక్టు ను పరిశీలించినా కూడా మళ్ళీ ఆదివారం ప్రాజెక్టు బాట పట్టాడు. ఆదివారం అన్నారం గ్రావిటి కెనాల్ స్టార్టింగ్ పాయింట్ నుంచి పనులను పరిశీలిస్తూ కెనాల్ అటవీ మార్గాన రెండు గంటల సేపు ప ర్య టి ం చి పనుల పురోగతిని పరిశీలిం చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు సంస్థ అధికారు లను వంద రోజుల్లో ఒక కోటి 30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కన్నెపెల్లి అధికారుల వద్ద ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట మంథని ఎమ్మెల్యే పుట్ట మధు కర్, భారీ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఎస్కె. జోషి, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎంసీ మురళీధర్ రావు, డీఎస్పీ కేఆర్‌కే ప్రసాద రావు, తదితరులున్నారు.



రామగుండం కమిషనరేట్ పనులను ప్రారంభిస్తున్న హోం మంత్రి

పోలీసుల పనితీరు భేష్

• ఒక్కసీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం: హోంమంత్రి నాయిని

గోదావరిఖని, ప్రభన్యూస్ : తెలంగాణ పోలీసు శాఖ పనితీరు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నర్సిం హారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రూ. 25 కోట్లతో నిర్మిస్తున్న రామగుండం కమిషనరేట్ భవన నిర్మాణ పనులను ప్రారం భించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ పోలీసులు నంబర్ వన్ స్థానంలో నిలిచారని స్వయంగా కేంద్ర హోం శాఖ మాత్యులు తెలంగాణ పోలీసు శాఖ పనితీరును ప్రత్యేకంగా అభినందించడమే ఇందుకు నిదర్శన మన్నారు. పోలీసులకు అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. 350 కోట్ల తో ఆధునిక సౌకర్యాలు ఉన్న వాహనాలను సమకూర్చామన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ప్రజల భాగ స్వామ్యంతో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మూడున్నరేళ్లలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తెలంగాణ పోలీసులు కష్టపడి పని చేశారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, నార్త్ ఐజీపీ నాగిరెడ్డి, ఐజీ మల్లారెడ్డి, కరీంనగర్ డీఐజీ ప్రమోద్ కుమార్, కలెక్టర్ దేవసేన, రామగుండం సీపీ విక్రమ్ జిత్ దుగ్గల్, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధుతోపాటు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం చేయూత

• కేంద్రం సహకారం లేకుండా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ చేపట్టారా?
• 24 గంటల కరెంటు సరఫరా ఘనత కేంద్రానిదే • కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం చేపడు తున్న పలు ప్రాజెక్టులకు కేంద్రం సంపూర్ణ చేయూత నిస్తోందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. ముఖ్యం గా రాష్ట్రంలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సకాలంలో నిధులు.... పలు రకాల అనుమతులు కేంద్రం ఇచ్చిం దని ఆయన గుర్తు చేశారు. కేంద్ర సహకారం లేకుండా తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ కింద పనులను చేపట్టే గలిగేదా? అని ప్రశ్నిం చారు. అన్ని రాష్ట్రా ల కంటే అధికంగా తెలంగాణకు కేంద్రం నిధులు మంజూరు చేసింద న్నారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ కేంద్రం నుంచి నిధులు రావడం లేదని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ఆదివారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, నాబార్డ్ సీఎండీ ఇచ్చిన వివరాల ప్రకారం రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసిందన్నారు. మిషన్ భగీరథకు 2015-2016లో రూ. 1976 కోట్లు, 2016-2017లో రూ. 1,168 కోట్లు, 2017-2018లో 1,217 కోట్లు మంజూరు చేసిం దన్నారు. కేవలం మూడేళ్ళ లోనే మొత్తంగా రూ. 3,939 కోట్లను కేంద్రం మం జూరు చేసిందని వివరించారు. అలాగే మిషన్ కాకతీయకు 14-15 లో రూ.360 కోట్లు, 15-16లో రూ. 317కోట్లు కేటా యిం చామన్నారు. గ్రామీణ మౌళిక వసతులు, కల్పన అభి వృద్ధి కోసం 15-16లో రూ.913 కోట్లు, 16-17లో రూ.963 కోట్లు, 17-18లో రూ.1006 కోట్లు కేంద్రం మంజూరు చేసింద న్నారు. అలాగే ఎన్ఐడిఏ కింద 15-16లో రూ.1,976 కోట్లు, 16-17లో రూ.2,043 కోట్లు, 16-17లో రూ.1,648 కోట్లు కేటాయించామన్నారు.

కేవలం మూడేళ్ళలోనే రూ. 5,666 కోట్ల మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి చేయూత నిచ్చామన్నారు. మైక్రోఇరిగేషన్‌కు 16-17లో రూ.874 కోట్ల సాయం కేంద్రం నుంచి వచ్చిం దన్నారు. కేంద్రం ఎప్పుడు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించలేదని ఆయన స్పష్టం చేశారు.

గవర్నర్‌గా వెళ్లను.. ప్రజలతోనే ఉంటా

కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ తన రాజకీయ ప్రణాళికను ప్రకటించారు. వయస్సు మీద పడుతున్న నేపథ్యంలో ఇక దత్తాత్రేయ... భవిష్యత్తుల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశముండదని భావించిన పలువురు భాజపా నేతలు అప్పుడే సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంపై దృష్టి కేంద్రీకరిం చారు. కానీ మన దత్తన్న వారి ఆశలపై నీళ్లు చల్లారు. 2019లో జరిగే ఎన్నికల్లోనూ పోటీ చేస్తానని ఆయన ఆదివారం నాడిక్కడ స్పష్టం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల బరిలో... ప్రజల ఆదరణతో ముందుకు సాగుతానని తెలిపారు. భవిష్యత్తులో గవర్నర్‌గా వెళ్లే ఆసక్తి తనకు అంతగా లేదని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా దత్తాత్రేయ చెప్పారు. కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించారు. ఆరుపదుల వయస్సు దాటిన దత్తన్నను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించినప్పుడే పలువురు పార్టీ నేతలు సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంపై కన్నేశారు. ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించి నరేంద్రమోదీ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టాలని నేతలు కసరత్తు చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో దత్తన్న తాను... గవర్నర్‌గా వెళ్ళనని...వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తానని కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారు.

రూ.450 కోట్లతో రైతు వేదికలు

• వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
• కిసాన్ కాల్ సెంటర్లతో బహుళ ప్రయోజనాలు
• మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పరిష్కా రానికి రాష్ట్రంలో రైతు వేదికలను ఏర్పాటు చేస్తామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందుకు రూ.450 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశామ న్నారు. 2018-19 ఆర్థిక సంవత్స రం అసెంబ్లీలో ప్రవేశపెట్టే ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది దేశవ్యాప్తంగా ప్రారంభించిన కిసాన్ కాల్ సెంటర్ల ద్వారా రైతులు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారని అన్నారు. ఆదివారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1800-180-1551 ఉచిత కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే శాస్త్రవేత్తలు పంటల సాగు మెళకువలు, నైపుణ్యాలు, మెరుగైన సస్యరక్షణ చర్యలను తెలియజేస్తారని చెప్పారు. మూడు దశల్లో సమస్యల పరిష్కారం ఉంటుందన్నారు. మొదటి దశలో సమస్యలను తెలుసుకుని అవసరమైన సమాచారం, సూచనలు, సలహాలు తెలియజేస్తారని అన్నారు. రెండో దశలో క్లిష్టమైన సమస్యలపై శాస్త్రవేత్తలతో చర్చించి తిరిగి సంబంధిత రైతులకు సమాచారం చేరవేస్తారని తెలిపారు. మూడో దశలో ప్రభుత్వంతో చర్చించి వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సహకారం అందిస్తారని మంత్రి పోచారం చెప్పారు.

రెండో విడత ఐఏఎస్‌ల బదలీలకు రంగం సిద్ధం

• కీలక బాధ్యతలకు పలువురి ఎంపిక • పదోన్నతులుపొందిన అధికారులకు బాధ్యతలు

ఆంధ్రప్రభ, హైదరాబాద్: కొత్త ఏడాది రెండో రోజునే 25 మంది ఐఏఎస్ అధికారుల బదలీలతో పాలన ప్రక్షాళన చేసిన ప్రభుత్వం తాజాగా రెండో జాబితాకు సిద్ధమైనట్లుగా తెలిసింది. ఎన్నికలకుసమాయత్తం అవుతున్న నేపథ్యంలో రాజకీయ అవసరాలు, అధికారుల సమర్థత గీటురాళ్లుగా ఈదఫా మరోసారి బదలీలకు కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇప్పుడున్న పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు ఉండ టంతో పాలనపై ప్రభావం పడుతోంది. పర్యాట క శాఖ కార్య దర్శిగా ఉన్న బి వెంకటేశం బిసి సంక్షేమ శాఖ కార్య దర్శిగా, రెవెన్యూ, వాణిజ్య పన్నుల ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్ ఆబ్కారీ కమిష నర్‌గా, జల మండలి ఎండీ దానకిషోర్ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా, యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రామ చంద్రన్ జనగామ కలెక్టర్‌గా, మంచిర్యాల కలెక్టర్ కర్నన్ జయ శంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా, సంగారెడ్డి కలెక్టర్ మాణిక్యరాజ్ కన్నన్ మెదక్ కలెక్టర్‌గా, ఖమ్మం కలెక్టర్ లోకేష్ కుమార్ మహ బూబాబాద్ కలెక్టర్‌గా, శాంతి కుమారి సీఎం ముఖ్య కార్యదర్శిగా, మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా ఇంచార్జి విధులను నిర్వహిస్తున్నారు.

ఇక కీలక అధికారులను అప్రధాన్య పోస్టులకు బదలీలు చేయడం వివాదంగా మారింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల స్థాయి అధికారులైన బీఆర్ మీనా, సురేష్‌చందాలను ఐఏఎస్ చరిత్రలోనే తొలిసారిగా కమిషన్ కార్యదర్శులుగా నియమిం చడం, ఆర్వి చంద్రవదన్‌ను విపత్తు నిర్వహణ శాఖకు పంపడం కూడా ఐఏఎస్‌లలో అసహనానికి కారణమైంది. ఇప్పటికే ఐఏఎస్‌ల కొరత ఉన్న రాష్ట్రంలో సీనియర్ల సేవలను వినియో గించుకోకుండా ప్రభుత్వం అప్రధాన్య పోస్టులకు పంపడం సరికాదనికొందరు అధికారులు ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలోని 2002 బ్యాచ్‌కు చెందిన నలుగురు ఐఏఎస్‌లకు ఇప్పటికే కార్యదర్శులుగా పదోన్నతి దక్కింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, జ్యోతి బుద్ధప్రకాశ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చింజీవులు, కేంద్ర రక్షణశాఖలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డిలకు కార్యదర్శులుగా పదోన్నతులు దక్కాయి. ఈ దఫా బదలీల్లో వీరికి కీలక స్థానాలు దక్కే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రఘునందన్ రావుకు కీలక కార్యదర్శి పోస్టుతోపాటు, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఉన్న చిరంజీవులుకు ఆబ్కారీ శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ దక్కనున్నట్లు తెలిసింది.

ఇంకా కొరతే...

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త రాష్ట్రం తెలంగాణకు 163 ఐఏఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. కాగా అప్పటివరకు 10 జిల్లాల తెలంగాణ కొత్త జిల్లాల ఏర్పాటుతో 31కి చేరింది. దీంతో కలెక్టర్లు, ఇతర అధికారుల అవసరం భారీగా పెరిగింది. ఇందులోనుంచి గతేడాది కాలంగా సీఎస్‌లు ప్రదీప్ చంద్ర, రాజీవ్‌శర్మ, స్పెషల్ సీఎస్‌లు వీకే అగర్వాల్, ఎంజీ గోపాల్, రేమండ్ పీటర్‌లు పదవీ విరమణ చేశారు. ఇవే కాకుండా కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్లకు వెళ్లినవారు సమయం గడిచిపోయినా తిరిగి వచ్చేందుకు చూపిస్తున్న విముఖత చూపుతున్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 163 ఐఏఎస్, 112 ఐపీఎస్, 65 ఐఎఫ్ఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. పదవీ విరమణలు, ఇతరత్రా ఖాళీలు పోనూ ప్రస్తుతం 128 మంది ఐఏఎస్‌లు, 91 మంది ఐపీఎస్‌లు, 56 మంది ఐఎఫ్ఎస్ అధికారులు రాష్ట్రంలో విధుల్లో ఉన్నారు. ఇందులోనూ 28 మంది ఐఏఎస్‌లు, 12 మంది ఐపీఎస్‌లు 7గురు ఐఎఫ్ఎస్‌లు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో తాజాగా రాష్ట్రంలో ఐఏఎస్‌లు 107, ఐపీఎస్‌లు 79, ఐఎఫ్ఎస్‌లు 49గా లెక్కలు ఉన్నాయి. దాదాపు 40శాతం అదనపు కేటాయింపులు కావాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తిని డీఓపిటీ ఇప్పటివరకు పట్టించుకోలేదు.



సర్దుబాట్లు ఇలా...

ఈ నేపథ్యంలో ఉన్నంతలో సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసింది. గతేడాది ఇందులో భాగంగా ఇండియన్ రైల్వేస్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్, ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్, ఇండియన్ పోస్టల్ సర్వీస్ వంటి అఖిలభారత సర్వీస్ అధికారులను రాష్ట్రాలకు ఆహ్వానిం చాలని, సెంట్రల్ డిపుటేషన్‌లో ఉన్న ఆయా విభాగాల అధికారుల వివరాలను సేకరిస్తోంది. వారు సుముఖంగా ఉంటే డీఓపిటిని ఒప్పించి రాష్ట్రానికి తీసుకు రావాలనే యోచనలో ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకు అనువుగా మార్గదర్శ కాలను రూపొందించుకున్నట్లుగా సమా చారం. ఈ మేరకు స్పెషల్ సీఎస్ అజయ్ మిశ్రా కీలక ప్రయత్నాలను ప్రారంభించినట్లు తెలిసింది.

ట్రంప్ దిగొస్తేనే!

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులుగా చేర్చారు. ప్రస్తుతం హౌస్ ఆఫ్ పార్లమెంట్‌గా పిలవబడుతున్న భవనం అప్పుడు ప్యాలెస్ ఆఫ్ వెస్ట్ మినిస్టర్‌గా పిలవబడేది. ఆ భవనంలోని విశాలమైన హాల్లోనే ఈ మొట్టమొదటి పార్లమెంట్ విస్తృత సమావేశం జరిగింది. ఆనాడే ప్రపంచవ్యాప్తంగా పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు బీజాలేయడం మొదలైంది. దీంతో ఏ విధంగానూ సంబంధం లేకపోయినా సరిగ్గా అదే జనవరి 20న చోటు చేసుకున్న పరిణామం భారత్ వంటి పలు దేశాలతో పోలిస్తే అమెరికాలో ప్రజాస్వామ్య దృఢత్వానికి అద్దంపడుతోంది. ఫిబ్రవరి 16వరకు ప్రభుత్వ అవసరాలకు తగ్గ నిధుల వ్యయానికి ట్రంప్ ప్రభుత్వానికి అనుమతిస్తూ ప్రవేశపెట్టిన ఈ బిల్లు వీగిపోయింది. సెనెట్‌లో మొత్తం 100 మంది సభ్యులుంటారు. ప్రస్తుతం ఇందులో రిపబ్లికన్లు 51మంది ఉన్నారు. డెమోక్రాట్లు 47మంది. మిగిలిన ఇద్దరూ ఏ పార్టీకి చెందని స్వతంత్ర అభ్యర్థులు. బిల్లు ఆమోదానికి ఇక్కడిలా మెజారిటీ ఉంటే సరిపోదు. ఖచ్చితంగా 60మంది సభ్యుల మద్దతు ఉండాలి. ఈ బిల్లుకు అనుకూలంగా 50ఓట్లే పడ్డాయి. వ్యతిరేకిస్తూ 49ఓట్లు పడ్డాయి. ఒకరు ఓటింగ్‌కు హాజరు కాలేదు. ఈ కారణంగానే ఈ బిల్లు వీగిపోయింది. అదే భారత్‌లో అయితే ఇలాంటి అత్యంత కీలకమైన బిల్లుల ప్రతిపాదన సమయంలోనే విపక్ష సభ్యులతో అధికారపక్షం సంప్రదింపులు జరుపుతుంది. వారిని ప్రలోభాలకు గురిచేసి తమవైపు ఆకర్షిస్తుంది. నగదు, నట్రా, పదవులు ఇచ్చి సంతృప్తి పరుస్తుంది. తద్వారా బిల్లు పార్లమెంట్‌లోకొచ్చేసరికి వైరిపక్షం కూడా అధికార పక్షానికి మద్దతుగా ఓట్లేసే పరిస్తితి తెస్తుంది. గతంలో పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు బిల్లుల ఆమోదం కోసం పలు ప్రాంతీయ పార్టీల్ని అడ్డంగా చీల్చేశారు. ఇక రాష్ట్రాలకొస్తే ఇలాంటివి అనేక ఉదాహరణలు ఉన్నాయి. కానీ అమెరికాలో ఇప్పటికీ సభ్యులు తమను గెలిపించిన పార్టీకి కట్టుబడి ఉంటున్నారు. అక్కడ కూడా సంప్రదింపులు, ప్రలోబాలు సహజమే. కానీ ప్రజాప్రయోజనాల ముందు ప్రతినిధులు వాటిని లక్ష్యపెట్టడంలేదు. వాస్తవానికి ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం రాత్రి వరకు డెమోక్రాట్లతో పలురకాలుగా చర్చలు జరిపింది. కానీ వారెవరూ లొంగలేదు. చివరకు అమెరికా ప్రయోజనాలకంటే డెమోక్రాట్లు సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ట్రంప్ విమర్శల వర్షం కురిపించినా వారెవరూ లెక్కచేయలేదు. బిల్లులో తమకున్న సందేహాల్ని తీర్చేవరకు అనుకూలంగా ఓట్లేసేదిలేదంటూ తేల్చిచెప్పేశారు. 2013లో డెమోక్రాట్లకు చెందిన బరాక్ ఒబామా అధ్యక్షునిగా ఉండి ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో 16రోజుల పాటు షట్‌డౌన్ కొనసాగింది. ఎనిమిదిన్నర లక్షల మంది ఉద్యోగులు విధులకు దూరంగా ఉన్నారు. 200 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తిని అమెరికా కోల్పోయింది. అప్పట్లో ఒబామాపై ఇదే ట్రంప్ పలురకాలుగా ఆరోపణలు గుప్పించారు. దేశ ఆర్థికస్థితిని ఒబామా నాశనం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అయినప్పటికీ అప్పట్లో రిపబ్లికన్లు ఏమాత్రం లొంగిరాలేదు. బిల్లులో సవరణలఅనంతరమే అప్పట్లో బిల్లును ఆమోదించారు.

అమెరికాలో తొలిసారి 1976 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 11 వరకు ఈ ప్రతిష్టంభన జరిగింది. కార్మికుల



ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదించిన బిల్లుపై ప్రతిపక్షంగా ఉన్న రిపబ్లికన్లు వ్యతిరేకంగా ఓట్లేశారు. కొందరు డెమోక్రాట్లు కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. వాస్తవానికి అప్పుడు సెనెట్‌లో డెమోక్రాట్లు 62మంది ఉంటే రిపబ్లికన్లు 32మంది ఉన్నారు. అయినా సరే ఆమోదానికి అవసరమైన 60ఓట్లను ప్రభుత్వం పొందలేకపోయింది. 1977సెప్టెంబర్ 30నుంచి అక్టోబర్ 13వరకు రెండోసారి ప్రతిష్టంభన నెలకొంది. అబార్షన్లకు సంబంధించిన బిల్లును అప్పటి ప్రెసిడెంట్ జిమ్మీకార్టర్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పుడు సెనెట్‌లో 59మంది డెమోక్రాట్లు, 41మంది రిపబ్లికన్లు ఉన్నారు. 17రోజుల్లోనే మరో ప్రతిష్టంభన ఏర్పడింది.

మూడోసారి 1977 అక్టోబర్ 31 నుంచి నవంబర్ 9వరకు ఈ సమస్య కొనసాగింది. అప్పుడు కూడా జిమ్మీకార్టర్ అధ్యక్షునిగా ఉన్నారు. తిరిగి 20 రోజుల్లోనే నవంబర్ 30 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు మరోసారి షట్‌డౌన్ అమలైంది. ఐదవసారి 1978సెప్టెంబర్ 30నుంచి అక్టోబర్ 18వరకు ఈ స్తంభన జరిగింది. అప్పుడు ఈసారి అణ్వాయుధ విమాన వాహక నౌకల కొనుగోలుకు సంబంధించిన బిల్లు సెనెట్‌లో వీగిపోయింది. దీంతో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. ఆరోసారి 1979సెప్టెంబర్ 30నుంచి అక్టోబర్ 12వరకు సాగింది. ఈసారి కూడా జిమ్మీకార్టర్ అధ్యక్షునిగా ఉండగా మరోసారి అబార్షన్ బిల్లును ఆయన సెనెట్‌లో ప్రవేశపెట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

తిరిగి ఏడోసారి 1981 నవంబర్ 25 నుంచి నాలుగురోజులు జరిగింది. అప్పుడు రొనాల్డ్ రీగన్ అధ్యక్షునిగా ఉన్నారు. సెనెట్‌లో రిపబ్లికన్లు 53 మంది ఉంటే డెమోక్రాట్లు 47మంది ఉన్నారు. రక్షణ పరికరాల కొనుగోలుకు బడ్జెట్ పెంపుదలకు తెచ్చిన ఈ బిల్లు వీగిపోయింది. తిరిగి 1982 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 2వరకు ఎనిమిదోసారి షట్‌డౌన్ జరిగింది. 1983 డిసెంబర్ 17 నుంచి 21 వరకు మరోసారి షట్‌డౌన్ అమలైంది. ఈ రెండూ కూడా ఆధునిక ఆయుధాల కొనుగోలుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదించిన బిల్లుల్ని ప్రతిపక్షం ఆమోదించకపోవడంతోనే జరిగాయి. పదోసారి 1983 నవంబర్ 10 నుంచి 14 వరకు షట్‌డౌన్ జరిగింది. అప్పుడు కూడా రీగనే అధ్యక్షునిగా ఉన్నారు. ఇజ్రాయెల్, ఈజిప్టులకు అమెరికా ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచడం, సిరియా, ఎల్‌సాల్వెడార్‌లకు ఇస్తున్న సాయాన్ని కోతపెట్టేందుకు వీలుగా ప్రతిపాదించిన బిల్లు వీగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 1984 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 3వరకు మరోసారి షట్‌డౌన్ అమలైంది. అప్పట్లో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పును రద్దు చేయాలన్న ప్రతిపాదన సెనెట్‌లో వీగిపోయింది. 1984 అక్టోబర్ 3 నుంచి 5 వరకు మరోసారి రీగన్ హయాంలోనే సుమారు 5 లక్షల మంది కార్మికుల ఉపాధిని దెబ్బతీసే బిల్లు వీగిపోవడంతో షట్‌డౌన్ జరిగింది. 1986 అక్టోబర్ 16 నుంచి 18 వరకు షట్‌డౌన్ అమలైంది. ఇందుకు ఆర్థిక బిల్లు వీగిపోవడమే దోహదపడింది. 1987 డిసెంబర్ 18నుంచి 20వరకు 14వసారి షట్‌డౌన్ జరిగింది. నికరాగువాకు అదనపు ఆర్థికసాయానికి సంబంధించిన బిల్లు వీగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

15వ సారి బుష్ హయాంలో షట్‌డౌన్ జరిగింది. 1990 అక్టోబర్ 5 నుంచి 9వరకు ఇది కొనసాగింది. అప్పట్లో సెనెట్‌లో డెమోక్రాట్లు 55 మంది, రిపబ్లికన్లు 45మంది ఉన్నారు. ఆర్థిక బిల్లుపై బుష్ వినియోగించిన వీటో అధికారానికి జరిగిన పోటీలో ప్రతిపక్ష వ్యతిరేక ఓటు కారణంగా ఈ షట్‌డౌన్ చోటు చేసుకుంది. 1995 నవంబర్ 13నుంచి 19వరకు మరోసారి జరిగింది. అప్పుడు బిల్‌క్లింటన్ అధ్యక్షునిగా ఉన్నారు. సెనెట్‌లో రిపబ్లికన్లు 53మందుంటే డెమోక్రాట్లు 47 మందే. మెడికేర్ ప్రీమియం పెంచడం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిధులపై కోత తదితర అంశాలతో కూడిన ఆర్థిక బిల్లును సెనెట్ తిరస్కరించింది. ఇక 17వ సారి 1995 డిసెంబర్ 5 నుంచి 1996 జనవరి 6వరకు బిల్‌క్లింటన్ హయాంలోనే ఆర్థికాభివృద్ధి స్తంభించిపోయింది.

ఈసారి బడ్జెట్‌లో 117బిలియన్ డాలర్ల లోటును నిరసిస్తూ ప్రతిపక్షం బడ్జెట్ బిల్లుపై వ్యతిరేకంగా ఓట్లేసింది. చివరగా 18వ సారి 2013 అక్టోబర్ 1నుంచి 17వరకు బరాక్ ఒబామా అధ్యక్షునిగా ఉన్న సమయంలో ప్రతిష్టంభన చోటు చేసుకుంది. అప్పటికి డెమోక్రాట్లు 54 మంది ఉంటే రిపబ్లికన్లు 46 మంది సెనెట్‌లో ఉన్నారు. నిధుల వ్యయంలో అసమానతలకు నిరసనగా ప్రతిపక్షం ఆర్థిక బిల్లును వ్యతిరేకించింది. దీంతో ప్రతిష్టంభన తప్పలేదు. ఇప్పుడు మరోసారి అమెరికా ఈ దుస్థితిని ఎదుర్కొంటోంది. అయితే అమెరికాకు ఇది కొత్తకాదు. అలవాటైన సంప్రదాయమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ వద్దు... విపక్షాలూ వద్దు

ఏకవీర!

(మొదటిపేజీ తరువాయి)

విసిగిపోయారు. యూపీఏ హయాంలో కాంగ్రెస్ మిత్రపక్ష పార్టీలకు చెందిన మంత్రులు, ఎంపీల అవినీతితో తల్లడిల్లి పోయారు. దీంతో స్పష్టమైన మెజారిటీ ద్వారానే కఠినమైన నిర్ణయాలకు అవకాశము ఉంటుందన్న అనుభవాలకు అనుగుణంగా గత ఎన్నికల్లో మిత్ర పక్షాలతో కలసి కూటమిగానే బీజేపీ బరిలో దిగినప్పటికీ ఒంటరిగానే ప్రభుత్వం ఏర్పాటు చేయ గలిగే బలాన్ని ఆ పార్టీకి కట్టబెట్టారు. అప్పటి ఎన్నికల్లో మెజా రిటీ సాధనేకాదు.. పలు రాష్ట్రాల్లో బీజేపీ ఏకపక్షంగా ఎంపీ సీట్లను గెలుచుకొచ్చేసింది. గుజరాత్‌లోని మొత్తం 26 ఎంపీ సీట్లు ఆ పార్టీ ఖాతాలో పడ్డాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని 80సీట్లకు గాను 71సీట్లు ఆ పార్టీ వశమయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని మొత్తం 5 సీట్లు బీజేపీనే వరించాయి. ఢిల్లీ పరిధిలోని ఏడు పార్లమెంట్ సీట్లు బీజేపీకే దక్కాయి. రాజస్థాన్‌లోని మొత్తం 25 సీట్లను ఆ పార్టీ కబళించేసింది. మహారాష్ట్రలోనూ మిత్రపక్షం శివసేనతో కలిపి మొత్తం 48సీట్లకు గాను 41సీట్లను కైవసం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో 29సీట్లకు గాను 27సీట్లు కొల్లగొట్టింది. కర్ణాటకలో 28సీట్లకు గాను 17సీట్లు ఆ పార్టీ గెలుపొందింది. జార్ఖండ్‌లో 14సీట్లకు గాను 12 సీట్లలో విజయ కేతనం ఎగురవేసింది. హర్యానాలో 10సీట్లకు 7సీట్లు కైవసం చేసుకుంది. చత్తీస్‌గఢ్‌లో 11సీట్లకు గాను 10సీట్లలో విజయం సాధించింది. ఆఖరకు పెద్దగా ప్రభావం చూపని బీహార్‌లో కూడా మొత్తం 40సీట్లకు గాను 22 సీట్లు ఆ పార్టీ వశమయ్యాయి. ఇలా దాదాపు సగానికి పైగా రాష్ట్రాల్లో బీజేపీ ఏకపక్ష విజయాల్ని నమోదు చేసింది. ఆ తర్వాత జరిగిన



అసెంబ్లీ ఎన్నికల్లోనూ పంజాబ్ మినహా ప్రతి చోట ఆ పార్టీ గెలుపు నమోదైంది. ఆదినుంచి పెద్దగా ఉనికిలేని తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో వేళ్ళూనుకుంది. ఇప్పటికే గుజరాత్, హర్యాన, హిమాచల్‌ప్రదేశ్, చత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఆ పార్టీ ఒంటిచేత్తో రాజ్యాలు చేస్తోంది. ఇవికాక మణిపూర్‌లో ఎన్‌పీపీ, మహరాష్ట్రలో శివసేన, జార్ఖండ్‌లో జెఎస్‌యు, గోవాలో గోమంతక్ పార్టీ, అసోంలో ఏజీపీలతో కలసి అధికారంలో ఉంది. బీహార్‌లో జనతాదళ్, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జమ్మూకాశ్మీర్‌లో పీడీపీ, నాగాలాండ్‌లో ఎన్‌పీఎఫ్, సిక్కింగ్ ఎస్‌టీఎఫ్‌లతో కలసి అధికారాన్ని పంచుకుంది. గతంలో కొంతకాలం శిరోమణి, అకాలీదళ్, పుదుచ్చేరిలో ఎన్‌ఆర్ కాంగ్రెస్, ఒడిషాలో బీజేడీలతో కలసి అధికారం చెలాయించినా ఇప్పుడు ఈ రాష్ట్రాలు బీజేపీ ఏలుబడిలో లేవు. ఢిల్లీ, కర్ణాటకలలో కూడా బీజేపీ సొంతంగా ప్రభుత్వాలు నిర్వహించింది. కానీ ఇప్పుడు ఈ రెండు రాష్ట్రాలు విపక్షాల అధీనంలో ఉన్నాయి. ఇక తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, మేఘాలయ, త్రిపుర, మిజోరాం, తెలంగాణలలో మాత్రం ఆ పార్టీ గట్టిగా ప్రభావాన్ని చూపలేకపోయింది. దీంతో ఇప్పుడు ఈ రాష్ట్రాలపైనే మోడి, షా ద్వయం దృష్టిపెట్టింది. ఎన్నికలు జరుగుతున్న ఈశాన్య రాష్ట్రాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ కాషాయజెండా ఎగురవేయాలని కృతనిశ్చయంగా ఉంది. ఇందుకోసం ఇప్పటికే పదునైన వ్యూహాల్ని అమల్లో పెట్టింది. అన్నిరకాల యుద్ధతంత్రాల్ని అమలు చేస్తోంది. మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం సంక్షోభానికి గురయ్యే ప్రమాదంలో పడ్డం కూడా బీజేపీకి కలిసొచ్చింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో బీజేపీ పుంజుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఉప ఎన్నికలంటూ వస్తే ఎక్కడ కూడా పాగావేయడం బీజేపీకి ప్రస్తుత పరిస్థితుల్లో పెద్దకష్టం కాదన్నది ఆ పార్టీ వ్యూహకర్తల ఆలోచనగా తెలుస్తోంది. అలాగే కర్ణాటకలో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాల్ని సిద్ధం చేస్తోంది. ఇలా అశేతు హిమాచలాన్ని కమలఛత్రఛాయ కిందకు తేవడమే బీజేపీ లక్ష్యంగా వెల్లడౌతోంది.

మోడి, షాల ద్వయాల ఆలోచన గతంలో విశ్వవిజేత కావాలని పరితపించిన అలెగ్జాండర్ శైలికి అద్దంపడుతోంది. అలాగే రవిఅస్తమించని సామ్రాజ్య స్థాపన కోసం తహతహలాడిన బ్రిటీషియుల రాజ్యకాంక్ష స్పష్టమౌతోంది. ఇలా ఏకపార్టీ పాలన స్థాపనా విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని ప్రజాస్వామ్య వాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏ ప్రభుత్వంలోనైనా బలమైన ప్రతిపక్షం అత్యవసరం లేనిపక్షంలో ప్రజాస్వామ్య మౌలిక సూత్రాల ఆచరణకు విఘాతం ఏర్పడుతుంది. ప్రతిపక్షాల్ని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యం ప్రజాస్వామ్య విరుద్ధం. దీనివల్ల దీర్ఘకాలంలో ప్రజల హక్కులు కూడా హరించిపోతాయి. ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడుతుందంటూ వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క బీజేపీయేకాదు.. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలన్నీ కూడా ఇప్పుడు ఈ రీతిలోనే ఆలోచిస్తున్నాయి. మొత్తం సీట్లన్నింటిని తమ పార్టీ మాత్రమే కైవసం చేసుకోవాలని భావిస్తున్నాయి. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాల్ని పూర్తిగా తుడిచిపెట్టేసే లక్ష్యంతో వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్, తెలంగాణలో టీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం వంటిపార్టీలు ఈ బాట అనుసరిస్తున్నాయి. ఇప్పటికే విపక్షాల్లోని సమర్ధులైన నాయకుల్ని తమ పార్టీల్లోకి ఆహ్వానించడం ద్వారా వాటిని ఎన్నికలకు ముందే నిర్వీర్యం చేస్తున్నాయి. ఇక ఎన్నికల నాటికి ప్రతిపక్షాల ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రయత్నిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన భారత్‌లో ఇది రాజకీయ పరంగానే కాక వ్యవస్థాపరంగా కూడా పెనుమార్పులకు దారితీసే ప్రమాదము ఉంటుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.



భార్య లెజ్నెవాతో థెరిస్సా చర్చిలో
పవన్ కల్యాణ్ ప్రార్థనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నగరంలోని సెయింట్ థెరిస్సా బసలీకా చర్చిలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తన భార్య అన్నా లెజ్నెవాతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆదివారం సూర్యోదయం సమయాన పోలాండ్ అంబాసిడర్ ఆడమ్ బురా కోవస్కీతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు పోలాండ్ నుంచి భారతీయ జీవనశైలి, విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి వచ్చిన 20 ఏళ్ల లోపు వయస్సు గల విద్యార్థుల బృందం, పోలాండ్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. పవన్‌కల్యాణ్ కుటుంబం మిగిలిన బృందం వారికి పారిష్ కౌన్సిల్‌తో కలిసి రెఫరెండ్ ఫాదర్ స్వాగతం పలికి సంప్రదాయ స్తోత్రాలను స్తుతించారు. పవన్‌కల్యాణ్, అన్నా పవన్‌కల్యాణ్‌లను ఆశీర్వదిస్తూ హోలీ మాస్‌ను నిర్వహించారు. కళ్యాణ్ దంపతులకు, ఆడమ్‌లకు ఫాదర్ బాలశౌరి తొలి దీవెనలు అందజేశారు. రష్యన్ సెయింట్ మార్క్ పేరును పుణికి పుచ్చుకున్న పవన్‌కల్యాణ్ అన్నా కుమారుడు మార్క్‌ను బాలశౌరి దీవించారు. గంటన్నరసేపు కల్యాణ్ దంపతులు సెయింట్ మేరీస్ చర్చిలో గడిపారు.

కొండగట్టుకు పవన్ ఎలా వస్తారు?
గత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి: పొన్నం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కొండగట్టుకు ఎలా వస్తారని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకుంటున్నానని చెప్పిన తర్వాతనే కొండగట్టులో అడుగు పెట్టనిస్తామన్నారు. లేదంటే పవన్ పర్యటనను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కొండగట్టు దేవాలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో పవన్ పర్యటనకు ప్రభుత్వం ఎలా అనుమతిస్తుందని ఆయన నిలదీశారు. కొండగట్టుకు వచ్చి మొక్కులు తీర్చుకుంటే తమకు అభ్యంతరం లేదని, అక్కడ రాజకీయాలు మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదని పొన్నం హెచ్చరించారు.

కొండగట్టు నుంచి ప్రజాయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

తీయడంతో పాటు చర్చించనున్నారు. కరీంనగర్-జగిత్యాల రహదారిలో వున్న శుభం గార్డెన్స్‌లో ఈ మూడు ఉమ్మడి జిల్లాల పార్టీ నేతలు, కార్యకర్తలతో పవన్ సమావేశమవుతారు. ఈ సమావేశం అనంతరం కరీంనగర్ నుంచి రోడ్డు మార్గాన భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కేంద్రానికి పయనమవుతారు. మంగళవారం రాత్రి కొత్తగూడెంలోనే బస చేయనున్న పవన్ మర్నాడు బుధవారం ఉదయం ఖమ్మం జిల్లా కేంద్రానికి బయల్దేరతారు. కొత్తగూడెం నుంచి భారీ ప్రదర్శనగా మధ్యాహ్నం ఖమ్మం చేరుకోనున్న పవన్ కల్యాణ్ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల జనసేన కార్యకర్తలు, ముఖ్య నేతలతో సమావేశమవుతారు. అనంతరం హైదరాబాద్ బయల్దేరతారని జనసేన వర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో కొండగట్టు మరోసారి వార్తల్లోకెక్కింది. ప్రజల్లోకి వెళ్లాలనుకున్న జనసేనాని కొండగట్టు నుంచి తన యాత్ర ప్రారంభానికి ప్రత్యేకమైన కారణం ఉందని చెప్పారు. ఆదివారం ఉదయం తన జిల్లాల పర్యటనకు సంబంధించి పార్టీ ముఖ్యనేతలతో సమాలోచన జరిపాక మీడియాతో మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం- బీజేపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ తాను ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సమయంలో కొండగట్టు ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తనకు తగిలాయని, దీంతో పెను ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డానని చెప్పారు. కొండగట్టు ఆంజనేయస్వామి దయవల్లే తాను సురక్షితంగా బయట పడ్డాను. ఈ సమయంలో ఆంజనేయస్వామిని దర్శించుకుని వచ్చేటప్పుడు ప్రమాదం తప్పినందున ఆ రోజు నుంచి ఆయనను బలంగా నమ్ముతానని పేర్కొన్నారు. అందుకనే పరిపూర్ణంగా రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పుడు కొండగట్టు నుంచే తన ప్రస్థానాన్ని ప్రారంభించాలని ఆనాడే ఓ అంతిమ నిర్ణయానికి వచ్చానని, అందులో భాగంగానే సోమవారం ఆయనను మరోసారి దర్శించుకుని యాత్రకు శ్రీకారం చుడతానని చెప్పారు. ఆంజనేయస్వామి దర్శనం అనంతరం తన యాత్ర ప్రారంభమవుతుందని ఉద్ఘాటించారు. దర్శనం అనంతరం తాను యాత్రను ఎలా చేస్తానో పార్టీ ముఖ్య నేతలతో సంప్రదించి వెల్లడిస్తానని పేర్కొన్నారు. తెలంగాణలోని మూడు, నాలుగు జిల్లాలలో జనసేన కార్యకర్తలతో సమావేశమవుతానని, ఈ సమావేశాలు ఎలా ఉంటాయో వెల్లడిస్తానని చెప్పారు. తన పర్యటనలో స్థానిక పరిస్థితులు, ప్రజా సమస్యలు, ఇతరత్రా అంశాలను అధ్యయనం చేయడం, పరిశీలించడం జరుగుతుందని, కార్యకర్తల నుంచి ఆయా అంశాలపై సమాచారం సేకరిస్తానని చెప్పారు. తన పర్యటనలో బహిరంగ సభలు ఉండవని పూర్తిగా కార్యకర్తల సమావేశాలే కొనసాగుతాయని చెప్పారు. పాదయాత్ర నిర్వహిస్తే ఎక్కువమంది ప్రజలను కలిసే అవకాశం ఉండదని పవన్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ఎన్నికల్లో తాను సింగరేణి బొగ్గు గనుల కాలనీలలో ఎన్నికల ప్రచార యాత్రను పాద యాత్రగా నిర్వహించానని, పదిహేను కిలోమీటర్లు నడిచి ప్రచారం చేశానని గుర్తు చేశారు. ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలన్నదే తన ధ్యేయమని, ఎలా వెళతానన్నది ఇప్పటికిప్పుడే చెప్పలేనని స్పష్టం చేశారు. పరిస్థితులను బట్టి బస్సు యాత్రను కూడా చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని పవన్ పేర్కొన్నారు.

భారీగా తరలివస్తున్న ఫ్యాన్స్...

కొండగట్టు నుంచి తన ప్రజాయాత్రను ప్రారంభిస్తానని ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటించిన మరుక్షణం నుంచే తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన పవన్ కల్యాణ్ సినీ అభిమానులు, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడం ప్రారంభమైంది. కొండగట్టులో ఫ్యాన్స్ హంగామా ఇప్పటికే మొదలైందని, పవన్‌కు స్వాగతం పలుకుతూ ఇప్పటికే భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు వెలిశాయని తెలుస్తోంది. ఈ సందర్భంగా కొండగటు విశిష్టత, ఫ్యాన్స్ హంగామా తదితర అంశాలను పర్యవేక్షించేందుకు జనసేన కేంద్ర కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం చేరుకుంది.

రెండ్రోజుల్లో 20 జిల్లాల కార్యకర్తలతో భేటీ...

జనసేనాని పవన్ కల్యాణ్ తన రెండ్రోజుల పర్యటనలో పాత, కొత్త జిల్లాలు కలిపి 20 జిల్లాల పార్టీ కార్యకర్తలు, నేతలతో సమావేశం కానున్నారు. సోమవారం కొండగట్టుకు వెళుతున్న పవన్ మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో కార్యకర్తలతో సమావేశమవుతున్న సంగతి తెలిసిందే. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, కొమరం భీమ్, మంచిర్యాల, వరంగల్ అర్బన్, రూరల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల కార్యకర్తలు, ఇతర నేతలతో ఆయన సమావేశమై దిశానిర్దేశనం చేయనున్నారు.



ప్రొఫెసర్ అవ్వాలనుకున్నా.. నటుడినయ్యా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాకు బాగా చదవాలని ఉండేది. చదువులో బాగా రాణించి ఉన్నతశ్రేణికి ఎదగాలని కుతూహల పడేవాడ్ని. కానీ, చదువు అబ్బలేదు. బాగా చదివి ఉంటే ప్రొఫెసర్ స్థాయికి ఎదిగేవాడ్ని. ఈ మాటలు ఎవరన్నారో తెలుసా..జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనను కలిసేందుకు వచ్చిన పోలాండ్ దేశ ప్రతినిదులనుద్దేశించి మాట్లాడుతూ చేసిన ప్రసంగమిది.గతేడాది నవంబర్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన పవన్ కల్యాణ్‌ను పోలాండ్ దేశ రాయబారి ఆడమ్ బురాకోవస్కీ ఆ దేశ ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా రాయబారిని భారతదేశానికి వచ్చినప్పుడు హైదరాబాద్ కూడా రావాలని పవన్‌కల్యాణ్ ఆహ్వానించారు. మన దేశ పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం ఇక్కడి జనసేన ప్రధాన కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ని కలిశారు. పోలాండ్ ప్రతినిధుల బృందాన్ని సాదరంగా ఆహ్వానించిన పవన్ వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాయబారితో వచ్చిన విద్యార్థి బృందం పవన్ కల్యాణ్‌తో ముఖాముఖీ సమావేశమై ఆయనపై కొన్ని ప్రశ్నలను సంధించారు. ఎంబీఏ చదువుతున్న ఓ విద్యార్థిని పవన్‌ను ఉద్దేశించి.. మీ విద్యాభ్యాసం ఎలా గడిచింది? విద్యార్థి దశలో ఎలా రాణించారు? అని అడుగగా.. చదువులో తాను ఫెయిల్ అయ్యానని, అందుకే అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. బాగా చదివి ఉంటే ప్రొఫెసర్ అయ్యేవాడినని గుర్తు చేశారు. 22వ ఏట తన సోదరుడు చిరంజీవి ప్రోత్సాహంతో సినీ రంగ ప్రవేశం చేశానని, ఈ రంగంలోనైనా రాణిస్తానన్న భయం మొదట్లో ఉండేదని, అయితే, ఆశించిన దానికంటే మిన్నగా ఈ రంగంలో విజయాలు సాధించానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని ఉద్దేశించి.. తన అన్నయ్య మంచి హీరోగా గుర్తింపు పొందారని చెప్పారు. చదువుకునే సమయంలో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిష్టించాలని భావించినప్పటికీ తన ఆలోచనలకు తగ్గట్టు విద్యావిధానం లేకపోవడంతో ఆ కల నెరవేరలేకపోయిందని చెప్పారు. దీంతో, అత్యుత్తమ అవకాశాలను కోల్పోయానని, చివరకు సినిమా రంగంలో స్థిరపడ్డానని చెప్పారు.

దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని పవన్ కల్యాణ్ చెప్పారు. హైదరాబాద్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్) విద్యార్థులు, పోలాండ్ విద్యార్థులతో కలిసి ఇరు దేశాల మధ్య సత్సంబంధాలపై పోలాండ్ రాయబారి ఆడమ్‌తో కలిసి పవన్ చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను ఇరువురు నివృత్తి చేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో పోలాండ్ దేశంపై జర్మనీ దాడి చేసినప్పుడు చాలా మంది పిల్లలు తమ తల్లిదండ్రులను, ఆప్తులను కోల్పోయారని, దీంతో వారి జీవితాలు చెల్లాచెదురయ్యాయని పేర్కొన్నారు. సోవియెట్ రష్యా వచ్చి ఈ రెండో ప్రపంచ యుద్ధ వాతావరణంలో జోక్యం చేసుకుని నిరాశ్రయులైన వెయ్యి మంది పిల్లలను ఎవరు తీసుకుంటారో అని తెలియని పరిస్థితుల్లో గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన మహారాజుకు ఈ విషయం తెలిసి ఈ పిల్లలను దత్తత తీసుకున్నారని చెప్పారు.

పరపతి సంఘాలు రద్దు?

(మొదటిపేజీ తరువాయి)

చేయబోతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ఆర్థిక వృద్ధిరేటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడుతున్న వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు గల అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ఇప్పుడున్న సహకార పరపతి విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి, పంట రుణాల వితరణకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఆవిష్కరించాలని సీఎం కేసీఆర్ సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సమితుల ఆధీనంలోకి పరపతి విధానం

రైతు సంక్షేమ కార్యక్రమాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పం ఈ ఏడాది నుంచేఅమల్లోకి రానుంది. ఇప్పటి వరకున్న వ్యవసాయ పరపతి విధానం పూర్తిగా గ్రామ రైతు సమన్వయ సమితిల ఆధీనంలోకి వచ్చేస్తోంది. వచ్చే ఏడాది నుంచి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పంట రుణాలు, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, బిందు, తుంపర సేద్యం పరికరాలు, పాలిహౌస్‌ల నిర్మాణం, సబ్సిడీ ట్రాక్టర్లు తదితర సహకార కార్యక్రమాలన్నీ ఈ ఏకీకృత విధానం ద్వారానే అమలు చేయబోతున్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, అనుబంధ శాఖలైన పట్టు పరిశ్రమ, పాడి పరిశ్రమ, పశు గణాభివృద్ధి కార్యక్రమాలు, మత్స్య పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ రంగాల అభివృద్ధి పూర్తిగా రాష్ట్ర రైతు సమాఖ్య పర్యవేక్షణలోనే జరుగుతుంది. దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సరికొత్త పథకాలను ప్రవేశపెట్టాలన్న దిశగా సీఎం కేసీఆర్ దృష్టి కేంద్రీకరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండాలన్న సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పరపతి వ్యవస్థలో కొత్త అధ్యాయం

ఇప్పటి వరకు అమల్లో ఉన్న విధానంలో ప్రతియేటా పంట రుణాలివ్వడం, కట్టలేని పరిస్థితుల్లో రద్దు చేయడం, నిబంధనల పరిధిలోకి రాని రైతులకు లబ్ధి చేకూరక నానా హైరానా కావడం, ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా నిందించడం లాంటి వాటికి స్వస్తి చెప్పి, సహకార రుణ పరపతి వ్యవస్థలోనే సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి మదిలో ఉన్న సరికొత్త ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు పలు శాఖల ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సీఎం మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన కొన్ని పథకాల అమలు సాధ్యాసాధ్యాలపై ఆర్థిక నిపుణులతో సమాలోచనలు జరుపుతున్నారు.

వాతావరణం హెచ్చుతగ్గులతో ప్రతియేటా ఏదో ఒక రకమైన విపత్తు సంభవించడం, తద్వారా వ్యవసాయ రంగం అస్తవ్యస్తం కావడం, ఈ రంగాన్నే నమ్ముకున్న అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రభుత్వ సహకారం కోసం ఎదురుచూడడం, సందర్భాలను అదునుగా చేసుకుని ఆయా పార్టీలు ఓట్ల రాజకీయాలకు పాల్పడడం లాంటి సంఘటనలు పునరావృతమవుతున్న నేపథ్యంలో కొత్త పథకాల ఆవశ్యకతపై సీఎం దృష్టి సారించారు.

కొత్త పథకాల మార్గాలపై అధ్యయనం

వచ్చే ఏడాది నుంచి గ్రామ స్థాయిలో మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కేసీఆర్ సర్కారు నిర్ణయించింది. అందుకు గల మార్గాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళిక తయారు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పూర్తయిన రుణమాఫీ పథకం, వచ్చే వానాకాలం నుంచి ప్రారంభిస్తామని ప్రకటించిన పెట్టుబడి రాయితీ పథకంపై రైతుల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం మొదలుపెట్టింది. సీఎం కేసీఆర్ మదిలో ఉన్న ఆలోచనల మేరకు ఉన్నతాధికారులు అంతర్గత కార్యాచరణను తయారు చేస్తున్నారు.


వచ్చే ఏడాది పెట్టుబడి పథకం ద్వారా ఎకరాకు రూ.4వేల మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో పాటు పంటల సాగును మరింతగా ప్రోత్సహించేందుకు కొత్త పథకాలను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి కోసం ఎదురు చూస్తున్న గ్రామీణ యువత దృష్టిని వ్యవసాయ రంగంవైపు మళ్ళించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మార్చి తర్వాత మరింత ప్రాధాన్యత

2018-19 వ్యవసాయ సంవత్సరంలో అమలు చేయబోయే కొత్త పథకాల ద్వారా యువతరాన్ని ఆకర్షించబోతున్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రత్యేక రాష్ట్రంలో మొదటి ప్రభుత్వానికి చరిత్రలో ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న వ్యూహంతోనే కేసీఆర్ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న నిరంతర ఉచిత విద్యుత్, ఖరీఫ్ నుంచి ఇవ్వనున్న ఉచిత ఎరువుల కోసం రాయితీతో పాటు భవిష్యత్‌లో విత్తనాలు కూడా ఉచితంగా ఇస్తే రైతులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కల్పించినట్లవుతుందని కేసీఆర్ తన ఆలోచనను కొంతమంది మంత్రివర్గ సహచరులతో పంచుకున్నట్లు తెలుస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం చిన్న, మధ్యతరహా, భారీ నీటి ప్రాజెక్టులు, బోరుబావుల కింద ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలకుపైగా వ్యవసాయ భూమిలో పంటలు సాగవుతున్నాయి. సుమారు 42 లక్షల ఎకరాలు వ్యవసాయ యోగ్యమైనప్పటికీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రతియేటా బీడు భూములుగానే మిగులుతున్నాయి. అందుబాటులో ఉన్న వ్యవసాయ భూములన్నీ పూర్తిస్థాయిలో సాగు చేయాలన్న దృఢనిశ్చయంతో సీఎం కేసీఆర్ చర్యలకు ఆదేశించారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీ గవాక్షం



నేషనల్ హైవే..!

జాతీయ రహదారి !
ముచ్చటైన పేరు
రాజసం ఉట్టిపడే పేరు
జాతీయతకు రాదారి అన్నట్టు
సమగ్రతకూ రాదారే
దేశం మొత్తాన్ని కలిపే దారి
నిజమే..ఈ కోణం నిజమే!
జాతీయ రహదారి
ప్రగతికి చిహ్నం
వేగానికి బిరుదం
కాలంతో పోటీదారు
ఆధునికతకు కొత్త పరదా
ఇదీ నిజమే..మరో ఇజం!
నున్నగా మెరిసే రోడ్డు
అద్దం లోటు తీర్చే రోడ్డు
సుఖ ప్రయాణపు చిరునామా
కొత్త తరానికి ఓ అయస్కాంతం
ఇదీ నిజమే..ఇన్ని నిజాలా నిజంగా?
రయ్యిన దూసుకెళ్తున్నప్పుడు
మరో కొత్త నిజం గుండెని తడుతుంది!

సిల్క్ రోడ్డు మీద నడక కూడా
పరుగులాగే ఉంటుంది
మరిక కారులో వెళుతుంటే..?
ఆకాశంలో రాకెట్ లానే ఉంటుంది!
అయినా మనస్సుకి ఆనందం అనిపించదేమి!
సంఘజీవనంలో మమేకమైనట్టు అనిపించదేమి!
కార్ల సమూహాలు కనిపిస్తాయ్ గాని
అవన్నీ ఒంటరి మనసుల చీకటి గూళ్లే!
పాత గతుకుల రోడ్డులో పోతుంటే..
కుదుపులతో ఒళ్లు కదులుతుంటే
జీవన కుదుపులు గుర్తుకొచ్చేవి
ఆ కుదుపుల నుంచి కర్తవ్యం తెలిసొచ్చేది
ఈ సిల్క్ రోడ్డులో గతుకుల్లేవ్
కుదుపులూ లేవ్
అందుకే సుఖమూ లేదు!
పాత రోడ్డు మీద పోతుంటే..
రెండుపక్కలా ఊళ్లు
జన సమూహాలు
కేరింతలు..ఉరుకులు పరుగులు!
జీవన సంకేతాలుగా
బడ్డీకొట్లు..చిల్లరకొట్లు
టీ కొట్లు..టైర్ పంక్చర్ షాపులు
వాగులు..వంకలు
వాటితో పల్లె జీవితాల ప్రవాహాలు!
కళ్లనే కాదు మనసునీ మురిపించేవి!
జనాలతో కలిసి ఉన్నామన్న భరోసా
పల్లె జీవితాల పండు వెన్నెలకు
ప్రతిబింబాలుగా ఆ పాత రోడ్లు

నేనొక సంఘజీవినన్న భావన
భిన్న సంస్కృతుల నాదాలు
ఉన్నవాడు లేనివాడు కలగలసి
నడుస్తుంటే వినిపించే అడుగుల సవ్వడులు
ప్రయాణమంటే ప్రాణవాయువు అనిపించేది
కాని ఈ సిల్క్ రోడ్డు వెంబడి
ఆ జనజీవితం కనిపించదేమి!
కీకారణ్యంలో పోతున్నట్టున్నదేమి!
నా ప్రయాణంలో జీవం లేదేమి!
ఈ సువిశాల సిల్క్ రోడ్ల కన్నా
సన్నని ఇరుకు రోడ్లు..గతుకుల రోడ్లు..
రెండు కార్లు ఎదురుపడితే ట్రాఫిక్ జామ్లు
ఆగిపోయిన అరగంటలో ఎన్నెన్నో స్మృతులు
పల్లె జీవితపు ఆనవాళ్లను గుండె నిండా
భద్రపరుచుకునే వెసులుబాటది!
కారులో ఒంటరిగా వెళుతున్నా ఒంటరితనం
లేదు
మనకు తోడెవ్వరూ లేరన్న బాధ లేదు!
ఎందరితోనో కలిసి ప్రయాణిస్తున్న అనుభూతి
మనం ఒక్కరమే అయినా
అదొక సామూహిక ప్రయాణమే!
ఎక్కడికక్కడే కొత్త ప్రయాణికులు
ప్రతి క్షణం కొత్తదనమే
ఆ పరిసరాల సమ్మోహనంలో
ట్రాఫిక్ జామ్ సంగతే తెలిసేది కాదు
కాని అప్పుడు వాటి విలువ తెలీలేదు
ఆనందించాం గాని అనుభవించలేదు
ఇష్టపడ్డాం కాని ఇంటికి మోసుకెళ్లలేదు

జాతీయ రహదారులొచ్చాయ్
తెలుగు ఉచ్చారణ చూసి జాతీయత అనుకున్నాం
నేషనల్ హైవేస్ అని ఆంగ్లంలో గొప్పగా అనుకున్నాం
ఆత్మీయులతో కలిసి ప్రయాణిస్తున్నా..
ఆనందించలేకపోతున్నాం!

కారు అద్దంలోనుంచీ ఎదురుగా
రోడ్డు చూస్తూ కూచోడం మినహా
రోడ్ల పక్క చూసేందుకు ఏమీ లేదు
అటుఇటు ఆనాటి సందడి లేదు
అప్పటి జన తిరునాళ్లు లేవు
ఆ దుకాణాలు లేవు..టీ కొట్లు లేవు
కిలోమీటర్ల పొడవునా ఎడారి
నిశ్శబ్దం..నిర్మానుష్యం!
ఆ జనాలు ఏరీ..ఎక్కడ?
ఆ ఊళ్ల ఆనవాళ్లెక్కడ?
జీవన భృతికి గండి పడింది
సహజ జీవనం గాడి తప్పింది
లోతైన వెలితి రోడ్డునిండా కప్పుకుంది!
నున్నగా మెరిసే పెద్ద రోడ్డయితే వచ్చింది గాని
సాఫీగా సాగిన జీవితాల్ని కకావికలు చేసింది
టీ స్టాళ్లు..కాకా హోటళ్లు..దాబాలు పోయాయి
కార్పొరేట్ హోటళ్లు వచ్చాయి..
జాతీయ రహదారి వచ్చి జాతీయతకే సవాల్ విసిరింది
అది అలాంటిలాంటి సవాల్ కాదు
భారతీయ జీవనసాంద్రతనే పలుచన చేసింది
సంఘ జీవనానికి సమాధి కట్టింది
మనిషికి మనిషికి మధ్య అగాధమై నిలిచింది
ప్రగతి చిహ్నాలు ప్రగతినే సమాధి చేస్తాయా?
ఒకప్పుడు ఊహించలేకపోయిన అమాయకుణ్ణి!
ఇప్పుడు తెలిసినా ఏమీ చేయలేని అసహాయుణ్ణి!!

- వయ్యెస్సారెస్
9000013367

అనంత పద్యాలనంత మధురం

ప్రాచీనకాలం నుండి తెలుగు ప్రాంతాలన్నింటి పద్యకవిత్వం విరివిగా వస్తున్నది. నేటికీ తన ప్రభావాన్ని చాటుకుంటూనే ఉన్నది. ప్రతి ప్రాంతంలోను తమ ప్రత్యేకతను చాటుకుంటూ కవులు పద్యరచనలు గావించారు, గావిస్తున్నారు. పద్యరచనల పట్ల, పద్యకవుల పట్ల అభి మానం, గౌరవభావం గలిగినవారు ఆ కవులను సాహిత్య ప్రపంచానికి పరిచయం చేస్తూ వస్తు న్నారు. కొందరు తమకు అందుబాటులో ఉన్న కవులను పరిచయం చేసి సరిపెట్టుకుంటారు. మరికొందరు పరిశోధించి, సమాచారం సేకరించి బృహద్గ్రంథాలను వెలువరిస్తారు. ఈ రెండవకోవకు చెందినవారు డాక్టర్ అమళ్ళదిన్నె వేంకట రమణ ప్రసాద్. పరిశోధించి, సమా చారం సేకరించి అనంతపురం జిల్లా పద్యకవులను మనముందు నిలిపారు రమణప్రసాద్. ఇది 800ల పేజీలకు విస్తరించిన బృహద్గ్రంథం. ఈ మహా గ్రంథం ఆయన శ్రమకు నిదర్శనంగా నిలిచింది.

సాహిత్యాన్ని కొందరు ప్రాణప్రదంగా భావిస్తారు. దానిలో అమితానందాన్ని చవిచూస్తారు. ఆ ఆనందం కోసం ఎంతటి శ్రమనైనా భుజానికెత్తుకుని అనుకున్నది సాధిస్తారు. అటువంటి వారిలో డా॥అమళ్ళదిన్నె వేంకట రమణ ప్రసాద్ ఒకరు. ప్రసాద్ అవధానిగా, పద్యకవిగా పేరెన్నిక గన్నవారు. పద్య రచన పట్ల ఆయనకు మక్కువ ఎక్కువ. తాను పద్య రచనలు గావించటం వరకు మాత్రమే చేయడం గాకుండా తాను నివసిస్తున్న అనంతపురం జిల్లా పద్యకవులను సాహిత్య ప్రపంచానికి పరిచయం చేయాలని సంకల్పించుకొని ఆ దారిలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ముందుకే నడిచి ఒక బృహద్గ్రంథాన్ని అందించారు. ఇది వ్యయప్రయాసలతో కూడిన పనైనా అనితర సాధ్యమైన కృషి సల్పి దాదాపు 800పేజీల గ్రంథాన్ని వెలువరించి సఫలీకృతులైనారు. ఈ గ్రంథానికైన, యావత్తు ఖర్చువారే భరించారు. ఇదంతా వేంకటేశ్వరుడి సహాయమేనని అంటూ ముద్రణ సహాయమందిన పుస్తకముల/నీదు మూర్తిని ముద్రించు నియమముండె/నీవు డబ్బివ్వకుండినన్ నిలుపుకుంటి/అసలు నీ సహాయములేని అడుగు కలదె!/స్వామి శ్రీవేంకటేశ్వర! శరణు తండ్రి అంటూ వేంకటేశ్వరుని దేరొకిన పుస్తకాన్ని ప్రారంభించారు వేంకట రమణ ప్రసాద్. ఈ ప్రస్తావన వెనుక ఆయన ఎంతటి శ్రమను అనుభవించినారో వెంకటేశ్వరున్ని వేడుకోవటంలోని ఆర్తిలో కనిపిస్తుంది. సరే అది అలా ఉంచితే ఈ గ్రంథంలోని విషయాలలోకి వస్తే మొత్తం 350మంది కవులను గూర్చి వారి రచనలలోని వైశిష్ట్యాన్ని సవివరంగా వివరించారు ప్రసాద్.

కరువు ప్రాంతంగా అనంతపురాన్ని చెపుతారు. అయితే సాహిత్యం విషయంలో సుసంపన్నమైనదిగా, సిరులు పండించిన ప్రాంతంగా అనంతపురం కనిపిస్తుంది.

"క్షామములెన్ని వచ్చిన రసజ్ఞత మాత్రము చావలేదు. జ్ఞానావృత వృష్టికిన్ కొరతనంద దనంతపురంబుచూడుడీ" అంటారు రమణ ప్రసాద్. అది అక్షర సత్యమని ఈ గ్రంథం రుజువు చేస్తుంది. **చదలమీద సూర్యచంద్రులుండెడిదాక/ ఉర్వి మీద కొండలుండువరకు/జగతివరలు వరకు శబ్దార్థ సంక్రాంతి/బ్రతికియుండు తెలుగు పద్య కవిత** అని పద్యం గురించి నండూరి వారన్న పద్యాన్ని మొదటిపేజీలోనే దర్శన మిస్తుంది. పద్యానికి మరణం లేదంటారు ఈ గ్రంథంలో ప్రసాద్.

'వేల సంవత్సరాల నుండి సనాతన భారతీయ సంస్కృతి ని సమాజానికి హృదయగమంగా అందిస్తున్న తెలుగు పద్యం విశాలాంధ్ర దేశంలో సర్వాంతర్యామి ఛందస్సులో అందంగా ఒడుపుగా విలీనమైన తెలుగు పద్యం సొగసుగా అయాత్మ కంగా, నవరస భరితంగా, ఆ పాత మధురంగా, ఆలోచనాత్మకంగా అనంతపురం జిల్లాలోనూ విస్తరిల్లి వికసించింది" అంటారు రచయిత.



రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ బేవినహళ్ళి కరణము కృష్ణారావు, కల్లారి వేంకట నారాయణ రావు, బెళ్లూరి శ్రీనివాసమూర్తి, కుంటిమద్ది శేషశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు, విద్వాన్ విశ్వం, తక్కెళ్ళపల్లి పాపాసాహెబులను అనంత అష్టదిగ్గజ కవులు అంటూ కొనియాడతారు రమణ ప్రసాద్. మొదటి పేజీల్లోనే వారి ఫొటోలలోనిచ్చారాయన.

ఇందులో అనంతపురం జిల్లాకు చెందిన పద్యకవులు 259మంది సాధన పత్రిక ఆదరించిన పద్యకవులు 24మంది, అనంతానుబంధ కవులు 67మంది మొత్తం 350మంది ఉన్నారు. వీరు తెలిపిన కవులు 1803 జన్మించినవారి నుండి నిన్న మొన్నటి ఆధునిక పద్యకవుల వరకు ఈ గ్రంథంలో చూడవచ్చు.

"ఇంద్రగ్రావచితోన్నతామిత మణీహేరాళ సోపాన భా/ కృంద్ర ప్రస్తార వేదికానికరమై సౌధాగ్ర భాగ్యోన్నమ/ త్సాంద్ర ద్యోతిత కేతనాంబర మరుత్సంపీడితాంభోదరమై/ ఇంద్రప్రస్థపురం బు భాసిలె మహాహేమోజ్వలాగారమై" అంటూ రత్నాకరం అప్పకవి ఇంద్రప్రస్థపురాన్ని వర్ణించిన పద్యం మొదట్లోనే దర్శనమిస్తుంది. ఎన్నో నాటకాలు రచించిన ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారి గురించిన సమాచారం ఈగ్రంథంలో లభిస్తుంది. సాధన పత్రిక స్థాపించి సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషలలో పాండిత్యాన్ని గడించడమే గాకుండా,ఎందరో కవులను ప్రోత్సహించిన రామాచార్యుల గురించి వివరించిన సమాచారంతో పాటు వారు రాసిన పద్యాలు కొన్ని ఈ గ్రంథాలలో లభిస్తాయి.

"రాటమా! కాదు- పోరాటంబులుడిగించు/విష్ణుచక్రంబిద్ది పృధివియందు/రాటమా! కాదు ఆరాటంబు బోకార్చు/ కల్పవృక్షంబిద్ది ఖండితముగ/రాటమా/కాదుపో కాటకంబుల ద్రోలి/కడుపు నిండించెడి కన్నతల్లి" అంటూ రాట్నం గురించి రాసి తెప్పించిన కల్లూరి అహోబలరావు గురించి ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చును. అలాగే ఆయన రాసిన వివిధ కావ్యాల ప్రస్తావన వాటిలోని పద్యాల తీరును వేంకటరమణ ప్రసాద్ చక్కగా వివరించారు.

కలగోడు అశ్వత్థరావు, బత్తలపల్లి నరసింగరావు, కల్లూరి వేంకటనారాయణరావు, రొద్దం హనుమంతరావు, పైడి లక్ష్మయ్య రాప్తాటి ఓబిరెడ్డి వంటి కవులు గురించి, వారి పద్య ప్రతిభ గురించి ఈ గ్రంథంలో చూడవచ్చు. అనంతపురం జిల్లాలో ప్రబంధమార్గమున చక్కని పద్యకావ్యాలందించిన కొద్దిమంది కవులలో బ్రహ్మశ్రీ గుంటి సుబ్రహ్మణ్యశర్మగారును చిరస్మరణీయులు అంటారు రమణప్రసాద్ సుబ్రహ్మణ్య శర్మగారి గురించి రాసిన వ్యాసంలో.

రాచర్ల తిప్పయ్యగుప్త, భట్టు రత్నాకరం వేంకటేశ్వరులు, బెళ్లూరి శ్రీనివాసమూర్తి, మఠవాసుదేవమూర్తి, వేదాంతం నరసింహారెడ్డి, పాళ్లూరు సుబ్బణాచార్యులు, బండిమీదపల్లి భీమారావుల వంటి పద్యకవుల ప్రతిభ ఎలాంటిదో ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. **పూలు పత్రియు నీకిడ జాల నఖల/ పుష్పలతాఘన భుజయుంతకు/వలయముండగ నీయందె, పత్రసుమము/లిడుట కంటెను వెఱ్ఱివేరెద్ది గలదు/వృష భపురివాస/ చంద్రమౌళీశ! ఈశ!** అని సర్వేశ్వరుణ్ణి హేతువాద తాత్త్విక చింతనలతో బండిమీదపల్లి భీమరావు కవిగారు స్తుతిస్తారంటారు రమణప్రసాద్.

"పాకిస్థానము పూర్వ పశ్చిమ దిశాభాగంబులన్ జేరి, వా/ణీ కాల్ ద్రువ్వుచునున్న దోర్చు మన తూష్ణీంబావమున్ జూచిపై/పై కత్తుల్ ఝుళిపించుచున్నదిక.../కాశ్మీర సమస్య తీరదు గదా! కం జాత జాతంగనా" ఈ పద్యం 1958లో కుంటిమంది శేషశర్మ రాసినది. ఆనాడు ఈ కవి రాసిన పరిస్థితులే నేటికీ కనిపిస్తున్నాయి. ఈ పద్యం ఈ గ్రంథంలో చూడవచ్చు. **తీరిపోయినవా నాటి దివ్యకళలు/జీర్ణమైపోయెవానాటి జీవశక్తి/కాలమను హోంత కారి కుస్తీ ఎందు/జీల్చివైచెను మన సుధాజీవనంబు...** అంటూ వేదనగా పుట్టపర్తి నారాయణాచార్యులవారు పలికిన పద్యం ఇందులో లభిస్తుంది. అలాగే వారు రాసిన అనేక పద్యాలు, వారి గురించి అనేక విషయాలను ఈ గ్రంథంలో చూడవచ్చు.

మాడుల వెంకటరామశాస్త్రి, తలమర్ల కళానిధి వంటి కవుల గురించి ఈ గ్రంథంలో ఇచ్చారు రచయిత. **"అచట నొకనాడు పండెముత్యాలచాలు/ అటనొకప్పుడు నిండె కావ్యాల జాలు/అచట నొకప్పుడు కురిసె భాష్యాల జల్లు/ విరిసెనట నాడు వేయుంచు విచ్చు కత్తి"** ఇది విద్వాన్ విశ్వం రాసిన పెన్నేటి పాట కావ్యంలోనిది. వారి గురించిన సమాచారం ఈ గ్రంథంలో సాధ్యమైనంతవరకు ఇందులో పొందుపర్చారు రమణ ప్రసాద్. కె.వి.సుబ్బారావు, గంటి కృష్ణవేణమ్మ, జి.వి. గోవింద రాజమ్మ, పుట్టపర్తి కనకమ్మ, గొల్లపిన్ని రామలక్ష్మమ్మ, కొలకలూరి స్వరూపరాణి వంటి కవయిత్రులు ఇందులో దర్శనమిస్తారు. కోగిర జై సీతారాం, లంక కృష్ణమూర్తిల గురించి తెలుసుకోవచ్చు. **"ప్రభువులకు ధనికులకు మాత్రమ్మె అందుబాటులో నుండు వేంకటేశ్వరుడంతడు/ వడ్డీకాసుల వాడను చెడ్డనింద/ బాపుకొనుమయ్య నరసుర ప్రభువరేణ్య"** అంటూ అభ్యర్థిస్తాడు తకెళ్లపల్లి పాపా సాహెబ్. ఈ పద్యం ఈ గ్రంథంలో లభిస్తుంది. అలాగే ఆయన రాసిన పద్యాల విశ్లేషణను కూడా చూడవచ్చు. దాదాన చిన్నయ, యజమానం రామకృష్ణశర్మ, ధర్మవరం సాకె రామకృష్ణ, ఎస్ గంగప్ప, ముప్పగౌని నాగేంద్ర గౌడు, జోస్యం విద్యాసాగర్, బసవరాజు సీతారామారావు, ఆశావాది ప్రకాశరావు, నందవరం కేశవరెడ్డి, గండ్లూరి దత్తాత్రేయశర్మల పద్యాల విశ్లేషణను గమనించవచ్చు.


"అమ్మ మాటను దాటని ఆత్మ జుండు/తండ్రి యాజ్ఞతల దాల్చు తనయుడతడు/అనుజులందర ప్రేమించు అన్నయతడు/ అందరికినన్న రామన్న యౌనుగాదె" అంటూ రాయుణ్ణి గురించి రాసిన సుంకర వెంకమాంబ కవిత్వం గురించి ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. టి.హెచ్.నటరాజరావు, మాడుగుల నాగఫణిశర్మ, బ్రౌన్ గురించి కూడా ఇందులో ఇచ్చారు ప్రసాద్.

"చింతా విద్యుత్ ప్రేరిత/కుంతంబునసరులలోని క్రోధంబు నుబల్ /పంతంబున దొడరి పొడచి/సుంతయు నొప్పింపకుండ సోలించెరిన్" అంటూ గాంధీ మహాత్ముని గురించి రాసిన రూపనగుడి నారాయణరావుగారి గురించి ఇందులో చూడవచ్చు. రూపనగుడి నారాయణరావు, నండూరి రామకృష్ణమాచార్య , మానా ప్రగడ శేషశాయి, ఆర్.ఎస్.సుదర్శనం, తుమ్మపుడి కోటేశ్వరరావు, కొలకలూరి ఇనాక్, పువ్వాడ తిక్కన సోమయాజి , రేవూరు అనంతపద్మనాభరావు వంటి కవులకు సముచిత స్థానమిచ్చి వారి పద్య ప్రతిభను వివరించారిందులో రమణ ప్రసాద్.

శాసనాలలో అనంతపద్య వివరాలు ఇందులో లభిస్తాయి. 800పేజీలకు విస్తరించిన ఈ గ్రంథం గురించి తెలియ జేయాలంటే మరో గ్రంథం రాయాల్సి వుంటుంది. ఇంతటి బృహత్తర గ్రంథాన్ని అందించి తన పద్య కవితా ప్రేమను చాటుకున్నారు డా॥అమళ్లదిన్నె వేంకట రమణ ప్రసాద్. ఈ మహత్తర కావ్యంలో పాలుపంచుకున్న వేంకటరమణ ప్రసాద్ గారి ఇల్లాలు విశలదేవుని సుజాతతో పాటు అందరూ అభినందించవలసినవారే.

- నియోగి
9553097319

విమర్శకు వన్నెతెచ్చిన రాళ్ళపల్లి



తెలుగు సాహిత్య విమర్శ అనగానే గుర్తుకు వచ్చే మహనీయుల్లో రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ ఒకరు. ఈయన విమర్శకులుగా, కవిగా, అనువాదకులుగా, గ్రంథ పరిష్కర్తలుగా, సంగీత విద్వాంసులుగా ప్రఖ్యాతి పొందినవారు. ఆంధ్రదేశంలోనే కాక కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలలోనూ విజయపతాకం ఎగరేసిన సాహిత్య సంగీత కళానిధి.

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ అనంతపురం జిల్లా, కంబదూరు మండలం, రాళ్లపల్లిలో 1893 జనవరి 23న జన్మించారు. వీరి తల్లి అలమేలు మంగమ్మ, తండ్రి కర్నమడకల కృష్ణమాచార్యులు. సుప్రసిద్ధ జ్యోతిశ్శాస్త్రవేత్తలు. రాళ్లపల్లి గోపాల కృష్ణమాచార్యులు వీరికి అన్న. శర్మగారిని చిన్నప్పుడు వీరి మాతామహి లక్ష్మమ్మ దత్తపుత్రునిగా స్వీకరించారు. వీరికి తండ్రిగారే అక్షరాభ్యాసం చేయించి, సంస్కృత, తెలుగు కావ్యాలు చదివించి మొదటి సాహిత్య గురువయ్యారు. తల్లి చిన్నప్పటి నుండి జానపద, భజన పాటలు చెప్పించి సంగీత గురువులైనారు. తర్వాత 1906లో చదువుకోసం మైసూరుకు వెళ్లారు. అక్కడ చామరాజేంద్ర సంస్కృత పాఠశాల లోనూ, శ్రీపరకాల మఠంలోనూ వీరి విద్యార్థి దశ గడిచింది. రాళ్లపల్లి వారికి పేరు మోసిన సంస్కృత విద్వాంసులు చామరాజ నగరం రామాశాస్త్రి, శ్రీ పరకాల మఠ శ్రీకృష్ణ బ్రహ్మ పరతంత్రులు సంస్కృత కావ్యాలను, నాటకాలను బోధించారు. ఆ కాలానికి రాళ్లపల్లివారు చదివిన తెలుగు కావ్యాలు అంటే కూచిమంచి తిమ్మకవి రాసిన 'అచ్చతెలుగు రామాయణము'. 'నీలా సుందరీ పరిణయము' మాత్రమే. శర్మగారికి 1910లో కట్టమంచి రామలింగారెడ్డి పరిచయభాగ్యం లభించింది. సాయంకాలం పూట శర్మగారు తిక్కన భారతం చదువుతూ ఉంటే కట్టమంచి వారు వ్యాఖ్యానం చేస్తుండేవారు. ఉన్నట్టుండి కట్టమంచివారు పదిహేడేళ్ల శర్మగారిని మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండితులుగా 1912 జూలై 2న నియమించారు. రాళ్లపల్లి వారు ఒకచోట కట్టమంచి వారి గురించిలా చెప్పారు. ''ప్రాత ప్రపంచముననే ప్రాకులాడుచున్న నాకు వారి తోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరచి ఆహ్వానించినది''.

కట్టమంచి వారి శిష్యరికం వల్ల ఆంగ్ల సాహిత్య ప్రభావంతో రాళ్లపల్లివారు 'తారాదేవి' 1911, 'మీరాబాయి' 1913 ఖండకావ్యాలను రచించారు. కాకినాడ నుండి వెలువడే సరస్వతి మాసపత్రికలో ఒకటి. రాజమండ్రి నుండి వెలువడే మానవసేవ మాసపత్రికలో మరొకటి అచ్చయ్యాయి. కానీ ఈ రెండు కావ్యాలు మూడు వందల ప్రతులకే పరిమితమయ్యాయి. అలాగే ఈ పత్రికల్లో వెలువడిన కారణంగా ఎక్కువ ప్రచారానికి నోచుకోలేకపోయాయి. అనంతకృష్ణశర్మ కొన్ని సంస్కృత కావ్యాలను, నాటకాలను తెలుగులోకి అనువదించి తమకే తృప్తి కలగనందువల్ల వాటిని అచ్చువేయలేదు. వీరు కాలక్రమంలో 'పెను గొండ కొండ', 'శమీపూజ', 'సంధ్యావం దనము' మొదలైన విశిష్టమైన కవితల్ని రచించారు. రాళ్లపల్లి శమీపూజ, పెనుగొండ కొండ, చిరకాలం నిలబడే ఉత్తమ కవితలని కవిసమ్రాట్ విశ్వనాథ వారు ప్రశంసించారు.

రాళ్లపల్లి వారు హాలుని 'గాథాసప్తశతి' లోని 738 ప్రాకృత గాథలను అనువదించగా ఆంధ్రసారస్వత పరిషత్తు 1964లో ప్రచురించింది. 'గాథాసప్తశతి' అనువాదాలలో రాళ్లపల్లి వారి కృతి శ్రేష్టతమమైనదిగా భావింపబడుతున్నది. జాయపసేనాని 'నృత్త రత్నావళి' 1969 లోనూ, 'సుందర పాండ్య విరచిత ఆర్యా'ను 1970లో అనువదించి సాహిత్య ప్రియుల మన్ననలను పొందారు.

శర్మగారు 1949 నుండి దాదాపు ఏడేళ్ల పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనిచేసి తాళ్లపాక వారి సంకీర్తనలు 12 సంపుటాలను తీసుకొచ్చారు. అంతేకాకుండా, 108 సంకీర్తనలకు స్వరకల్పన చేసి ప్రచురించారు.

అనంతకృష్ణశర్మ ప్రధాన క్షేత్రం విమర్శ. దీనికి నిదర్శనంగా వీరి కలం నుండి వచ్చిన విమర్శ గ్రంథాలే సాక్షాలుగా నిలుస్తాయి. వీటిలో 'వేమన' 1929, 'నాటకోపన్యాసములు' 1935, 'సారస్వతాలోకము' 1954, 'రాళ్లపల్లి పీఠికలు'1979, 'రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ సాహిత్య సంగీత వ్యాసాలు' 2017, 'వదరుబోతు', (1932, 1986, 2017)వ్యాస సంకలనంలో శర్మగారు రెండు వ్యాసాలు రచించడంతో పాటు, దానికి 'ప్రస్తావన' కూడా వెలయించారు. రాళ్లపల్లివారు సాహిత్యంలోనే కాకుండా సంగీతంలో కూడా పేరు ప్రఖ్యాతులు పొందారు. దీనికి గుర్తింపుగా మైసూరులో జరిగిన 4వ సంగీత సమ్మేళనంలో 'గాన కళాసింధు', బెంగళూరు గాయన సమాజం వారిచే 'సంగీత కళారత్న' బిరుదులతో సత్కరింపబడ్డారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ శర్మగారి సంగీతశాస్త్ర ప్రతిభను గుర్తించి 1970లో ఫెలోషిప్ నిచ్చి గౌరవించింది. వీరి కృషిని గుర్తించి అదే సంవత్సరం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాళ్లపల్లి వారికి గౌరవ డా. లిట్ పట్టాలిచ్చింది.

1979లో రాళ్లపల్లి అభిమానులైన శ్రీఘట్టమరాజు అశ్వత్థనారాయణ, డా॥ఆర్వీయస్ సుందరం, బెంగళూరులో 'అనంతరాగం' అనే అమూల్యమైన అభినందన గ్రంథాన్ని అర్పించి రాళ్లపల్లి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సభకు అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులైన డా॥బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులైన శ్రీకె.వి. గోపాల స్వామిగారు ప్రధాన అతిథులుగా విచ్చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు 1979 మార్చి 11 సాయంకాలం బెంగళూరులో పెద్దకుమారుడు ఫణిశాయి గారి ఇంట్లో రాళ్లపల్లి వారిని టి.టి.డి. ఆస్థాన విద్వాంసులుగా నియమించి, సత్కరించిన కొన్ని క్షణాలకే రాళ్లపల్లి వారు పరమపదించారు. శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు తెలుగు సాహిత్య ప్రపంచంలో గొప్ప వ్యాసకర్తగా, విమర్శకులుగా, అనువాదకులుగా, సంగీత కళానిధిగా ప్రాతఃస్మరణీయులుగా నిలిచి ఉన్నారు.

(జనవరి 23 రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి 125వ జయంతి సందర్భంగా)

- బడిగె ఉమేశ్
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
9494815854

సాహిత్య వార్తలు

డాక్టర్ ఎన్.గోపి 'జలగీతం'కు లక్ష్మీనారాయణ జైనీ సాహితీ పురస్కారం

డా॥ ఎన్.గోపి రచించిన జలగీతం కావ్యానికి లక్ష్మీనారాయణ జాతీయ సాహితీ పురస్కారాన్ని జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రకటించింది. 2018 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ పురస్కారం కింద లక్షరూపాయల నగదుతో పాటు సత్కారముంటుంది. జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు ప్రకటించిన తొలి పురస్కారమిది. ఇలానే ప్రతి సంవత్సరం ఈ పురస్కారాన్ని మంచి పుస్తకాలకు అన్ని ప్రక్రియల్లో ఇవ్వబడతాయని సంస్థ ప్రకటించింది.

- బిక్కి కృష్ణ (జాతీయప్రధాన కార్యదర్శి) ప్రభాకర్ జైనీ (ఛైర్మన్)
జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, హైదరాబాద్

డా. పత్తిపాక మోహన్‌కు 'జానుడి సాహిత్య పురస్కారం'

బాల సాహితీవేత్త డా. పత్తిపాక మోహన్‌కు సుప్రసిద్ధ పద్యకవి, సాహితీవేత్త కీర్తిశేషులు మల్లవరపు జానుకవి జయంతి పురస్కారం 'జానుడి సాహిత్య పురస్కారం'ను ప్రకటించారు. జానుడి సాహిత్య సంస్థ స్ఫూర్తి ప్రదాత మల్లవరపు జానుకవి జన్మదినోత్సవం జనవరి 22వ తేదీన ప్రతియేడు ప్రదానం చేసే ఈ పురస్కారానికి ఈ 2017 సంవత్సరానికిగాను డా. పత్తిపాక మోహన్‌ను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. జనవరి 22, 2018న ఒంగోలులో జరిగే జానుకవి జయంతి సభలో ఈ పురస్కారాన్ని అందచేస్తారు.

- ఎలగొండ రవి - జిందం అశోక్
నిర్వాహక కార్యదర్శులు, మారసం.

ఉగాది జాతీయ స్థాయి కథల పోటీ

అక్షరాలతోవ సారథ్యంలో ఉగాది జాతీయ స్థాయి కథల పోటీ, నిర్వహిస్తున్నది. కథ తెలుగువారి నేపథ్యానికి సంబంధించినదై ఉండాలి. కథలు ఎ4 సైజు పేపర్‌లో చేతిరాతలో 5 పేజీలకు మించరాదు. హామీపత్రం జతపరచాలి. కథలు ఫిబ్రవరి 10లోపు చేరాలి. బహుమతులు వరసగా రూ.4000/-,రూ.3000/-రూ.2000/-రూ.1000/-ఇవ్వబడును. కథలు పంపవలసిన చిరునామా- దాసరాజు శ్రీనివాస్, ఇం.నెం. 11-9-166/1, లెనిన్‌నగర్, అసాధారణ్ హాస్పిటల్ వెనుక, ఖమ్మం-507001, తెలంగాణ, సెల్ 9010972169.

క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలి

ఆర్టీసీ బీసీ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గుండ్ల ఆంజనేయులు గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం బీసీ భవన్‌లో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం కొమ్ము ఉమాదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. టీఎస్‌ఆర్టీసీలో ప్రభుత్వ గుర్తింపు పొందిన బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 330/2016ను జాతీయ బీసీ సంక్షేమ సంఘానికి అనుబంధంగా చేస్తున్నట్లు అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, సెక్రటరీ జనరల్ హరికిషన్ ప్రకటించారు. నూతనంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సంఘం వైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య గౌరవ అధ్యక్షురాలుగా కొమ్ము ఉమాదేవి, అధ్యక్షులుగా ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.హరికిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.సాంబయ్య, కోశాధికారిగా ఎం.రవిశేఖర్‌తో పాటు మరో 20 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని, రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇందుకోసం త్వరలో పార్లమెంటు వద్ద భారీ ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి చట్టబద్ధమైన అవరోధాలు ఏమీ లేవని చెప్పారు. గతంలో పాలించిన వారికి చిత్తశుద్ధి లేకపోవడంతో ఇది సాధ్యం కాలేదని అన్నారు. కనీసం ఇప్పుడున్న పాలకులైన దీనిని అమలు జరిపేలా చూడాలన్నారు. బీసీలకు ఉద్యోగాల కోసం ఉన్న క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ కార్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వ ఉపాధి, శిక్షణ శాఖ ప్రత్యేక వెబ్ సైట్‌నురూపొందించింది. డబ్ల్యూ, డబ్ల్యూ, డబ్ల్యూ. ఎంప్లా యిమెం ట్.తెలంగాణ.గొవ్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొనవలసి ఉంటుంది. ఈ నెల 1వ తేదీ నుండి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అమలులోకి వచ్చింది. ఇక మీదట నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్ కార్డు కోసం ఉపాధి కల్పన కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి కార్డును పొందవచ్చు. ఈ విధంగా ఆన్‌లైన్‌లో పొందిన కార్డును మూడు సంవత్సరాలకు ఒక సారి పునరుద్ధరించుకోవలసి ఉంటుంది. ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్న నిరుద్యోగులు తమ వివరాలు కూడా ఈ వెబ్‌సైట్‌లో చూసుకొనే వెసులుబాటు కల్పించారు. వివరాలు నమోదు చేసుకున్న ఒకటి రెండు రోజుల్లోనే ఆన్ లైన్ లో ఎంప్లాయిమెంట్ కార్డును జారీ చేయడం జరుగుతుంది. ఎంప్లాయిమెంట్ కార్డు నమోదుకు అభ్యర్థి ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడీలు తప్పనిసరి. నిరుద్యోగి ఫోటో, నివాస ధృవీకరణ, కుల ధృవీకరణ, విద్యార్హతలు, ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసి ఉంటుంది. ఎంప్లాయిమెంట్ కార్డు నమోదుకు ఒకరికి ఒక సారి మాత్రమే అవకాశం కల్పిస్తారు.

ఆర్కిటెక్చర్లు, ఇంజినీర్లపై చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బిల్డింగ్ అనుమతులకు వస్తున్న దరఖాస్తుల్లో చాలా వరకు అసంపూర్తిగా ఉండడంతో లైసెన్స్ కలిగి ఉన్న సంబంధిత ఆర్కిటెక్చర్లపైనా, స్ట్రక్చరల్ ఇంజనీర్లు, టెక్నికల్ పర్సన్లపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా 51 మందికి నోటీసులు జారీ చేసింది. బిల్డింగ్ నిర్మాణాలకుగానూ అనుమతుల కోసం లైసెన్స్ కలిగిన ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్ల ద్వారా భవన యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ నియమ, నిబంధనలకు అనుగుణంగా అవసరమైన దస్తావేజులు సమర్పించకుండా నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేస్తున్నాలు. అలాంటి దరఖాస్తాలను హెచ్ఎండిఏ అధికారులు తిరస్కరించాల్సి వస్తోంది. లేదా షార్ట్ ఫాల్స్ (తక్కువగా ఉన్న దరఖాస్తులు) సమర్పించాల్సిందిగా నోటీసులు ఇవ్వాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు పలుమార్లు కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో బిల్డింగ్ అనుమతుల ప్రక్రియలో పెద్దఎత్తున కాలాయపన జరుగుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడానికి రెండు రోజుల క్రితం జీవోనెంబర్ 10ను జారీ చేసింది. ఈ జీవో ద్వారా మూడువారాల లోగా అనుమతులను జారీ చేయాల్సి ఉంటుంది.హెచ్ఎండిఏ 51 మంది లైసెన్స్‌దారులకు వారం రోజుల లోపు తగిన వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా లైసెన్సులు ఎందుకు రద్దు చేయకూడదో ఆ నోటీసులో కమిషనర్ వివరణ కోరారు. వివరణ అసమగ్రంగా ఉన్నా....స్పందించకపోయినా లైసెన్స్ రద్దు చేస్తామని కమిషనర్ చిరంజీవులు హెచ్చరించారు.

మందకృష్ణకు టీజేఏసీ మద్దతు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హక్కుల సాధన కోసం శాంతియుత వాతావరణం, ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమం చేస్తున్న మంద కృష్ణమాదిగపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడం సరికాదని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ అన్నారు. అరెస్టుకు నిరసనగా ఫిబ్రవరి 4న ఓయూలో చేపట్టనున్న 'కృష్ణమాదిగ నిర్బంధ వ్యతిరేక సభ'కు టీజేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓయూ జేఏసీ, వివిధ విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం కోదండరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణలో పౌర హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మంద కృష్ణ మాదిగను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోదండరామ్‌ను కలిసిన వారిలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డాక్టర్ వరంగల్ రవి, ఓయూ జేఏసీ, వివిధ విద్యార్థి సంఘం నేతలు ఆశప్ప, గ్యార నరేష్, కృష్ణమాదిగ, ముసావీర్, దర్శన్, సలీంపాషా, కోట రాజేష్, పల్లెర్ల సుధాకర్ మాదిగ, గోవింద్ నరేష్ మాదిగ, కొమ్ము శేఖర్, విష్ణు, నరేష్, ప్రేమ్, రామకృష్ణ పరుశురామ్, చిరంజీవి తదితరులున్నారు.

సుప్రభాత సేవలో సుప్రీం జడ్జి



తిరుమల, ప్రభన్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎకె.సిక్రి కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం వేకువజామున నిర్వహించే సుప్రభాత సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోకి చేరుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తికి తిరుమల జేఈవో శ్రీనివాసరాజు దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం పలుకగా జేఈవో శ్రీవారి నూతన సంవత్సర క్యాలెండర్, డైరి, తీర్థ ప్రసాదాలను అందచేశారు.

ఉన్నతవిద్యపై ముస్లిం విద్యార్థుల ఆసక్తి

- దేశ సగటును అధిగమించిన తెలంగాణ ముస్లింలు
- రాష్ట్రంలో ముస్లిం విద్యార్థులు 48,670
- అందులో విద్యార్థినుల శాతం 41.66
- ప్రభుత్వ ప్రోత్సాహకాలతో తగ్గిన డ్రాపౌట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో ముస్లిం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. జాతీయ స్థాయిని అధిగమించింది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలతో ఉన్నత విద్య పట్ల అత్యధికులైన ముస్లిం విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. మధ్యలో చదువు మానేసే అలోచనను విరమించుకుంటున్నారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఉచితాలు అందుబాటులోకి రావడంతో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇష్టపడుతున్నారు. విదేశాల్లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో సీట్లు సంపాదించడానికి పోటీ పడుతున్నారు. తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ముస్లిం విద్యార్థుల సంఖ్య 48,670 కాగా అందులో 41.66 శాతం మంది విద్యార్థినులు ఉన్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2016 -17 ఉన్నత విద్య పైన అఖిల భారత స్థాయిలో నిర్వహించిన సర్వేలో తెలంగాణకు సంబంధించి అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఉన్నత విద్యలో తెలంగాణ ముస్లిం విద్యార్థుల చేరిక జాతీయ సగటును అధిగమించింది. జాతీయ స్థాయిలో ఉన్నత విద్యలో చేరుతున్న ముస్లిం విద్యార్థులు 4.87 శాతం కాగా తెలంగాణలో చేరుతున్న ముస్లిం విద్యార్థులు 8.11 శాతం వరకు ఉన్నారని సర్వే వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులసంఖ్య 3,57,05,905 కాగా, అందులో ముస్లిం విద్యార్థులు 17,39,218 మంది ఉన్నారు. దేశంలో ముస్లిం జనాభా 14 శాతం కాగా ఉన్నత విద్యలో చేరుతున్న ముస్లిం విద్యార్థులు 4.87 శాతం వరకు ఉన్నారని సర్వే పేర్కొంది. అయితే తెలంగాణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 14,38,737 కాగా అందులో ముస్లిం విద్యార్థులు 1,16,803 మంది వరకు ఉన్నారు. జమ్మూ కాశ్మీర్, కేరళ, అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ ఉన్నత విద్యలో ముస్లిం విద్యార్థుల సంఖ్య తక్కువే. దక్షిణాదిలో కేరళ తర్వాత తెలంగాణ రెండవ స్థానంలో నిలుస్తుంది. కేరళలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ముస్లిం విద్యార్థులు 11.74 శాతం కాగా, జమ్మూ కాశ్మీర్‌లో 35.84 శాతం, అస్సాంలో 12.89 శాతంగా గుర్తించారు. తెలంగాణలో ఉన్నత విద్యా సంస్థల్లో చేరుతున్న ముస్లిం విద్యార్థులు 8.11 శాతం కాగా బీహార్‌లో ఈ సంఖ్య 8.73 శాతంగా నమోదయింది. 2014 -15లో ఉన్నత విద్యలో చేరిన ముస్లిం విద్యార్థులు 6.8 శాతం కాగా రెండేళ్ల స్వల్ప వ్యవధిలో ఈ సంఖ్య 8.11 శాతానికి చేరింది. ప్రభుత్వం అనేక విధాలుగా తీసుకుంటున్న చర్యలు, ప్రోత్సాహకాలు, రాయితీల కారణంగా ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో చేరుతున్నారు. పేదలకు చదువు భారం కారాదని తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ముస్లిం ఉన్నత విద్య పట్ల ఆకర్శితులవుతున్నారు. మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య కూగా గణనీయంగా తగ్గిందని అధికారులు పేర్కొన్నారు. అక్షరాస్యత పరంగా తెలంగాణ ముస్లింలు ఎస్సీ, ఎస్టీలకంటే అధికం. పేదరికం కారణంగా ఉన్నత విద్య స్థాయిలో ముస్లిం విద్యార్థుల డ్రాపౌట్లు ఎక్కువగానే నమోదయ్యేది. ప్రభుత్వం గత రెండు మూడేళ్లుగా తీసుకుంటున్న చర్యలతో ఉన్నత విద్యా సంస్థల్లో చేరుతున్న ముస్లిం విద్యార్థినీ, విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. విదేశీ విద్య పట్ల ఆసక్తి కనబరుస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతుంది. గతంలో పాఠశాల స్థాయిలో ముస్లిం విద్యార్థుల చేరిక 11.5 శాతం కాగా ఇంటర్మీడియట్ స్థాయికి వచ్చే సరికి 5 శాతానికి మించేది కాదు. పేద ముస్లింలకు విద్యతో పాటు సామాజిక, ఆర్థికసాధికారత దిశగా తీసుకుంటున్న చర్యల ఫలితంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితులు కుదుటపడటంతో పిల్లలను ఉన్నత చదువులు చదివించడానికి ఇష్టపడుతున్నారు.

ముస్లింల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 1250 కోట్ల వరకు ఖర్చు చేయడానికి సమాయత్తం కావడం, 206 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం, బీసీ ఎస్సీ, ఎస్టీలతో సమానంగా బోధనాఫీజులను తిరిగి చెల్లించడం, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సింగపూర్‌లో ఉన్నత చదువుల కోసం రూ. 20 లక్షల వరకు ఆర్థికసహాయం అందించడం, రెసిడెన్షియల్ స్కూళ్లలో పౌష్టికాహారం, దుస్తులు, పుస్తకాలు ఉచితంగా అందించడంతో ముస్లిం విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ముస్లింలకు విద్య, ఉపాధి రంగాల్లో 12 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కూడా తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ లక్ష్య సాధనలో అవరోధాలను అధిగమించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. రాబోయే రోజుల్లో ముస్లిం మైనారిటీలకు మరిన్ని ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించనుంది. ముస్లింలలో పేదరికాన్ని పారదోలేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ వెల్లడించారు. ఇప్పటికే చర్యలు ప్రారంభించామని వివరించారు.

ఏప్రిల్‌లోనే పాఠ్యపుస్తకాలు

- మొదలైన ఉచిత పుస్తకాల ముద్రణ
- అమ్మకపు పుస్తకాలకు టెండర్ ప్రక్రియ పూర్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం కంటే ముందే పాఠ్యపుస్తకాలు ప్రభుత్వ బడులకు చేరనున్నాయి. గత ఏడాది జూన్ నెలలో పాఠ్యపుస్తకాలను స్కూల్స్‌కు చేరవేగా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఇవ్వడానికి పాఠశాల విద్య శాఖ చర్యలు తీసుకుంది. పాఠశాలలకు ఏప్రిల్ 12 నుంచి వేసవి సెలవులు ఉన్నందున అప్పటి లోగానే పాఠ్యపుస్తకాలను జిల్లాలకు పంపించాలని విద్యాశాఖ నిర్ణయించింది. జూన్ 1 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అయినప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. 2017-18 సంవత్సరంలో చేరిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల ముద్రణను చేపట్టింది. ఇప్పటికే ఉచిత పుస్తకాలకు సంబంధించిన ముద్రణను ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలో ప్రారంభించగా... అమ్మకపు పుస్తకాల ముద్రణకు సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసింది. త్వరలోనే అమ్మకపు పుస్తకాల ముద్రణను ప్రారంభించనున్నారు.

2.16 కోట్ల పుస్తకాలు అవసరం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ అన్ని కలిపి 41,286 వరకు ఉన్నాయి. వాటిలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 60 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మొత్తంగా 2.16కోట్ల పుస్తకాలు అవసరం ఉంటాయి. వాటిలో 1.80 కోట్లు ఉచిత పుస్తకాలు అవసరం ఉండగా, మరో 86 లక్షల అమ్మకపు పుస్తకాలు అవసరం ఉంటున్నాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొన్ని ప్రైవేటు స్కూల్స్ సిలబస్‌ను వేరుగా ఉంటున్న నేపథ్యంలో వారు ప్రభుత్వం ముద్రిస్తున్న పుస్తకాలను కాకుండా ఇతర పాఠ్యాంశాలు ఉన్న పుస్తకాలను ఉపయోగించుకునే వీలుంటున్న నేపథ్యంలో వారు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు అవసరం అయిన కొన్ని పుస్తకాలను వారే ముద్రించుకుంటున్నారు. అవి కాకుండా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాల్సి ఉంటుంది.

మొదలైన ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణ

రాష్ట్రంలోని 60 లక్షల మంది విద్యార్థులకు 2.16 కోట్ల పుస్తకాలు అవసరం కాగా అందులో ఉచిత పుస్తకాలు 1.80 కోట్లు అవసరం అవుతాయి. ఉచిత పుస్తకాల ముద్రణను మింట్ కాంపౌండ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణాలయంలో ఇప్పటికే ప్రారంభించారు. అయితే ప్రభుత్వ ముద్రణాలయంలో 30 లక్షల పుస్తకాల వరకు మాత్రమే ముద్రించే అవకాశం ఉంది. మిగిలిన 1.50 కోట్ల పుస్తకాలను ఇతర ప్రైవేటు ముద్రణాలయాల్లో ముద్రించాల్సి ఉంటుంది. వాటి ముద్రణకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. త్వరలోనే ప్రైవేటు ముద్రణాలయాల్లో కూడా ఉచిత పుస్తకాల ముద్రణ ప్రారంభం కానుంది.

అమ్మకపు పుస్తకాలకు పూర్తయిన టెండర్ల ప్రక్రియ

రాష్ట్రంలో అమ్మకపు పుస్తకాలు 86 లక్షల వరకు అవసరం ఉంటాయని అధికారులు అంచనా వేశారు. అమ్మకపు పుస్తకాల ముద్రణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పాఠశాల విద్య శాఖ ఇప్పటికే ముగించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో త్వరలోనే ముద్రణా పనులను ప్రారంభించేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు. జనవరి చివరి వారంలోనే ముద్రణను ప్రారంభించే అవకాశం ఉంది. అటు ఉచిత పుస్తకాల ముద్రణ, ఇటు అమ్మకపు పుస్తకాల ముద్రణను కూడా మార్చి నాటికి పూర్తి చేయాలని అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

కేసీఆర్‌ది నియంత పరిపాలన

విరసం నేత వరవరరావు



భీమారం, ప్రభన్యూస్ : పూర్వం నుంచి ఇప్పటివరకు ఏ నియంత ఎక్కువకాలం పరిపాలించినట్లు చరిత్రలోనే లేదని విప్లవ రచయిత సంఘం నేత వరవరరావు అన్నారు. ఆదివారం వరంగల్ డిక్లరేషన్ సభలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనను కాళోజీ సెంటర్‌లో పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి కాకతీయ యూనివర్సిటీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలక్రితం కరడు గట్టిన నేతగా పేరొందిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం 2 వేల మందితో ములుగు రోడ్డు నుంచి ర్యాలీ నిర్వహించి పరిశ్రమల ఉపాధి కేంద్రం ప్రాంగణంలో 25 వేల మందితో సభ నిర్వహించామని అప్పటికి టీఆర్ఎస్ ఆవిర్భవించలేదన్నారు.

యాదాద్రి జిల్లాలో దారుణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : యాదాద్రి జిల్లాలో దారుణం జరిగింది. బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. రాజాపేట మండలం బేగంపేటకు చెందిన మహేష్.. ఇంటి పక్కనే ఉండే బాలికపై కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి ఒడిగట్టాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చాక బాధితురాలు వారికి విషయం చెప్పింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం

డివైడర్ ఎక్కి.. గాల్లో పల్టీలు కొట్టి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం తాగి వాహనాలు నడపొద్దని మందు బాబులకు ట్రాఫిక్ పోలీసులు వివరిస్తూ డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నా అవేవీ పట్టని విధంగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-45లో శనివారం అర్ధరాత్రి ప్రమాదం సంభవించింది. మితిమీరిన వేగంతో వచ్చిన ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ని ఎక్కి గాల్లో రెండు పల్టీలు కొట్టింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్ 45వైపు వేగంగా వస్తున్న కారు మూల మలుపులో శనివారం అర్ధరాత్రి 1.45 నిమిషాలకు ఈ ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన వెంటనే కారును వదిలి డ్రైవర్ పరారయ్యాడు. ఈ కారును ఫరీద్ అనే డ్రైవర్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తిం చారు. ప్రమాద సమయంలో ఇద్దరు యువకులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం సేవించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. మితిమీరిన వేగంతో కారు వచ్చి ఢీకొట్టడంతో ఎదురుగా ఉన్న సీసీ కెమెరా స్తంభం పూర్తిగా విరిగిపోయింది. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తామని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన కారు నెంబరు 07 యూఏ 0509. ఇదిలా ఉండగా డ్రంక్ డ్రైవ్ కేసులు బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్‌లోనే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇటీవల జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో ఓ కారు బీభత్సం సృష్టించింది. పంజాగుట్టకు చెందిన విష్ణువర్ధన్ అనే వ్యక్తి అతివేగంగా కారు నడిపి స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీ నడుపుతున్న మస్తానీ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ వెనుక కూర్చున్న అనూష, ప్రియ అనే యువతులు తీవ్రంగా గాయపడ్డారు. డిసెంబర్ 31న తాగి కారు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికిపోయిన యాంకర్ ప్రదీప్‌కు నాంపల్లి కోర్టు శిక్ష విధిం చిన విషయం తెలిసిందే.

చెలరేగిపోతున్న 'చెడ్డీ గ్యాంగ్'

- అదను చూసి దోపిడీలకు తెగబడుతున్న వైనం
- సీసీపుటేజ్‌ల్లో ఇమేజ్‌లు.. అయినా దొరకని ఆచూకీ
- పోలీసుల వైఫల్యంపై మండిపడుతున్న ప్రజలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో కరడుగట్టిన చెడ్డీ బనియన్ గ్యాంగ్ చెలరేగిపోతోంది. అడ్డూ అదుపూ లేకుండా అదును చూసి దోపిడీలకు తెగ బడుతోంది. ఈ గ్యాంగ్ సభ్యుల ఇమేజ్‌లు సీసీకెమెరాల్లో లభ్యమైనప్పటికీ పోలీసులు వారి ఆచూకీని ఇప్పటివరకు కనిపెట్టలేకపోయారు. దీంతో పోలీసుల వైఫల్యంపై తెలుగు రాష్ట్రాల ప్రజలు మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరా బాద్‌లోని శివారు ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ చెడ్డీ బనియన్ గ్యాంగ్ ఇళ్లల్లో దోపిడీలకు పాల్పడింది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నగరంలోనూ చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. హైదరాబాద్ తరహాలో దోపిడీలకు తెగబడింది. అక్కడి న్యూకృష్ణానగర్, ఆదిత్యనగర్, విఠల్ నగర్‌లలో చోరీలకు పాల్పడింది. మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి ఓ ఇంటికి నిప్పు పెట్టారు. నాలుగో ఇంట్లో చోరీకి వెళ్లడంతో స్థానికులు గుర్తించారు. బనియన్,చెడ్డీలు వేసుకున్న 25 ఏళ్ల యువకులు ఈ ముఠాలో ఉన్నట్లు వారు చెబుతున్నారు. స్థానికులు గుర్తించడంతో దొంగలు పరారయ్యారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల సరిహద్దు ప్రాంతానికి చెందిన చెడ్డీ బనియన్ గ్యాంగ్‌లో ఒక్కొక్క గ్యాంగ్‌లో 10 నుంచి 15 మంది వరకు ఉంటారు. వీరు మారణాయుధాలతో సంచరిస్తూ.. దోపిడీ సమయంలో ఎవరైనా అడ్డుకుంటే ప్రాణాలు తీసేందుకు సైతం వీరు వెనుకాడరు. ఈ గ్యాంగ్ సభ్యులు ముఖానికి ముసుగు వేసుకుంటారని తెలుస్తోంది. వీరు తాళం వేసి ఉన్న ఇండ్లనే ఎక్కువగా టార్గెట్ చేసుకుని దోపిడీలకు పాల్పడుతుంటారు. వీరిని కచ్చా బనియన్ గ్యాంగ్ అని కూడా పిలుస్తారు. శరీరానికి ఒండ్రు మట్టిగానీ, నూనె గానీ రాసుకుని తిరుగుతుంటారు. ఎవరైనా పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరక్కుండా జారిపోయేందుకే అదో ఉపాయమని పోలీసులు అంటున్నారు. పగటివేళల్లో మాత్రం కుర్తా లేదా లుంగీ ధరిస్తారు. అంతేకాదు, ఎక్కువగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో బసచేస్తుంటారు. పగలు బిచ్చగాళ్లు, కూలీలుగా నటిస్తూ తాము ఎంచు కున్న గ్రామాలు, కాలనీల్లో రెక్కీ చేస్తారు. ఆ తర్వాత తాళం వేసిన ఇళ్లల్లో రాత్రిళ్లు దోపిడీకి పాల్పడి అందినకాడికి దోచుకునిపోతారు. ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో హల్‌చల్ చేసిన ఈ గ్యాంగ్ గత కొద్దికాలంగా ఏపీ, తెలంగాణలలో సంచరిస్తూ వరుస చోరీలకు తెగబడుతోంది.

సీసీ టీవీల్లో ఇమేజ్‌లు లభ్యం.. అయినా దొరకని ఆచూకీ...

ఈ గ్యాంగ్ అత్యంత కిరాతకమైనది. చెడ్డీబనియన్‌తో దోపిడీలకు పాల్పడే ఈ గ్యాంగ్ సభ్యులు దోపిడీ చేసే సమయాలలో చెప్పులు కూడా మెళ్లో వేసుకుంటారని, తద్వారా తాము దోపిడీలకు పాల్పడుతున్న విషయం సైతం ఇతరులకు తెలిసే అవకాశం లేకుండా జాగ్రత్తపడతారు. వీరు దోపిడీ చేసే ఇంట్లోకి ప్రవేశించినప్పుడు పక్కింటి వాళ్లకు కూడా ఆనవాలు తెలియకపోవడం గమనార్హం. ఒకవేళ ఎవరైనా గుర్తించి తమ చర్యలకు అడ్డొస్తే వారిని తమ వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో హత్య చేసేందుకు సైతం ఈ గ్యాంగ్ వెనుకాడదని తెలుస్తోంది. కాగా, హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడిన ఈ గ్యాంగ్ ప్రస్తుతం ఏపీలో సైతం హల్‌చల్ చేస్తుండటం గమనార్హం. మరో చిత్రమేమంటే ఈ గ్యాంగ్ ఆయా ఇళ్లల్లో దోపిడీ చేసేటప్పుడు అక్కడే తిని, మలమూత్రాలను సైతం అక్కడే విసర్జిస్తుందని కూడా చెబుతున్నారు. ఇలాంటి జుగుప్సాకరమైన ఈ చెడ్డీగ్యాంగ్ అని చెబుతున్నారు. హైదరాబాద్‌లో వరుస చోరీలకు పాల్పడిన ఈ గ్యాంగ్ సభ్యుల సీసీపుటేజ్ ఇమేజ్‌లు లభ్యమైనా.. వారి ఆచూకీని నేటికి పోలీసులు గుర్తించకపోవడం పోలీసుల వైఫల్యంగాక మరేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టెక్నాలజీతో నేరగాళ్ల భరతం పడతాం అని ఇరు రాష్ట్రాల పోలీసు బాస్‌లు ప్రసంగాలు దంచేస్తుండటం గమనార్హం. మరి ఆ దిశగా చర్యలేవీ? రెండు తెలుగు రాష్ట్రాల్లో చెడ్డీగ్యాంగ్ వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతూ వీర విజృంభణ చేస్తోంది.

కాగా, వారి ఇమేజ్‌లకు సంబంధించిన ఫోటోలను ఆయా ప్రాంత స్థానికులకు చూపిస్తూ వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని పోలీసులు చెబుతున్నారు .సదరు చెడ్డీగ్యాంగ్ తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని అకృత్యాలకు పాల్పడకముందే పోలీసులు పటిష్టనిఘాతో ఆ గ్యాంగ్ ముఠా ఆట కట్టించాల్సి ఉంది. మరి ఆ దిశగా పోలీసులు ఏ మేర కృషి చేస్తారు? అన్నది వేచి చూడాల్సిందే...!

కిడ్నాప్ సుఖాంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరంలో రియల్టర్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది. వనస్థలిపురంలోని చైతన్యనగర్‌లో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి రియల్టర్ అనంతయ్యను శనివారం పట్టపగలు కిడ్నాప్ చేశారు. దీంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నందకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, రియల్టర్ శనివారం రాత్రి ఇంటికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం లావాదేవీల విషయంలో ఏర్పడ్డ విభేదాలతోనే రియల్టర్‌ను కిడ్నాప్ చేసి వదిలేశారని తెలుస్తోంది.

రాంచందర్‌రావు డబ్బు హ్యాక్!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావునే బురిడీ కొట్టించారు. టెక్నాలజీలో ఉన్న లొసు గులను తమకు అనుకూలంగా మారుకుని మరీ దోపిడీకి తెగబడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆన్‌లైన్ మోసగాళ్లు ఎమ్మెల్సీ రాంచదర్‌రావకు సంబంధించి ఎస్బీఐ, ఆంధ్రాబ్యాంకు అకౌంట్ల నుంచి రూ.40 వేలు మాయం చేశారు. అకౌంట్‌ను క్లోన్ చేసిన సైబర్ మోసగాళ్లు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేశారు. తన అకౌంట్‌లో డబ్బులు మాయం కావడంతో రాంచందర్‌రావు కంగుతిన్నారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేప ట్టారు. కాగా, ఒక ప్రజాప్రతినిదికే ఇలా రిగితే తమ పరిస్థితి ఏంటి? అని సామాన్యులు కలత చెందుతున్నారు. టెక్నా లజీలో ఉన్న లొసుగులను కట్టడి చేసి సైబర్ నేరగాళ్ల బారి నపడకుండా తమను కాపాడాలని సైబర్ పోలీసులను సామాన్య ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం , ప్రభన్యూస్ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న అంజప్ప అనే విద్యార్థి శనివారం రాత్రి హాస్టల్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మద్దూరు మండలం చింతలదిన్నె గ్రామానికి చెందిన అంజప్ప తెలుగు మీడియం కావడంతో అంజప్పకు కాలేజీలో చదవడం ఇష్టం లేదని తోటీ విద్యార్థులు చెబుతున్నారు. అయితే అంజప్పతో పాటు మరో విద్యార్థి కూడా తెలుగు మీడియం చదివే విద్యార్థి ఉన్నాడని మిగతా విద్యార్థులందరు ఇంగ్లీష్ మీడియం అని మొదటి నుంచి అంజప్పకు ప్రతిభ కాలేజీలో చేరడం ఇష్టం లేనందు వల్లే ఆత్మహత్య చేసుకోవడానికి ప్రధాన కారణమని కాలేజీ నుండి హాస్టల్‌కు చాలా దూరం ఉండటం వల్ల మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా అంజప్ప సంక్రాంతి సెలవులకు ఇంటి నుంచి వచ్చినప్పటి నుంచి నీరసంగా కనిపిస్తున్నాడని, కళాశాల నిర్లక్ష్యం వల్ల సూసైడ్ చేసుకుంటున్నట్లు అంజప్ప సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడని, శనివారం రాత్రి విద్యార్థులు అందరు భోజనం చేసిన తర్వాత తన గదిలోకి వెళ్లిన అంజప్ప ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తోటి విద్యార్థులు తెలిపారు.



పెరిగిన ఓఎన్‌జీసీ పరపతి పరిమితి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సహజవాయు సంస్థ ఓఎన్‌జీసీ పరపతి పరిమితి రూ. 350 బిలియన్లకు చేరింది. హెచ్‌పీసీఎల్ రిఫైనరీలోని ప్రభుత్వ వాటాను చేజిక్కించుకోవడం ద్వారా ఈ లక్ష్యానికి చేరుకున్నామని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇంతకు ముందు ఇది రూ.250 బిలియన్లుగా ఉండేది. దీంతో రుణాల పరిమితి కోసం వాటాదార్ల అనుమితి తీసుకునే అవసరం ఇప్పటికైతే లేదు. ప్రస్తుతం రూ. 130 బిలియన్ల నగదు నిల్వలు ఉన్నాయి. దీనికితోడు గెయిల్‌లో రూ 300బిలియన్లు పెట్టుబడులు ఉన్నాయి. అవసరం అనుకుంటేనే ప్రత్యామ్నాయంగా మధ్యకాల సర్దుబాటు కోసం రుణాలకు వెళ్తామని సంస్థ ఎండీ శశి శంకర్ పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్‌తో రూ. 369.15 బిలియన్ ఒప్పందంపై శనివారం నాడు సంతకాలు చేయడం జరిగింది. 10 శాతం మొత్తాన్ని అడ్వాన్సుగా చెల్లించామని వెల్లడించారు. ప్రస్తుతానికి దేశీయ, విదేశీయ రుణాలు రూ. 500 బిలియన్లుగా ఉంది. లిక్విడ్ అస్సెట్స్‌ను విక్రయించి వీటి చెల్లింపులు పూర్తిచేస్తాం. ఈ యేడాది ప్రథమార్ధంలోనే హెచ్‌పీసీఎల్, జీఎస్‌పీసీ ఒప్పందాలు ముగిశాయి. 2017-18 ఆర్ధికసంవత్సరంలో నికరంగా రూ. 480 బిలియన్ల వృద్ధిని సాధించామని వివరించారు.



ఉపాధికి ఊతమివ్వాలి

● జీఎస్‌టీ నెట్‌వర్కులో సాంకేతిక ఇబ్బందులు తొలగించాలి ● ఎగుమతి రంగంలోని సమస్యలను పరిష్కరించాలి ● జీఎస్‌టీ నుంచి జాబ్ వర్కును మినహాయించాలి ● జౌళి పరిశ్రమలో పన్ను రేటు తగ్గించాలి ● ప్రభుత్వానికి ఎఫ్ఐఈఓ సూచన

న్యూఢిల్లీ: ఫిబ్రవరి ఒకటవ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటుకు సమర్పించే సాధారణ బడ్జెట్‌లో ఉపాధి అవకాశాలు పెంచే సంస్థలకు ఊతం ఇవ్వాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్ పోర్ట్స్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఓ- భారత ఎగుమతి సంఘాల సమాఖ్య) సూచించింది. ఎగుమతుల రంగంలో ఉన్న సంస్థలు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వాటిని ప్రోత్సహించాలని ఆ సంస్థ ప్రభుత్వాన్ని కోరింది.ప్రభుత్వం ప్రవేశపెట్టిన వస్తువులు, సేవల (జీఎస్‌టీ) పన్ను నెట్‌వర్క్‌లో ఉన్న సాంకేతికపరమైన ఇబ్బందులు తొలగించాలని కూడా ఆ సంస్థ కోరింది. ఈ ఏడాది బడ్జెట్‌లో జాబ్ వర్క్‌పై దృష్టిని కేంద్రీకరించాలని కోరింది. వస్తుసేవల పన్ను(జిఎస్‌టి) మండలి తనకు అందిన ఫిర్యాదులు, అభ్యర్ధనలను సానుకూల దృష్టితో పరిశీలించి పరిష్కరించినందుకు ఫెడరేషన్ హర్షాన్ని వ్యక్తం చేసింది. వివిధ రంగాలకు చెందిన వారి అభ్యర్ధనలు పరిగణనలోకి తీసుకున్నందుకు అభినందించింది. 2019 ఎన్నికల ముందు ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించే పూర్తి స్థాయి తుది బడ్జెట్ ఇదే. 2019లో ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రభుత్వం సమర్పించనుంది.ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఒ) అధ్యక్షుడు గణేష్‌కుమార్ గుప్తా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలుసుకుని ఎగుమతి రంగంలోని సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ముందు ఉంచారు. జాబ్ వర్క్ రేటు హెచ్చుగా ఉండటం, సమగ్ర రికార్డుల నిర్వహణ భారంగా తయారవడం వంటి కారణాల వల్ల జాబ్ వర్కర్స్‌కు ఇబ్బంది కలుగుతోందని ఆయన జైట్లీకి వివరించారు. ఈరంగంలోని కార్మికుల్లో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులో, వచ్చీరాని చదువుతో ఉన్నవారో కావడం వల్ల ఇన్ వాయిస్, చ లా న్ ల ు నిర్వహించలేకపోతున్నారని జైట్లీకి గుప్తా తెలిపారు.జీఎస్‌టీ నుంచి జాబ్ వర్క్‌ను మినహాయించాలని ఎఫ్ఐఈఓ కేంద్రాన్ని కోరింది. జాబ్ వర్కర్‌పై భారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆ సంస్థ కోరింది. పూర్తి భారాన్ని తొలగించడం సాధ్యం కాకపోతే, జాబ్ వర్కలన్నింటినీ ఐదు శాతం జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలని సమాఖ్య కోరింది. జౌళి పరిశ్రమలో పన్ను రేటును ఇప్పటికే తగ్గించారనీ, ఈ విషయమై కూడా పన్ను రేటు తగ్గించాలని కోరింది.మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేట్టు చర్యలు తీసుకుంటున్నదని భావిస్తున్నట్టు సమాఖ్య పేర్కొంది. ఉపాధి అవకాశాలు పెంచడం ప్రధానమైన సవాల్ అని సమాఖ్య పేర్కొంది. అదనపు ఉపాధి అవకాశాలు కల్పించే సంస్థలకు ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని కోరింది.

ట్రేడ్ యూనియన్లదీ అదే డిమాండ్

ఉపాధి కల్పన రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించాలని కేంద్రాన్ని ట్రేడ్ యూనియన్లు కోరాయి. రిటైల్ రంగంలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐలను) ఆహ్వానించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం ఉద్యోగాలపై తీవ్రప్రభావాన్ని చూపగలవని ట్రేడ్ యూనియన్లు ఆందోళన వ్యక్తంచేశాయి. డిసెంబర్‌లో ట్రేడ్ యూనియన్ నాయకులతో జరిపిన సమావేశంలో వచ్చిన సూచనలు పరిశీలిస్తామని ఆర్థికమంత్రి జైట్లీ హామీ ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం పోకడను గమనిస్తే కార్పొరేట్ వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా కనిపిస్తోందని ట్రేడ్ యూనియన్లు ఆందోళన వ్యక్తం చేశాయి.

డీమానిటైజేషన్ దెబ్బ

పెద్దనోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల చిన్న, లఘు పరిశ్రమలు చాలామటుకు దెబ్బతిన్నాయనీ, ఈ పరిశ్రమల్లో కొన్ని మూత పడటమో, ఉద్యోగులను తొలగించడమో జరిగిందని ప్రధాన ట్రేడ్ యూనియన్ నాయకులు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దృష్టికి తెచ్చారు. ఉద్యోగాల సృష్టికోసం ప్రభుత్వం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీమానిటైజేషన్ వల్ల ఉపాధి కోల్పోయిన వారికి తిరిగి ఉపాధి కల్పించాలనీ, కొత్తగా మరిన్ని ఉద్యోగాలు సృష్టించాలని వారు డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ల తరపున కేంద్ర మంత్రి జైట్లీని కలుసుకున్న అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపారు.రిటైల్ మార్కెట్‌లో నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ట్రేడ్ యూనియన్లు తప్పు పట్టాయి. ఈ రంగంలో ఉన్న ఉద్యోగాలను ఈ నిర్ణయం పూర్తిగా కొల్లగొడుతుందని మార్క్సిస్టు పార్టీ అనుబంధమైన సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ఆందోళన వ్యక్తం చేశారు.ఉద్యోగాల సృష్టికోసమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వం ప్రతీసారీ చెబుతోందనీ, కానీ, వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందని ట్రేడ్ యూనియన్ నాయకులు ఆరోపించారు. విదేశీ పెట్టుబడిదారులు శ్రామిక వర్గానికి అయ్యే వ్యయాన్ని సాధ్యమైనంత తగ్గించుకోవాలని చూస్తారని అన్నారు. రిటైల్ రంగంలో నూరు శాతం ఎఫ్‌డీఐల వల్ల కార్మికులకే కాకుండా, ఈరంగానికీ నష్టదాయకమేనని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సెజ్‌లకుమరిన్ని ప్రోత్సాహకాలు

ప్రత్యేక ఆర్థిక మండళ్ల పరిధిలోని పరిశ్రమలకు పన్ను రాయితీలకు కేంద్ర వాణిజ్య శాఖ సిఫార్సులు చేసింది. దేశీయ ఉత్పత్తుల పెంపు, ఉద్యోగ, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నందున వీటికి మరిన్ని ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సంబంధిత మంత్రిత్వశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. సెజ్‌లపై ప్రస్తుతం వసూలు చేస్తున్న కనీస ప్రత్యామ్నాయ పన్ను తొలగించాలని కోరుతూ ఆర్థిక శాఖకు లేఖ రాసినట్లు ఉటంకించారు. 31 మార్చి 2020 నాటికి క్రియాశీలకంగా వ్యవహించే యూనిట్లకు పన్ను ప్రయోజనాలు కల్పిస్తామని గతేడాది బడ్జెట్ సందర్భంగా జైట్లీ హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజా బడ్జెట్‌లో రాయితీలను ప్రకటించాలని వాణిజ్య శాఖ డిమాండ్ చేస్తున్నది. 2020 నాటికి పూర్తికాని పరిశ్రమలకు రాయితీలను నిలిపివేస్తే దాని ప్రభావం పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై పడుతుందన్నది పారిశ్రామిక వర్గాల ఆందోళనగా ఉంది.

సంపద పన్ను ఏదీ ?

పెద్ద పారిశ్రామిక వేత్తలూ, సంపన్న వర్గాలపై విధించే సంపద పన్నును తొలగించడం పట్ల ట్రేడ్ యూనియన్లు మండిపడ్డాయి. ఈ పన్ను విధానాన్ని తిరిగి తీసు కురావాలనీ, తద్వారా వచ్చే ఆదాయాన్ని ఉద్యోగాల సృష్టి కోసం, సంక్షేమ కార్య క్రమాల కోసం ఖర్చు చేయాలని ట్రేడ్ యూనియన్లు సూచించాయి.నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులు ఉద్యోగాల కల్పనకు కావని ప్రభుత్వం చెబుతోందనీ, అలాంటప్పుడు, పాఠశాలల్లోనే నైపుణ్యంలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాలని ట్రేడ్ యూ నియన్లు కోరాయి. బడ్జెట్ ముందు చర్చల కోసం ట్రేడ్ యూనియన్ నాయకులు ఆర్థిక మంత్రి జైట్లీని డిసెంబర్ 5వ తేదీన కలుసుకుని తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

ఐటీ పరిమితి పెంపు?



జైట్లీ బడ్జెట్ అన్నివర్గాలకు అనుకూలంగా ఉంటుందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మధ్యతరగతి, సంపన్న వర్గాలు పన్ను రాయితీలపై బోలెడు ఆశలుపెట్టుకున్నాయి. ఆదాయపన్ను శ్లాబ్ పరిమితి విస్తరణతోపాటు, పన్ను తగ్గింపు దిశగా ఆర్థికమంత్రి చర్యలు తీసుకోవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు ఈవై సర్వే స్పష్టంచేసింది. వ్యక్తిగత పన్ను భారం నుంచి కాస్తంత వెసులుబాటు తప్పక లభించవచ్చని అంచనా వేసింది. ప్రీ బడ్జెట్ సర్వేలో భాగంగా 150 మంది సీఎఫ్‌వోలు, పన్ను అధికారులు, సీనియర్ ఆర్థిక నిపుణుల అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఈ క్రమంలో వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితుల్లో సడలింపులు తథ్యమని 69 శాతం మంది పేర్కొన్నారు. కాలంచెల్లిన వేర్వేరు తగ్గింపుల స్థానంలో నిర్దిష్ట పన్ను రాయితీ విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని 59శాతం మంది అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ఉద్యోగులకు కొంతమేరు ఉపశమనం లభిస్తుందన్నారు. కార్పొరేట్ టాక్స్ 25శాతానికి పరిమితం కావొచ్చని, అదే సమయంలో సర్‌చార్జీ యథాతదంగా ఉంచేలా జైట్లీ చర్యలుంటాయని 48 శాతం మంది నిపుణుల వాదన. ఓవరాల్‌గా 65 శాతం మంది మాత్రం పెద్దగా మార్పులు ఉండకపోవచ్చన్న ధోరణి కనబరిచారు. కార్పొరేట్ రంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగించేచర్యలు ఉంటాయని 24 శాతం మంది అభిప్రాయపడ్డారు. జీఎస్టీ అమలు నేపథ్యంలో ప్రత్యక్ష పన్నుల్లో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించే అవకాశాలు మిణుకు మిణుకుమంటున్నాయని ఈవై ఇండియా నేషనల్ ట్యాక్స్ లీడర్ సుధీర్ కపాడియా చెప్పారు.

ఆరోగ్య భారతానికి ప్రాధాన్యం!



కుటుంబ నియంత్రణ అమలు, అంటు వ్యాధుల నివారణ వంటి కీలక చర్యలకు కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఆరోగ్య బీమాకు ప్రాధాన్యమిస్తూ వైద్య, ఆరోగ్యానికి కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య భారత్ నినాదంలో భాగంగా సామాజిక ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలు చేరుకునేందుకు వీలుగా కేంద్రం చొరవ చూపాలని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఈడీ పూనమ్ ముత్రెజా సూచించారు. వైద్యఆరోగ్య రంగానికి జీడీపీలో 1.15 శాతం కేటాయింపులే ఉన్నాయి. 2025 నాటికి 2.5శాతానికి చేరాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం గతంలోపేర్కొన్న విషయాన్ని ఆమె ఈసందర్భంగా గుర్తుచేశారు. కేటాయింపులు పెంచడంతోపాటుగా, ఈ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ప్రసూతి మరణాల తగ్గింపునకు అత్యవసర ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. అదే సమయంలో కరలా, తట్టు, బోధకాలు, క్షయ నిర్మూలన లక్ష్యాల సాధనకు నిర్మాణాత్మక విధానాలు అవసరం. బహుశా ఈ బడ్జెట్‌లో ఈదిశగా అడుగులు పడొచ్చు అని బెంగళూరుకు చెందిన హెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ - బెంగళూరు డైరెక్టర్ ఉషా మంజునాథ్ తెలిపారు. సమీప, మధ్యకాలిక లక్ష్యాలతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చాలా మటుకు వైద్య పరికరాలను దిగుమతి చేసుకుంటున్నాం. వీటిని దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు, ఔషధ సంస్థలకు ప్రోత్సాహమివ్వాలని మంజునాథ్ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా జాతీయ ఆరోగ్య బీమా ద్వారా ప్రతి పేద కుటుంబానికి లక్ష రూపాయల బీమా వసతి కల్పించాలని కోరారు.

ద్రవ్యలోటుపై దృష్టి సారించాలి..

ప్రణాళికలను సమర్ధవంతంగా అమలు చేయడం, నిర్ణీత సమయంలో పూర్తిచేయడం ద్వారా ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించాలి. ఈ దిశగా అరుణ్ జైట్లీ కృషిచేయాలి అని అమెరికాకు చెందిన ఆర్థికవేత్త టీఎన్ శ్రీనివాసన్ సూచించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలుకు ఉద్యోగాల కోతకు ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 3.2 శాతానికి కట్టడి చేయాలన్నారు.

బొగ్గుపై దిగుమతి సుంకంఎత్తివేయాలి..

మౌలిక రంగానికి ప్రోత్సాహం ఇచ్చేలా మరిన్ని చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగా కోకింగ్ కోల్‌పై దిగుమతి సుంకం ఎత్తివేతకు నిర్ణయం తీసుకోవాలి అని కేంద్ర ఉక్కు శాఖ ప్రభుత్వానికి విన్నవించింది. ప్రస్తుతం 2.5 శాతంగా ఉన్న దిగుమతి సంకాన్ని పూర్తిగా ఎత్తివేయాలని కోరుతూ ఆర్థికశాఖకు లేఖ రాయడం జరిగిందని స్టీల్ కార్యదర్శి అరుణా శర్మ చెప్పారు. ఇంతకు మునుపు ఇదే అంశంపై మంత్రిత్వశాఖ జైట్లీకి ప్రతిపాదనలు పంపిందని ఆయన గుర్తుచేశారు. దేశీయ ఉత్పాదకంలో బూడిద శాతం ఎక్కువగా ఉంది. ఉక్కు పరిశ్రమకు ఇది అంతగా పనికిరాదు. అందుచేత దిగుమతులకు అవకాశం కల్పించాలని కోరారు. సెకండరీ స్టీల్ ఇండస్ట్రీ సమాఖ్య నుంచి ఈ డిమాండ్లు వచ్చాయి.

మార్కెట్లోకి పెక్స్‌స్టెయిన్ స్టీల్ బాటిల్స్

● మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో తయారు
● సీఈఓ వేదాంత్ పడియా



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఫ్లాసెరో ఇంటర్నేషనల్ కంపెనీ భారత మార్కెట్‌లోకి పెక్స్‌పో పేరుతో స్టెయి న్‌లెస్ స్టీల్ బాటిల్స్‌ను అందుబా టులోకి తీసుకొచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో ఈ బాటిల్స్‌ను మార్కె ట్‌లోకి తీసుకొ స్తున్నట్టు సీఈవో వేదాంత్ పడియా తెలిపారు. బాటిల్స్ అర లీటర్ నుంచి లీటర్ వరకు ఉంటాయని చెప్పారు. సుపీరియర్ డిజైన్, ఆకర్షణీయమైన స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిల్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసినట్టు తెలిపారు. బాటిల్స్‌ను అరలీటర్(500 ఎంఎల్), 750 ఎంఎల్, 1లీటర్(1000 ఎంఎల్) శ్రేణిలో ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. ఫ్రిజ్, స్పోర్ట్స్, థర్మోల పేరుతో బాటిల్స్‌ను కంపెనీ విడుదల చేసిందన్నారు. వీటి ధరలు రూ. 309 నుంచి రూ. 1044 వరకు ఉంటాయన్నారు. తాజాగా ప్రవేశ పెట్టిన ఉత్పత్తులు మార్కెట్‌లో ప్రధాన షాపులతోపాటు ఆన్‌లైన్‌లో ఆమెజాన్, స్నాప్‌డీల్ వాటి ద్వారా కూడా ఆర్డర్ చేయవచ్చని స్పష్టం చేశారు.

భారత్‌కు ఎదురు లేదు

● చైనాను వెనక్కినెట్టేస్తుంది
● 2018లో ఇండియా వృద్ధిరేటు హుషారే
● శాంక్చుమ్ వెల్త్ సర్వే నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఒకవైపు ప్రపంచ దేశాలన్నీ అరకొర వ్యవస్థీకృత మార్పులతో, తక్కువ వృద్ధిరేటు నమోదు చేస్తుంటే, భారత్ ఇందుకు భిన్నంగా వేగంగా ముందుకు వెళ్తున్నదని తాజా సర్వే ఒకటి వెల్లడించింది. సంస్కరణ ఆర్థిక వ్యవస్థగా పరిణామం చెందుతున్న భారత్, సుస్థిర, శక్తివంతమైన దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించే అవకాశం ఉందని అభిప్రాయపడింది. 2018లో వేగంగా అభివృద్ధి చెందే అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరిస్తుందని శాంక్చుమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక పేర్కొంది. ప్రపంచంలో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్లలో ఇండియా ఐదవ స్థానానికి చేరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. 'అభివృద్ధి చెందిన దేశాలు 2-3 శాతం వృద్ధిరేటుకు పరిమితం అవుతుంటే, ఇండియా 7.5 శాతాన్ని అధిగమించే ప్రయత్నం చేస్తున్నది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతికూలతలు ఇండియాకు లాభదాయకం. ఇంకొకవైపు చైనా వృద్ధిరేటు తిరోగమనంలో ఉంది. అక్కడ ఈక్విటీ ద్వారా స్థిరఆదాయం 6-8 శాతానికి మించడం లేదు. ఒకవేళ ద్రవ్యోల్బణం పెరిగితే, ఈ మాత్రం లాభాలు కూడా సాధ్యం కావు. భారత్ విషయానికొస్తే ఈక్విటీ మార్కెట్ ఊర్ధ్వముఖంగా పయనిస్తోంది. నిఫ్టీ-50 స్థాయిలు సమీప కాలానికి 10500 నుంచి 11500గా కనిపిస్తోంది. ఆధార్, జన్‌ధన్, పెద్దనోట్లరద్దు, జీఎస్టీ ప్రభావంగా సమ్మిళిత మౌలికరంగం కొత్త లక్ష్యాలను చేరుకుంటుంది. కిందటేడాదితో పోల్చుకుంటే దేశీయ మ్యూచుఫల్ ఫండ్స్ సంస్థలు ఈక్విటీ మార్కెట్లలో భారీగా పెట్టుబడులుపెట్టాయి. సుస్థిర, వేగవంతమైన వృద్ధిరేటు నేపథ్యంలో మదుపరులు సంక్లిష్ట పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటున్నారు' అని శాంక్చుమ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివ్‌గుప్తా చెప్పారు.



ఈ-కామర్స్ వార్‌కు రిల్ సన్నాహం!

జియో ప్రయోగం సక్సెస్ కావడంతో, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ మరో విప్లవానికి సిద్ధమవుతున్నారు. జియోతో గతేడాది టెలికాం రంగంలో ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. రెండో త్రైమాసికంలో 271 కోట్ల రూపాయల నికర నష్టాల నుంచి మూడో త్రైమాసికంలో రూ. 504 కోట్ల లాభాలను జియో ఆర్జించింది. ఈసందర్భంగా అంబానీ మాట్లాడుతూ, విదేశాల్లో భారీ పెట్టుబడులు లక్ష్యమని ప్రకటించారు. అదేసమయంలో ఇండియాలో 3.5 లక్షల కోట్లతో వ్యాపార విస్తరణకు ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో మార్కెట్‌ను దక్కించుకునేందుకు రిటైల్ దిగ్గజ సంస్థలు పోటీ పడుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి విదేశీ సంస్థలు బిలియన్ డాలర్లతో ఈ కామర్స్ యుద్ధానికి తెరలేపాయి. అంబానీ సైతం ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు తెలుస్తోంది. పెద్ద మాల్స్ నుంచి వీధి చివర కిరణా దుకాణాల దాకా భవిష్యత్ ప్రణాళికలను విస్తరించనున్నారు. జియో వినియోగ దారులకు డిజిటల్ కూపన్లను ఆఫర్ చేస్తారు. వీటితో సమీపంలోని కిరణా స్టోర్లలో డిస్కౌంట్ ధరలకు వస్తువులను కొనుగోలు చేయవచ్చు. తయారీదారుకు, కిరణా దుకాణానికి మధ్యవర్తి పాత్ర పోషించడం అన్నమాట. దీనిద్వారా తమ కస్టమర్లకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు , ఈ కామర్స్ వ్యాపారాన్ని విస్తరించుకోవచ్చన్నది ముకేష్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ యేడాదిలోనే ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా కొన్ని ప్రధాన నగరాల్లో ప్రారంభించే అవకాశం ఉంది.



కోయంబత్తూరు :ఆడి క్యూ-5 కొత్త మోడల్ కారుఆవిష్కరణ



శ్రీనగర్: అమ్మకానికి సిద్ధంగా ఉంచిన బుట్టలు

‘పెట్టుబడి మద్దతు’కు కార్యాచరణ సిద్ధం



●నిధుల సమకూర్పే గగనం ●ఇంకా స్పష్టత ఇవ్వని కేంద్రం ●అమలుపై ఆర్థిక శాఖకు ఎస్ఎల్‌బీసీ నివేదిక ●ఎకరాకు పెట్టుబడి మొత్తం రూ. 4వేలు ●ధ్రువీకరించిన రైతుల బ్యాంకు ఖాతాలు 71.75 లక్షలు ●అవసరమయ్యే నిదులు సుమారు రూ.ఆరు వేల కోట్లు ●గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యం కీలకం ●స్థానిక బ్యాంకుల సమన్వయంతో చెక్కులు డ్రా చేసే సౌలభ్యం ●మండలాల వారీగా వేర్వేరు తేదీలతో లబ్దిదారులకు చెక్కుల పంపిణీ ●రొటేషన్ పద్ధతిలో నగదు సర్దుబాటుకు వ్యూహాత్మక ప్రణాళిక ●ఈ విధానంలో ఎక్కువ సమయం అవసరమవుతున్నందున ఏప్రిల్‌లోనే చెక్కుల పంపిణీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఏడాది ఖరీఫ్ నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ‘‘పెట్టుబడి మద్ధతు’’ పథకంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. ఈ అంశంపై మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదిక ప్రకారం అధికార యంత్రాంగం ముందడుగు వేస్తోంది. బేరర్ చెక్కుల రూపంలో ఎకరాకు రూ.4వేల చొప్పున ఏప్రిల్ రెండోవారం నుంచి పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ పథకానికి ప్రతిపాదించిన అంచనాల ప్రకారం రూ.6వేల కోట్ల నగదును సమకూర్చుకోవడంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో సమస్యను అధిగమిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో సాధ్యాసాధ్యాలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇందుకు సంబంధించిన నిధులను సమకూర్చుకునేందుకు, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో కరెన్సీ కొరతను అధిగమించేందుకు ఆర్థికశాఖ అధికారులు మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ పథకం అమలుకు సులువైన మార్గాలపై తాజాగా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) ఇచ్చిన నివేదిక ప్రకారం చెక్కుల పంపిణీలో వ్యూహాత్మక టైమ్ షెడ్యూల్‌ను అమలు చేయనున్నారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యంతో, స్థానిక బ్యాంకుల సమన్వయంతో లబ్ధిదారులైన రైతులు చెక్కులను విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. అయితే ఒక్కో మండలం పరిదిలో ఒక్కో తేదీని ఖరారుచేసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో ఉన్న నగదును రొటేషన్ పద్ధతిలో సర్ధుబాటు చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే కొంత ఎక్కువ సమయం అవసరమవుతున్నందున ఏప్రిల్ రెండోవారం నుంచే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

విస్తృత సంప్రదింపులతో ఉపసంఘం ప్రతిపాదనలు

వారం, పది రోజులపాటు విస్తృతస్థాయి చర్చలు, సంప్రదింపులతో కసరత్తు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఇటీవలే ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. ఈ పథకం అమలు విషయంలో తలెత్తిన అనేక సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. బీడు భూములు మినహాయించి వ్యవసాయ యోగ్యమైన భూములు కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి రాయితీ పథకాన్ని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. అలాగే బేరర్ చెక్కుల రూపంలోనే ఈ మొత్తాన్ని పంపిణీ చేయాలని తేల్చి చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పున నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ తిరిగి నిర్ధేశిత మొత్తానికి చెక్కులను పంపిణీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

కేంద్రంతో కొనసాగుతున్న సంప్రదింపులు

ఈ పథకం అమలుకు ఏకకాలంలో సుమారు ఆరువేల కోట్ల రూపాయలు అమసరమవుతున్నందున కేంద్ర ఆర్థిక మంత్రితో చర్చించి నిధుల సమకూర్పుపై ఒప్పించాలని నిర్ణయించారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. తాజా సమాచారం మేరకు వారంలోగా పెట్టుబడి మద్ధతు పథకం అమలుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. నిధుల సమకూర్పుకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్బీఐ గవర్నర్‌లను కలిసిన ఆర్థిక, వ్యవసాయ మంత్రులు వాస్తవ పరిస్థితులను వివరించారు.

ప్రభుత్వం తలపెట్టిన ‘పెట్టుబడి మద్ధతు’ పథకం అమల్లో తలెత్తిన చిక్కుముడి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించుకోవడం కష్టసాధ్యంగా మారడంతో కేంద్రాన్ని సంప్రదించక తప్పలేదు. ప్రతిపాదిత మొత్తాన్ని రైతులకు నగదు రూపంలో చెల్లించేందుకు ఆర్థిక నిబంధనలు అడ్డొస్తున్నందున వెసులుబాటు కోరారు. అదే సమయంలో సుమారు రూ.6వేల కోట్లకు పైగా ఏకకాలంలో కరెన్సీ అవసరమవుతున్నందున ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్బీఐ గవర్నర్ ఉజ్జిత్ పటేల్‌లను కలిసి నిధుల సర్ధుబాటును ప్రతిపాదనలను అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 71.75 లక్షల రైతు ఖాతాలకు సంబంధించిన ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేశామని, తగిన సహకారం అందిస్తే లక్ష్యాలను చేరుకుంటామని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా 1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి రూ. 4వేల చొప్పున పెట్టుబడి చెల్లిస్తున్న విషయాన్ని స్పష్టం చేశారు.

ఉచిత విద్యుత్, పెట్టుబడి మద్దతుతో రికార్డు

నిరంతర ఉచిత విద్యుత్, పెట్టుబడి మద్ధతు పథకాలతో దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రికార్డును సృష్టిస్తోంది. రైతులకు నమ్ముకున్న వృత్తిపై భరోసా కల్పిస్తోంది. వివిధ రకాల సామాజిక మాధ్యమాలు, ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్‌లలో సీఎం నిర్ణయాన్ని కొనియాడుతూ లక్షలాదిగా సందేశాలు పంపిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చిన్న, మధ్యతరహా, భారీ నీటి ప్రాజెక్టులు, బోరుబావుల కింద ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాలకుపైగా వ్యవసాయ భూమిలో పంటలు సాగవుతున్నాయి. సుమారు 40 లక్షల ఎకరాలు వ్యవసాయ యోగ్యమైనప్పటికీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రతియేటా బీడు భూములుగానే మిగులుతున్నాయి. వ్యవసాయ రంగంలో ఆధారపడి జీవిస్తున్న కోటి 20 లక్షల కుటుంబాల్లో సుమారు 40 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర సాగుకు అవసరమైన ముడి సరుకును సబ్సిడీపై అందిస్తున్నా, వడ్డీలేని రుణాలను పంపిణీ చేస్తున్నా గడిచిన మూడేళ్ళలో ఆశించిన ఫలితాలు సాధ్యం కాలేదు.

పాక్‌ను ఏకాకి చేయం... ప్రపంచాన్ని ఏకం చేస్తాం

●జాతీయ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: పాకిస్తాన్‌ను ఏకాకిని చేసేందుకు భారత్ అత్యంత వ్యయ ప్రయాసలకు ఓర్చి పనిచేస్తున్నదనే అభిప్రాయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం తోసిపుచ్చారు. తన దేశాన్ని దశాబ్దాలుగా పీడిస్తున్న ఉగ్రవాదాన్ని ఓడించడానికి ప్రపంచ శక్తులను ఏకం చేయడమే లక్ష్యంగా తాను ప్రయత్నాలు సాగిస్తున్నట్టు ప్రధాని తెలిపారు. పాకిస్తాన్ ప్రాతిపదికగా దేశ విదేశీ విధానం ఉందనే భావన సరి కాదని ఒక జాతీయ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని అన్నారు. ప్రపంచం ఉగ్రవాదం కబంధ హస్తాల్లో నలిగిపోతున్నదని ఆయన తెలిపారు. ఉగ్రవాదుల పట్ల సానుభూతి చూపేవారెవరైనా సరే వారికి వ్యతిరేకంగా ప్రపంచం ఏకమవుతుందని పరోక్షంగా పొరుగుదేశాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వాణి వినిపించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను మోడీ కొనియాడారు.

నేను ఆయన్ను స్వాగతిస్తాను. గౌరవిస్తాను. నా దేశం నలభై ఏళ్ళుగా ఉగ్రవాదంతో సతమవుతున్నది. అమాయకులు బలైపోతున్నారు. అందుకే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అడుగు వేసేవారెవరైనా సరే వారిని కొనియాడుతాను. స్వాగతిస్తాను. ఉగ్రవాదం ప్రపంచం చివరి కొసన ఉండాలి అని ప్రధాని అన్నారు.

పాక్ ప్రజలతో నేరుగా మాట్లాడుతా

పాకిస్తాన్‌కు సంబంధించి భారత్, పాకిస్తాన్ కలసికట్టుగా అనేక సందర్బాల్లో పోరాడాయి. ప్రస్తుతం పేదరికం, వ్యాధులపై పోరాటానికి ప్రస్తుతం సమష్టిగా ముందుకు రావాలని మోడీ అన్నారు. నేను పాకిస్తాన్ ప్రజలతో నేరుగా మాట్లాడుతాను. మనం పేదరికంపై పోరాడుదామా? మనం నిరక్షరాస్యతపై పోరాడుదామా? మనం రోగాలపై పోరాడుదామా? మనం కలిసి పోరాడితే ఇట్టే గెలుస్తాం అని వారికి నేరుగా చెబుతాను అని ప్రధాని తెలిపారు.

న్యాయ సంక్షోభానికి న్యాయ వ్యవస్థతోనే పరిష్కారం

ప్రస్తుత న్యాయ సంక్షోభానికి దూరంగా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం పిలుపునిచ్చారు. న్యాయ సంక్షోభంపై ప్రధాని తొలిసారిగా వ్యాఖ్యలు చేశారు. మన దేశ న్యాయ వ్యవస్థకు అత్యంత ప్రతిభావంతమైన గతం ఉన్నది. వారు అత్యంత సమర్థత కలిగినవారు. వారు ఒక చోట కూర్చొని వారి సమస్యలకు పరిష్కారం కనుగొనగలరు. మన న్యాయ వ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. వారు కచ్చితంగా ఒక పరిష్కారానికి చేరుకుంటారని ఒక జాతీయ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని అన్నారు. ఇదే సందర్భంగా అవకతవకలు లేని మరింత సమర్థమంతమైన పన్ను విధానం కోసం వస్తు, సేవల పన్నుకు(జీఎస్టీ) మరిన్ని మార్పులు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఎవరైనా యాత్రలు చేయవచ్చు

●ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రజాస్వామ్యంలో ఎవరైనా యాత్రలు చేయవచ్చని, రాజకీయ నాయకులు ప్రజల్లో ఉండటం మంచిదేనని ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. ఆది వారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వర్క్‌షాప్‌లో హాజరైన ఆయన పవన్ కల్యాణ్ యాత్రపై స్పందించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో అవినీతి పార్టీ వైసీపీని ఓడించేందుకు పవన్ తమ పార్టీతో జత కట్టారన్నారు. ఎన్నో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకుచ్చారని, వాటి అన్నిం టినీ పరిష్కరించామన్నారు. తెలుగుదేశం పార్టీ వర్క్ షాప్‌లో ఇంటింటికి తెలుగు దేశం, జన్మభూమిలో వచ్చిన ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామన్నా రు. ఇప్పటికే ప్రభుత్వం 95 శాతం సమస్యలను పరిష్కారించదన్నారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంపై, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించామన్నారు. ఈనెల 26నుండి దళిత తేజం - తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దర్శి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రకాశం జిల్లా దర్శి నియోజక వర్గంలోని దొనకొండ మండలానికి చెంది న 2వేలమంది వైసీపీ కార్యకర్తలు సోమవారం రాష్ట్ర అటవీ శాఖమంత్రి మంత్రి శిద్దా రాఘవరావు సమక్షం లో టీడీపీలో చేరనున్నారు. సోమ వారం ఉదయం 11గంటలకు ఒంగోలులోని మంత్రి నివాసంలో జరిగే ఈ కార్య క్రమంలో వైసీపీ కార్యకర్తలు తెలుగు దేశం తీర్థం పుచ్చుకోనున్నారు. అగ్రికల్చర్ మార్కెట్ మాజీ చైర్మన్ ఎమ్. రాచగొర్ల వెంకటయ్య, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి నాయకత్వంలో వీరందరూ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరుతున్నామన్నా మని వారు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో దర్శి నియోజకవర్గం నిరాదరణకు గురైందని, మంత్రి శిద్దారాఘవరావు వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దర్శిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు.

ఎల్ఐసీ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

అమరావతి, ఆంధ్రప్రభ : ఎల్ఐసి తాత్కాలిక ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పలు విభాగాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల సిబ్బంది తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని, రాజ్యసభ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కెవిపి రామచంద్రరావు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో వందల సంఖ్యలో ఎల్ఐసిలో తాత్కాలిక ఉద్యోగు లు పనిచేస్తున్నా.. వాళ్ల సర్వీసులను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వ శాఖలు విఫలమవుతున్నాయని లేఖలో కెవిపి విమర్శించారు.

హిందూమతం జోలికి వస్తే ఊరుకోం

●కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వామిజీ



కదిరి, ప్రభన్యూస్: దేశంలో ఎవరైన హిందూమతం జోలికొస్తే ఊరుకోమని కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందస్వామిజీ హెచ్చరించారు. అనంతపురం జిల్లా కదిరి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి వార్ల రుద్రాభిషేకం, శివపార్వతుల కళ్యాణోత్సవానికి శ్రీ పరిపూర్ణానందస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా భక్తులనుద్దేశించి పరిపూర్ణానందస్వామిజీ మాట్లాడుతూ ఏ మతాన్ని హిందువులు కించపరచ రాదని సూచించారు. దేశంలో ఏమతమైన హిందూ మతం జోలికొస్తే మాత్రం ఊరుకోమని స్వామిజీ ఘాటుగా హెచ్చరించారు. హిందువుల సహనాన్ని చేతగానితనంగా భావిస్తే మాత్రం దాన్ని ప్రతిఘటించే విధంగా తమ సత్తా చూపుతామని హెచ్చరించారు.

భారత దేశ సంస్కృతి, ఆచారాలు, కట్టుబాట్లు గురించి స్వామిజీ వివరించారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడు, శ్రీరాముడు తన ధర్మాన్ని ఎలా కాపాడు కొన్నారో వారిని ఉదాహరణగా తీసుకొని భక్తాదులకు వివరించారు. భారతదేశపు సంస్కృతి, సాంప్రదాయాలు ఏదేశంలో కూడా లేవని తెలిపారు. ఇంతటి గొప్ప సంస్కృతి, సాంప్రదాయాలు కలిగిన భారతదేశం గొపతనాన్ని గురించి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని తెలిపారు. భారతదేశంలో ఒక సంస్కృతి ఉందని, భారతీయులు చెట్టును, నదిని, సూర్యుడిని పూజిస్తారన్నారు. దేవుని ఏ మతం వారు చూపించలేరన్నారు. కళ్లతో కాకుండా మనసుతో చూస్తే రాతిలో ఉన్న దేవుడిని కూడా కనిపిస్తాడని తెలిపారు. వ్యక్తి కంటే వ్యక్తిత్వం గొప్పదని తెలిపారు. మనసుతో దేవుడిని ముడిపెట్టుకోవాలని సూచించా రు.

మన సంస్కృతి ప్రపంచానికే మార్గదర్శకం

●బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



విశాఖపట్నం, ప్రభ న్యూస్ : ఎన్ని యుగాలై నా ప్రపంచంలోని ఏ ప్రాంతీయులైనా పవిత్రంగా పాటించేది భారతీయ సంస్కృతీ వైభవం అని ప్రవచన శిరోమణి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం విశాఖపట్నంలోని గుర జాడ కళాక్షేత్రంలో విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) నిర్వహించిన భారతీయ సంస్కృతీ వైభవం గురించి ఆయన మాట్లాడుతూ రామాయణం, భారతం, భాగవత ఇతిహాసాలు ఎప్పటికీ అందరూ ఆచరించ దగ్గవని చెప్పారు. అతి పవిత్రంగా ప్రపంచ దేశీయులు అనేక మంది ఆచరిస్తూ తమ జీవితాలను ఉద్ధరింపజేసుకుంటున్నా రని పేర్కొన్నారు. మనస్సుని బాగు చేసుకుంటే అన్నీ ద క్కి న ట్లే న ని ఆయన చెబుతూ విలాస విద్యగా ఏ లలిత కళనైనా విద్యతో పాటూ అభ్యసించి సాధన చేయడం అత్యంత అవసరం అన్నారు. అహం, కోపం వీడితే ఎవ్వరైనా ప్రశాంత జీవితం సాగించగలరని, లేదంటే వాటిల్లో తమ జీవితాలను తాము నాశనం చేసుకుంటారని అన్నారు.

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

శ్రీకాకుళం, ప్రభన్యూస్‌బ్యూరో : ఈ నెల 24వ తేదీన సూర్యజయంతి సందర్బంగా రథసప్తమి పండుగకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఆలయ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మాఘశుద్ధ సప్తమి సూర్యనారాయణస్వామి జన్మదినం కావడంతో ఈ నెల 24వ తేదీన అరసవల్లికి లక్షమందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

ప్రతి సంవత్సరం రథసప్తమి రోజున దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి అసరవ ల్లిసూర్యనారాయణ స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఆరోగ్య ప్రదాతగా భక్తులు నమ్మే సూర్యనారాయణ స్వామివారిని రథ సప్తమిరోజున దర్శించు కుంటే ఆరోగ్యంగా ఉంటారన్న విశ్వాసంతో ఆరోజున స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రతి సంవత్స రం భక్తులు తరలివస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసుశాఖ, జిల్లా అధికార యంత్రాంగం, అరసవల్లి ఆలయ అధికారులు ఆ రోజున త్వరితగతిన స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తుంటారు. మంచినీటి సరఫరాతో పాటు ఎక్కడికక్కడ ప్రాథమిక వైద్య సహాయం అందించే బృందాలను కూడా ఏర్పాటు చేస్తారు.

ఏసీబీ కేసుకు ‘హోదా’ తాకట్టు పెట్టారు

●శ్రీకాళహస్తి పాదయాత్రలో జగన్



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: ఏసీబీ పెట్టిన కేసు భయంతోనే ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టిన చంద్రబాబు కేంద్రంపై కోర్టుకు పోతానని చెప్పడం కొత్తరకం మోసానికి తెరతీయడమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో గత నెల 28వ తేది నుంచి కొనసాగిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా ఆయన ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో పర్యటించారు. శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద ఉదయం పాదయాత్రను ప్రారంభించిన జగన్ ఇసుకగుంట, కాపుగున్నేరి క్రాస్, తొండమాన్ పురం క్రాస్, చెర్లోపల్లి గుండా శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోకి ప్రవేశించారు. ఆపై మిట్టకండ్రిగ, టిఎంవి కండ్రిగ, పానగల్ మీదుగా పట్టణంలోని పెండ్లిమండపం సెంటర్ కు చేరుకున్నారు. అక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జి బియ్యపు మధుసూధనరెడ్డి నేతృత్వంలో బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ అధికారం కోసం ఎటువంటి హామీలైనా ఇవ్వడం తరువాత మరచిపోవడం చంద్రబాబునాయుడు నైజమన్నారు. నైతికత అనే పదానికి అర్థం తెలియని వ్యక్తి కనుకనే రాజమండ్రి పుష్కరాలలో తన సినిమా షూటింగ్ కోసం 29 మందిని బలిపెట్టినా, తిరుపతిలో ఎర్రచందనం దొంగల పేర్లతో 20 మంది కూలీలను కాల్చి చంపినా అధికారంలో నిర్బయంగా కొనసాగగలుగుతున్నారన్నారు. రాష్ట్ర ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని విమర్శించారు. మూడున్నరేళ్లపాటు పట్టించుకోకుండా ఉన్న చంద్రబాబు ఎన్నికలు దగ్గరపడటంతో కేంద్రం నిధుల కోసం కోర్టుకు వెళ్తానని చెప్పి ప్రజలను కొత్తరకంగా మోసం చేయడానికి సిద్ధపడుతున్నారన్నారు. నిజంగా కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందని భావిస్తే చంద్రబాబు పార్టీకి చెందిన ఎంపీలను కేంద్రమంత్రి పదవుల్లో ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు.

నేడు ఏపీలో ‘అమ్మకు వందనం’

●మంత్రి గంటా చేతుల మీదగా కార్యక్రమం ప్రారంభం

అమరావతి, ఆంధ్రప్రభ : వసంత పంచమి పర్వ దినాన్ని పురస్కరించుకుని ఈనెల 22న (సోమవారం) రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక,ఎయిడెడ్ పాఠశాల లు, హైస్కూళ్లతో పాటు అన్ని రకాల ప్రైవేట్ విద్యా సంస్థల్లో ‘అమ్మకు వందనం’ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 61,528 విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పా ట్లు చేశారు. అన్ని రకాల ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వహిం చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం నిర్వహించే కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని 5వేల ఉన్నత,గురుకుల, మున్సిపల్ పాఠశాలలతో పాటు ప్రైవేట్,అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థల్లో కూడా నిర్వహించనున్నారు. ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు వ్యక్తిగతంగా పర్యవేక్షించనున్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లల్లో మహిళల పట్ల సరైన రీతిలో గౌరవం, భక్తిభావం పెరిగేలా చూడాలనే లక్ష్యంతో సీఎం అమ్మకు వందనం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. విశాఖపట్నం జిల్లా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి గంటా సోమవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

పశు సంవర్ధకశాఖలో పదోన్నతులు

●94 మందికి డిప్యూటీ డైరెక్టర్లుగా ఆదేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ : గత ఎనిమిది సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న పశు సంవర్ధక శాఖ ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారానికి తెర పడింది. పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న 94 మందిని డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ శాఖలో పదోన్నతుల పండుగ వాతావరణం నెలకొంది. గత ఎనిమిది సంవత్సరాలుగా కోర్టులో ఉన్న ఈ వ్యవహారా నికి కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పదోన్నతి కల్పించడానికి మార్గం సుగమమైంది. శాఖాపరంగా నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత లేని కారణంగా పదోన్నతికి అర్హులు కాదనే అంశం మీద వ్యవహారం కోర్టుకు చేరింది. పదోన్నతికి పరీక్ష ఉత్తీర్ణత అర్హత అవసరం లేదని కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పదోన్నతులు కల్పించడానికి అవకాశం ఏర్పడింది. కోర్టు ఆదేశాలు వచ్చిన తరువాత ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మందికి అసిస్టెంట్ డైరెక్టర్లకు పదోన్నతి రావల్సివుండగా అందు లో 94 మందికి పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పదోన్నతి పొందిన 94 మంది డిప్యూటీ డైరెక్టర్లను రాష్ట్రం లోని 45 డివిజన్లకు 45 మదిని డిప్యూటీ డైరెక్టర్లగాను, వెటర్నరీ పాలిక్లినిక్‌లకు 13 మందిని, ఎస్ఎల్‌బీపీకి 13 మందిని, జిల్లా ప్రధాన కేంద్రాల్లోని లైవ్ స్టాక్ కేంద్రాలకు 13 మందిని, పశుగాణాభివృద్ధికి 13 మందిని కమిషనరేట్‌లో 5 మందిని, మిగిలిన వారిని షిప్, లైవ్ స్టాక్, శిక్షణ కేంద్రాలు వంటి ఇతర ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చారు.



ఒక్కసారి గెలిస్తే చాలదు.. శాశ్వత గెలుపే లక్ష్యం

175 అసెంబ్లీ సీట్లు... 25 ఎంపీ స్థానాలు మనవే కావాలి: ఏపీ సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ : గతంలో ప్రభుత్వ వ్యతిరేకత గెలుపు, ఓటములను నిర్ణయించేవని, ఇప్పుడు ప్రతిభ మాత్రమే గెలుపు, ఓటములను నిర్ణయించే పరిస్థితులు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకప్పుడు ఎన్నికలంటే ఐదేళ్ళు అధికారం, మరో ఐదేళ్ళు ప్రతిపక్షంలో ఉండే పరిస్థితి ఉందని, ఇప్పుడు సానుకూలత సాధించినవారే విజయాలు సాధిస్తున్నారని, దీనికి ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికలే నిదర్శనమన్నారు. జాగ్రత్తగా పనిచేస్తే ఓటమి అనేది ఉండదని నేతలకు మార్గదర్శకం చేశారు. కొన్ని రాష్ట్రాల్లో అధికార పార్టీలు 15ఏళ్ళ నుండి 20ఏళ్ళు ఇంకా అధికారంలో కొనసాగుతున్నాయని ఉదాహరించారు. ప్రజలు మన సమర్థత, ప్రవర్తనను నిశితంగా గమనిస్తున్నారని, వారిలో మంచి అభిప్రాయాన్ని పెంచుకోవడంతో పాటు సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాలన్నారు. పనులు చేయడం ఎంత ముఖ్యమో, రాజకీయ ఏకీకరణ కూడా అంతే అవసరమన్నారు. ఈ ఏడాది రాజకీయ ఏకీకరణపై నేతలు దృష్టిసారించాలని, ఒక్క ఎన్ని కలో గెలుపు లక్ష్యం కాదని, శాశ్వతంగా గెలిచే విధంగా బాటలు వేసుకోవాలని నేతలకు మార్గద ర్శకం చేశారు. గడిచిన మూడున్నరేళ్ళుగా చేసిన పనుల వల్ల కలిగిన సంతృప్తి తన 40ఏళ్ళ సుదీర్ఘ రాజకీయ జీవితంలో పొందలేదన్నారు.

విభజనను ఒక సవాల్‌గా తీసుకుని సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని లక్ష్యాలను అధిగమిస్తున్నామని చెప్పారు. పనులు చేయడం ఎంత ముఖ్యమో.. ప్రజలతో మమేకం అవ్వడం కూడా అంతే అవసరమన్నారు. నిత్యం వారికి అందుబాటులో ఉంటూ మెప్పు పొందాలని హితబోధచేశారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ముఖ్యమంత్రి నివాస సమీపంలోని గ్రీవెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1991 తర్వాత దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభం అయ్యాయని, ఆనాటి నుండి ప్రజలు ప్రతిభ ఉన్నవారికే పట్టం కడుతున్న విషయాన్ని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. ఒకప్పుడు 9యేళ్ళ పాటు అధికారంలో ఉన్నప్పటికీ కొంచెం తప్పటడుగు వేయడంతో అధికారం కోల్పోయామన్నారు. కొంత మంది హైదరాబాద్‌కు తాను చేసింది ఏమి లేదని మాట్లాడుతున్నారని, అయితే 1995కు ముందు ఉన్న హైదరాబాద్, ఆ తర్వాత చూస్తే ఎవరు ఏం చేశారో అర్థం అవుతుందని ముఖ్యమంత్రి కౌంటర్ ఇచ్చారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో గెలుపే లక్ష్యం కావాలని, ఆ దిశగా నేతలు పనిచేయాలని కోరారు. అన్ని స్థానాల్లో గెలవకపోతే మనలో ఎక్కడో లోపం ఉన్నట్లేనన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అన్యాయాన్ని ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, చిత్తుగా ఓడించడమే కాకుండా భవిష్యత్తు లేకుండా చేశారని వ్యాఖ్యానించారు.

ఇదే విషయాన్ని ఇటీవల ప్రధాని మోడీకి చెప్పానన్నారు. తలసరి ఆదాయంలో దక్షిణ భారతదేశంలో ఉన్న రాష్ట్రాల కన్నా తక్కువగా ఉన్నామని, వారితో పాటు సమానంగా పైకి వచ్చే వరకు చేయూతనివ్వాలని కోరినట్లు తెలిపారు. యువజన హామీల ప్రకారం న్యాయం చేయాలని ప్రధానమంత్రిని కోరానన్నారు. మూడున్నర సంవత్సరాల తర్వాత ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పెట్టామని, దీనిపై పార్టీకి చెందిన కొందరు నేతలు ఇది సరైన సమయం కాదన్న తాను వినలేదన్నారు. ప్రజల నుండి ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ లభించిందని, పార్టీ స్థాపించి 36ఏళ్ళు గడిచిందని, ఇంత విజయవంతమైన కార్యక్రమం మరొకటి లేదన్నారు. టెక్నాలజీ సహాయంతో రాష్ట్రంలోని కోటి 38లక్షల కుటుంబాలను కలిశామని, 54లక్షల అర్జీలు ప్రజల నుండి వచ్చాయన్నారు. ప్రతీ సమస్యకు సైన్‌టిఫిక్ పరిష్కారం చూపించామన్నారు. తాజాగా జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించామని చెప్పారు. సమైక్యాంధ్రలో 18సార్లు, నవ్యాంధ్రలో 5 సార్లు జన్మభూమిని నిర్వహించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ విడత నిర్వహించిన జన్మభూమిని తాను జన్మలో మరచిపోలేనని, 9రోజుల పాటు 16వేల గ్రామాల్లో రోజుకో అంశంపై చర్చలు పెట్టి నూతన ఒరవడికి నాంది పలికామన్నారు. ప్రజల నుండి సమస్యలు చాలా తక్కువగా వచ్చాయని, దాదాపు అన్ని సమస్యలను ఇంతక ముందే పరిష్కరించామని చెప్పారు. 18లక్షల వినతులు ప్రజల నుండి వచ్చాయని, వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నా మన్నారు. ఇళ్ళ కోసం 2,34,681 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సాధికార , సేవా మిత్ర, జన్మభూమి కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా సమస్యలు అక్కడే పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఇప్పటికే పార్టీకి అనుకూలంగా ఉన్నారని, ఇంకా వారిని పార్టీకి దగ్గర చేస్తే గెలుపు నల్లేరుమీద నడకేనన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తం చేశారు. జన్మభూమి - మా ఊరు విజయ స్ఫూర్తితో ఈ నెల 26 నుండి దళిత తేజం - తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిసెంబర్ నాటికి ప్రజాసంతృప్తి 58శాతం ఉండగా, ప్రస్తుతం 63శాతంకు పెరిగిందన్నారు. రానున్న ఏప్రిల్‌కి మరో 5శాతం పెరిగేలా చూడాలని నేతలకు మార్గదర్శకం చేశారు. గత ఎన్నికల్లో పార్టీకి దూరమైన సామాజిక వర్గాలను దగ్గర చేర్చుకునే దిశగా కృషి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను పారదర్శకంగా, విమర్శలకు తావు లేకుండా చేస్తున్నామ న్నారు. ఇప్పటి వరకు 52శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు.

రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ. 7,431కోట్లు వెచ్చించగా, కేంద్రం రూ. 4,324కోట్లు విడుదల చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. మరో 3,017కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేశామని, త్వరలో గోదావరి, పెన్నా నదుల అనుసంధానానికి శ్రీకారం చుడతామన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్ట్‌లు పూర్తిచేస్తూ వస్తున్నామని చెప్పారు. పట్టిసీమ, ఇతర ప్రాజెక్టులపై కొన్ని పార్టీలు లిటిగేషన్‌లు పెట్టాయని , పరోక్షంగా వైకాపాను ముఖ్య మంత్రి విమర్శించారు. పట్టిసీమ పూర్తికాదని, అయితే రాజకీయ సన్యాసం చేస్తామని సవాల్ విసిరారని అన్నారు. ఇప్పుడు అవి పూర్తికావడంతో తోకముడిచారని ఎద్దేవా చేశారు.

'నెట్'ఇంట చిన్నారులు

బీజింగ్ : ప్రస్తుతం ఇంటర్‌నెట్ తెలియనివాడంటూ ఉండటం లేదు. అన్నీ గ్రామాలకు అంతర్జాల సేవలు అందుబాటులోకి ఉండటంతో ప్రపంచ వ్యాప్తంగా దీని వాడకం పెరిగిపోయింది. చిన్న పిల్లలు కూడా ఇంటర్‌నెట్ వేదికగా ఎంజాయ్ చేస్తున్నారు. చైనాలోని జినుహా న్యూస్ ఏజెన్సీ ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి తీసుకొచ్చింది. ఇంటర్‌నెట్‌కు చిన్న పిల్లలు ఎంత బానిస అయ్యారో చూస్తే ప్రతి ఒక్కరూ నోరెళ్లబెట్టక మానరు. మూడింట ఒక వంతు పిల్లలు రోజుకు సుమారు 30 నిమిషాల పాటు ఇంటర్‌నెట్‌ను ఉపయోగిస్తున్నట్టు సర్వేలో తేలింది. వీరంతా స్కూళ్లకు కూడా వెళ్లనివారే అని తెలిసింది. కనీసం 30 నిమిషాలు ఇంటర్‌నెట్‌ను ఆన్ చేసుకుని ఏదోలా సంతృప్తి పొందుతున్నట్టు జినుహా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ఈ సర్వే వివరాలను ఈవారం ఏజెన్సీ విడుదల చేసింది. ఎడ్యూకేషన్ రీసెర్చ్ సెంటర్ దేశ వ్యాప్తంగా సర్వే నిర్వహించింది. చైనా నేషనల్ యూత్ ప్యాలెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ అధ్యయం కొనసాగింది. చైనా వ్యాప్తంగా మూడు నుండి ఆరేళ్ల వయస్సు ఉన్న సుమారు 29శాతం పిల్లలు ప్రతీ రోజు కనీసం 30 నిమిషాలు ఇంటర్‌నెట్‌తో కాలం వెళ్లదీస్తున్నట్టు చెప్పింది. చైనా



వ్యాప్తంగా 14ఏళ్ల విద్యార్థులు కూడా 30 నిమిషాల పాటు ఇంటర్‌నెట్ ఉపయోగించేవారు 60శాతం ఉన్నట్టు తెలిసింది. ఇంత చిన్న వయస్సులోనే ఇలా ఇంటర్‌నెట్ ఉపయోగిస్తుంటే భవిష్యత్ కాలంలో మాత్రం దానికి బానిసలు అయిపోతారని మానసిక వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చదువుతో పాటు సాంకేతికరంగంలో కూడా తమ పిల్లలు అభివృద్ధి చెందేలా చూడాలని, కానీ అదేపనిగా ఇంటర్‌నెట్‌పై స్వేచ్ఛ ఇస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని పలువురు హెచ్చరిస్తున్నారు.

టూరిస్ట్ కేంద్రాలుగా ఐస్‌ల్యాండ్స్

న్యూయార్క్ : మన్‌హట్టన్ అంటే అతి చిన్న ఐస్‌ల్యాండ్‌గా పర్యాటకులకు పరిచయం. చాలా మంది దీవిని సందర్శించడానికి వస్తుంటారు. న్యూయార్క్‌కు ఉత్తర భాగంలోని తీరం వద్ద ఉన్న దీవి కేవలం టెన్నిస్ కోర్టు సైజులోనే ఉంటుంది. అక్కడ కేవలం ఓ ఇల్లు, చెట్టు, బీచ్ మాత్రమే ఉంటుంది. ఇంట్లో కొన్ని కుర్చీలు, సింగిల్ కాట్ బెడ్ ఉంటుంది. 30వేల స్క్వేర్ ఫీట్ స్థలంలో నిర్మించబడి ఉంటుంది. 1950లో దీన్ని సీజ్‌ల్యాండ్‌కు చెందిన ఓ కుటుంబం కొనుగోలు చేసింది. గతంలో ప్రయివేటు ఐస్‌ల్యాండ్‌గా ఉండేది. ఆ కుటుంబం హాలిడే స్పాట్‌గా గుర్తించి దీన్ని తీసుకుంది. ద్వీపం అనేది సెయింట్ లారెన్స్ నదిలో ఉన్నది. దీంతో ఎంతో మంది పర్యాటకులను ఆకర్శించింది. ఎంతో చారిత్ర కలిగిన ఈ భూమి సగ భాగం బ్రిటన్ బిషప్‌కు సంబంధించిగా ఉంది. 1982లో అతి చిన్న దీవిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం కూడా సంపాదించుకుంది. తరువాత దాని గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. కెనడా-అమెరికా సరిహద్దు వెంట ఉన్న 100 మైళ్ల మేర సెయింట్ లారెన్స్ నది విస్తరించి ఉంది. సుమారు 1,864 దీవులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. కానీ సీజ్‌ల్యాండ్ దీవికి మాత్రం ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. దీవి గా పిలవడానికి కొన్ని నియమాలు కూడా ఉంటాయి. నీటి మట్టం ఆధారంగా చేసుకుని ఆ ప్రాంతానికి



దీవిగా అర్హత ఇస్తారు. చాలా దీవుల్లో పర్యాటకులు వెళ్లడానికి అనుమతి లేదు. ఎన్న కొన్ని దీవులకు వెళ్లడానికి మాత్రం బోటు సహాయం తీసు కోవాల్సి ఉంటుంది. 1900లో సీజ్‌ల్యాండ్ కు చెందిన కుటుంబం దీన్ని నిర్మించింది. ఈ దీవిలో రెండు గదులతో పాటు నదీ అందాలు తిలకించడానికి సౌకర్యాలు ఉంటాయి. బోల్డ్ కోట ఎంతో ప్రాముఖ్యం పొందింది. దీన్ని 1904లో జార్జ్ నిర్మించారు. ఈయన న్యూయార్క్‌లో ఎంతో చరిత్ర కలిగిన వాల్డాఫ్ అస్టోరియా హోటల్‌కు జనరల్ మేనేజర్‌గా పని చేశాడు. అతని భార్యకు ఈ కోటను బహుతిగా అందజేశాడు.

ఒకే కుటుంబంలో నలుగురి ఆత్మహత్య

జైపూర్: రాజాస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ దుర్ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పోలీస్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మృతులు జనరాం(38), భార్య సంతోష్(35), కుమార్తె సుమిత్ర (22), కుమారుడు గణపత్ (20) నలుగురు తమ ఇంటిలోనే ఉరేసుకున్నారని తెలిపారు. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో బగ్రాసార్ గ్రామంలోని వారి నివాసంలో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ కుటుంబం ఆత్మహత్య లేఖను ఇంటిలో ఉంచారని వారి ఆత్మహత్యకు కారణాలు తెలియాలసి ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 8మంది మృతి

దుమ్కా: ఝార్ఖండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిదిమంది మృతి చెందారు. ఝార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో జెర్మండి పోలీస్ స్టేషన్ పరిధిలోని జర్దాహా పహారీ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక జీపు, లారీ ఢీకొన్న ఘటనలో 8మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడుగురు ఒక వాహనంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాసేందుకు దుమ్కా నుంచి డియోగారిన్ వెళుతుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. వాహనం డ్రైవరు కూడా ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. దుమ్కా సబ్ డివిజనల్ అధికారి రాకేష్ కుమార్ మాట్లాడుతూ దుమ్కా జిల్లాలోని జర్దాహా పహారీ సమీపంలో ప్రమాదం జరిగిందన్నారు. గాయపడినవారిని దుమ్కాలోని సదర్ వైద్యశాలకు తరలించామన్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి తీవ్రంగా ఉందన్నారు.

ప్లాంట్ పేలుడులో నలుగురి మృతి

వడోదర: గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (జిఐడిసి) ప్రాంతంలో వడోదర సమీపంలోని నందెసారీలో ఉన్న ఒక రసాయన ప్లాంట్‌లో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి నలుగురు కార్మికులు చనిపోయారని సంబంధిత సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఘటనలో నలుగురు చనిపోగా మరో తొమ్మిదిమంది గాయపడ్డారన్నారు. జిఎస్సి క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రసాయన ప్లాంట్లో పేలుడు జరిగిందన్నారు. పేలుడు ధాటికి భారీగా అగ్ని కీలలు ఎగిసిపడ్డాయన్నారు. ఈ పేలుడు ధాటికి పరిసర ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ఈ పేలుడు ఉదయం 5.30ప్రాంతంలో జరిగిందన్నారు. ఈ ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టరు పి.భారతి మాట్లాడుతూ పేలుడు వల్ల నలుగురు కార్మికులు మరణించారన్నారు. తీవ్రంగా గాయపడిన తొమ్మిదిమంది పరిస్థితి కూడా విషమంగా ఉందన్నారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించామని ఆమె తెలిపారు. ప్రమాదానికి కారణం ఇంకా తెలియలేదన్నారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలుపాటు ప్రయత్నించి మంటలును అదుపు చేశారని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ప్లాంట్ సామగ్రి, యంత్రాలు దెబ్బతిన్నాయన్నారు. మంటలు అదుపుచేసే క్రమంలో సమీపంలో ఉన్న పలు కంపెనీల యూనిట్లను మూసివేయించామని అగ్నిమాపక సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

72 గంటల్లో నిందితుల్ని పట్టుకోవాలి

లాహోర్ : ఏడేళ్ల బాలికపై పైశాచికత్వంగా దాడి చేసి, హత్య చేసి, చెత్త బుట్టలో పారేసిన ఘటన విషయమై నిందితులను 72 గంటల్లో పట్టుకోవాలని పాకిస్థాన్ సుప్రీం కోర్టు పోలీసు శాఖను ఆదేశించింది. పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్ పట్టణంలో ఈ దారుణం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. జైనాబ్ (7) తల్లిదండ్రులు ఉమ్రా యాత్రకు సౌదీ అరేబియా వెళ్లిన సమయంలో జనవరి 9న ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీసు వ్యవహారశైలిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సుమారు 800 మంది అనుమానితుల డీఎన్ఏను పరీక్షిస్తున్నారు. బాధిత కుటుంబానికి ఇప్పటికీ న్యాయం చేయకపోవడంపై పాకిస్థాన్ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ మియాన్ సాకిబ్ నిసార్ అసహనం వ్యక్తం చేశారు. 2015 నుండి సుమారు 8 మంది చిన్నారులపై ఇలాంటి అఘాయిత్యాలు జరిగాయి. అమాయక చిన్నారులపై లైంగిక దాడి జరగడంతో ఏం మాట్లాడాలో అర్థం కావడం లేదని నిసార్ అన్నారు. ఏం చేస్తారో తెలీదు 72 గంటల్లో నిందితులను పట్టుకోవాలని ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేశారు.

భారత్ డిప్యూటీ హైకమిషనర్‌కు సమన్లు

ఇస్లామాబాద్ : కాల్పుల ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను భారత్ డిప్యూటీ హై కమిషనర్‌కు పాకిస్థాన్ సమన్లు జారీ చేసింది. సరిహద్దు వెంట భారత్ బలగాల కాల్పుల్లో ఇద్దరు పౌరులు మృతి చెందినట్టు పాక్ చెప్పుకొచ్చింది. ఇరు వైపుల నుండి యథేచ్ఛగా కాల్పులు జరుగుతుండటంతో సరిహద్దు ప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇప్పటి వరకు భారత్ డిప్యూటీ కమిషనర్ జేపీ సింగ్‌కు పాకిస్థాన్ ఐదుసార్లు సమన్లు జారీ చేసింది.

ముంబై స్లమ్ టు అమెరికా



• 5 సెకన్లలో రూ. 9కోట్ల జాక్‌పాట్ • ఆన్‌లైన్ స్పిన్ గేమ్‌తో మారిన తలరాత • సినిమా స్టోరీని తలపించిన విహాన్ పటేల్ జీవనం

ముంబై : ముంబై... అనగానే గుర్తుకొచ్చేది పెద్ద పెద్ద భవనాలు.. దేశానికి ఆర్థిక రాజధానిగా పేరొందింది. రాజభోగాలు అనుభవిస్తూ గాజు మేడల్లో జీవనం సాగించేవారు ఎంతో మంది ఉంటారు. ముంబైలోని మురికి వాడలను దృష్టిలో పెట్టుకుని స్లమ్‌డాగ్ మిలీనియర్ సినిమా కూడా తీశారు. 2008లో విడుదలైన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముంబై మురికి వాడలో చిన్నారుల జీవనం.. వారిలో నిగూఢమైన ప్రతిభను అత్యంత హృద్యంగా తెరపై ఆవిష్కరించారు. ఇలా ముంబై మురికి వాడలో పెరిగిన ఓ బాలుడు పెద్దవాడై తరువాత 'కౌన్ బనేగా కరోడ్ పతి' అనే కార్యక్రమంలో పాల్గొని 2కోట్ల రూపాయలు ఎలా గెలుచుకున్నాడన్నది ఈ చిత్ర సారాంశం.. సినిమాల్లో చేసేవి నిజ జీవితంలో సాధ్యం కావు అనే వారు చాలా మంది ఉంటారు. కానీ 27 ఏళ్ల విహాన్ పటేల్ మాత్రం అందరూ అనుకుంటున్నది తప్పు అని రుజువు చేశారు. పటేల్, ముంబైలోని మురికివాడలో నివసించేవాడు. సాధారణ జీవనాన్ని కొనసాగిస్తూ.. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. వస్త్ర పరిశ్రమలో దినసరి కూలీగా పని చేశారు. ఎంతో కష్టపడ్డాడు. కడుపు మాడ్చుకుని పని చేశాడు. భారతదేశ ఆర్థిక రాజధానిలోని మురికివాడలో నివసించిన పటేల్.. ప్రస్తుతం ప్రపంచాన్నే శాసిస్తున్న అమెరికాలో తన కుటుంబ సభ్యులతో ఎంతో సంతోషంగా గడుపుతున్నాడు. ముంబైలో ఉన్న సమయంలో పటేల్ భార్యకు కూడా రోజూ పని దొరికేది కాదు. 9నెలల పాటు మార్చుకుంటూ ఎక్కడ పనిచేసినా తాత్కాలికంగానే ఉండేది. ముంబైలోని ఓ సూపర్‌మార్కెట్‌లో కూడా పనిచేశాడు. ఖాళీ సమయం దొరికినప్పుడల్లా ఫేస్‌బుక్ ఓపెన్ చేసేవాడు. అందులో భాగంగా ఆన్‌లైన్‌లో వచ్చే 150 ఉచిత స్పిన్‌లను నొక్కేవాడు. ఇది పూర్తి చేయడానికి కేవలం 15 నిమిషాల సమయం మాత్రమే పట్టేది. స్పిన్‌లను నొక్కడం అంటే తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడమే. ఇదో డబ్బులు సంపాదించే ఆన్‌లైన్ గేమ్. ఎప్పుడు అయితే 9నిమిషాల్లో 10 స్పిన్‌లు చేశాడో అప్పుడు అతని తలరాత మారిపోయింది. గ్రాండ్ మాండయిల్ క్యాసినో విహాన్ పటేల్ జీవితాన్ని మార్చింది. అప్పటి వరకు కొన్ని వేలు మాత్రమే ఉన్న పటేల్ బ్యాంకు ఖాతాలో కోట్ల రూపాయలు వచ్చి పడ్డాయి. ఒక్క స్పిన్‌తో సుమారు రూ.9,43,49,014 సంపాదించాడు. దీనికి కేవలం 5 సెకండ్ల సమయం మాత్రమే పట్టింది. అలా వేలాదికారి నుండి కోటీశ్వరుడు అయిపోయాడు విహాన్‌పటేల్. దీంతో అతని ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అప్పటి వరకు కడుపేదరికంలో బతుకీడిస్తూ వచ్చిన విహాన్‌పటేల్... గ్రాండ్ మాండయిల్ క్యాసినో జాక్‌పాట్‌తో కోటీశ్వరుడయ్యాడు. చిన్నపాటి ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అంతటితో ఆగకుండా ఏదో ఒకటి చేయాలన్న తపనతో కుటుంబంతో అమెరికా బాట పట్టాడు. ఇప్పుడు అగ్రరాజ్యంలో తనకంటూ ఓ స్థానం సంపాదించుకుని సుఖంగా నివాసం ఉంటున్నాడు. అమెరికాలో భారీ పెట్టుబడి పెట్టి ఓ మ్యాన్సన్‌ను సొంతం చేసుకున్నాడు.

గ్రాండ్ మాండయిల్ క్యాసినో నా జీవితాన్ని మార్చే సింది. ముందు దీన్ని నమ్మలేదు. ఇప్పటికీ నమ్మలేకపోతున్నా.. మురికివాడల్లో ఉండే నేను అమెరికా రావడం ఏంటి అని... స్పిన్‌తో వచ్చిన డబ్బులు కల అనుకున్నా. మెగా మూల్హా కారణంగా నాకు ఈ జాక్‌పాట్ తగిలింది.

నా వయస్సును నిర్ధారించుకున్నారు. నా అకౌంట్‌లో రూ.9,43,49,014 నా అకౌంట్‌లో జమ చేశారు. నమ్మశక్యం కాలేదు. నేను చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. నా వయస్సు నిర్ధారించుకున్న తరువాతి రోజే నా ఖాతాలో డబ్బులు వేశారు. పూర్తిగా తెలుసుకున్న తరువాత ఈ వార్తను నా కుటుంబ సభ్యులకు చెప్పాను. అప్పుడు నాకు ఏడుపు ఆగలేదు. ఎంతో సంతోషం అనిపించింది. నాటి క్షణాలు ఇప్పటికీ గుర్తుండిపోయాయి.

నమ్మశక్యం కాలేదు : విహాన్ పటేల్

నా కలలు సహకారం చేసుకున్నాను. ఇప్పుడు నా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా అమెరికాలో ఉంటున్నాను. అమెరికా వెళ్లాలి అనేది నా కల. అది గ్రాండ్ మాండయిల్ క్యాసినోతో పూర్తయింది. ఇది నిజమేనా అని ప్రతీ రోజూ నాకు నేను ప్రశ్నించుకుంటూ ఉంటాను. ఇంతటితో ఆగలేదు. వచ్చిన డబ్బులను సరైన రీతిలో ఖర్చు చేసుకుంటూ ఎంతో ఆనందాన్ని పొందుతూ వస్తున్నాను. దేశ వ్యాప్తంగా గెలుపొందిన వారిలో విహాన్ ఒక్కడే కాదు చాలా మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వస్తుంటారు. గత నెలలో ఇది ప్రారంభమైంది. దేశ వ్యాప్తంగా సుమారు 240 మంది ఆటగాళ్లు భారీ మొత్తంలో నజరానా పొందారు. గత నెలలో కంపెనీ వీరందరికీ రూ.100 కోట్లను అందజేసింది.

ప్రత్యేక కోర్టులకు ఏటా 8 కోట్లు

న్యూఢిల్లీ : చట్టసభలకు సంబంధించిన 1,500 కేసులు పరిష్కరించడానికిగాను 12 స్పెషల్ కోర్టులు కొనసాగించడానికి మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. దీనికి గాను సంవత్సరానికి రూ.8 కోట్లు ఖర్చు అవుతుందని తేల్చింది. వివిధ రాష్ట్రాల్లో వీటి కేటాయింపు జరుగుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గత నెలలో న్యాయ మంత్రిత్వ శాఖ కేబినెట్ సెక్రెటరీ పీకే సిన్హాకు లేఖ రాశారు. నవంబర్‌లో ఎంపీ, ఎమ్మెల్యేలకు సంబంధించిన 1,581 కేసులు పెండింగ్‌లో ఉన్నా యని, వాటిని వెంటనే పరిష్క రించాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది.

మరో ఓటింగ్‌కు సిద్ధం

వాషింగ్టన్ : అమెరికాలో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఉభయ సభలో సభ్యులు మరోసారి ఓటు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు. టాప్ సెనెట్ రిపబ్లికన్ మిచ్ మెక్కొన్నెల్ మాట్లాడుతూ.. సోమవారం ఉదయం ఓటు వేయడానికి సిద్ధం అవుతున్నట్టు ప్రకటించారు. సంక్షోభాన్ని మరింత సాగదీయకుండా ఉండేందుకుగాను సభ్యులు చర్చలు నిర్వహిస్తున్నారు. స్కముర్ ట్రంప్‌తో పాటు జెల్‌ఓతో చర్చలు చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ట్రంప్ వ్యవహారశైలిపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. అతన్ని అంగీ కరించేలా చేయడం కఠినతరమని రాజకీయ నాయకులు చెప్పుకొచ్చారు.

ఢిల్లీలో యథావిధిగా అమెరికా ఎంబసీ

న్యూఢిల్లీ : ఢిల్లీలోని అమెరికా ఎంబసీ కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నామని, కార్యకలాపాలకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని అమెరికా ప్రతినిధి చెప్పుకొచ్చారు. అమెరికా పాలన యంత్రాంగాన్ని నడిపేందుకు అవసరమైన ఖర్చులను నిర్ధేశించే వినిమయ బిల్లును సెనెట్ తిరస్కరించడంతో షట్‌డౌన్ ప్రారంభమైంది.

ఈ నేపథ్యంలో ఢిల్లీలోని అమెరికా అధికారులు స్పం దించారు. డెమోక్రాట్లకు కొందరు రిపబ్లికన్ ప్రతినిధులు తోడు కావడంతో ఈ బిల్లు వీగిపో యిందని ఇక్కడి ప్రతినిధులు చెప్పుకొచ్చారు. వీసా ఇంట ర్వ్యూలు, అమెరికన్ సిటిజన్ సర్వీసెస్ అపాయింట్‌మెంట్‌లు ఉన్న వారు ఎంబసీ కార్యా లయానికి రావొచ్చని తెలిపారు. అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

పాంచ్ పటాకాతో బీజింగ్‌లో కలవరం



అగ్ని-5 ప్రయోగం..చైనాకు దీటైన సమాధానం!

న్యూఢిల్లీ: బంగాళా ఖాతంలోని అబ్దుల్ కలామ్ ద్వీపం నుంచి గురువారం భారత్ ప్రయోగించిన అగ్ని-5 క్షిపణి విజయవంతంగా దూసుకుని పోవడంతో చైనాలో కలవరం బయలుదేరింది. ఐదువేల కిలోమీటర్ల సుదూర లక్ష్యాన్ని ఛేదించగల ఈ ఖండాంతర క్షిపణికి అణు వార్‌హెడ్‌లను మోసుకుని వెళ్ళగల సామర్థ్యం ఉంది. ఆసియాలోనే కాకుండా, యూరప్, ఆఫ్రికాలోని నిర్దేశిత ప్రాంతాలకు ఛేదించుకుని వెళ్ళగల సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది. భారత్ అణు సంపతికి, సామర్థ్యానికీ ఇది గీటురాయి. అణు సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతున్న చైనాని నిరోధించడానికి ఇది ఎంతో తోడ్పడగలదని నిపుణులు పేర్కొంటున్నారు.

సింగపూర్‌లోని జాతీయ విశ్వవిద్యాలయంలో దక్షిణాసియా అధ్యయన విభాగం రిసెర్చ్ అసోసియేట్ రాజీవ్ రంజన్ చతుర్వేది ఈ ప్రయోగం విజయవంతం కావడంపై వ్యాఖ్యానిస్తూ.. ''భారత అణ్వస్త్ర సముపార్జన కృషిలో ఇది ఒక మైలురాయి'' అని అభివర్ణించారు. చైనా నుంచి అణ్వస్త్ర ముప్పు ఉంది. ఇది దీర్ఘకాలికమైనది. ఇతర దేశాలన్నింటి మాదిరిగానే భారత్ కూడా తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పెంచుకుంటోందని ఆయన అన్నారు. అదే సందర్భంలో చైనా ముప్పును మాత్రమే దృష్టిలో పెట్టుకుని కాదనీ, భారత్ తన అజెండా ప్రకారమే ముందుకు సాగుతోందని ఆయన అన్నారు.భారత్ రక్షణ విధానం శాస్త్రీయమైనది. చైనా ప్రదర్శిస్తున్న దూకుడు కూడా భారత్ చొరవకు ఒక కారణమై ఉండవచ్చు. భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం కనుక, పటిష్టమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం అత్యవసరమని చతుర్వేది స్పష్టం చేశారు.

కౌన్సిల్‌లో సభ్యత్వానికి మరింత అర్హత

అగ్ని-5 క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంతో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని కలిగిన చైనాతో సహా ఐదు అణ్వస్త్ర దేశాల సరసన చేరేందుకు భారత్‌కి మరింత అర్హత లభించిందని మీడియా వ్యాఖ్యానించింది.అగ్ని-5 క్షిపణి అగ్ని-4 కన్నా ఎంతో మెరుగైన అణు సాంకేతిక పరిజ్ఞానం కలిగినది. చైనాతో సమానంగా, ఇంకా చెప్పాలంటే, చైనాకు దీటుగా అణ్వస్త్ర సామర్థ్యాన్ని భారత్ సముపార్జించుకుంది అనడంలో ఎటువంటి సందేహం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో చైనా ఎటువంటి అనుమానాలు పెట్టుకోనవసరం లేదనీ, భారత్ సమఉజ్జీగా తయారుకావడం వల్ల ఇరుదేశాల మధ్య స్నేహ సంబంధాల వృద్ధికి ఇది ఒక ఆలంబన కాగలదని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ అంతర్జాతీయ అధ్యయనాల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణసింగ్ స్పష్టం చేశారు. అగ్ని-5 రక్షణ వ్యవస్థ అమ్ములపొదిలోకి వచ్చే వరకూ భారత్‌కు ముప్పు తొలగిపోయినట్టు కాదని అన్నారు.

చైనా అక్కసు

చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పదాతి దళం మాజీ శిక్షకుడు సోంగ్ ఝోంగ్‌పింగ్ అగ్ని-5 ప్రయోగం విజయవంతం కావడంపై తన అక్కసును బయటపెట్టుకున్నారు. ఉత్తర కొరియా ప్రయోగాల వల్ల ఉద్రిక్తత నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి ప్రయోగాలు మరింత ఉద్రిక్తతను సృష్టిస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉత్తర కొరియా కవ్వించే ప్రయోగాలకూ, భారత క్షిపణి సామర్థ్యం నిగ్గు తేల్చే ప్రయోగాలకూ ముడిపెట్టడం చైనా అసూయకు నిదర్శనం. సోంగ్ హాంకాంగ్‌లో ఫోనిక్స్ టెలివిజన్‌లో మిలటరీ వ్యాఖ్యాతగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. భారత్ అణ్వస్త్ర సామర్థ్యాన్ని చైనా ఇక ఎంత మాత్రం తక్కువగా అంచనా వేయజాలదని ఆయన స్పష్టంచేశారు.

గెలుపు గుర్రాల వేట

• ఢిల్లీలో ఉప ఎన్నికలకు సిద్ధమైన రాజకీయ పార్టీలు • వేగంగా పావులు కదుపుతున్న ప్రతిపక్షాలు • ఆప్‌కు షాకిస్తామంటున్న బీజేపీ • అసెంబ్లీ అడుగుపెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నం • 20 స్థానాల్లోనూ మళ్లీ గెలుస్తామని ఆప్ ధీమా

న్యూఢిల్లీ: లాభదాయక పదవుల వ్యవహారంలో 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటంతో ఢిల్లీలో ప్రధానపార్టీలన్నీ ఉప ఎన్నికలపై దృష్టిపెట్టాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ సిఫార్సుకు రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేయడంతో ఢిల్లీ బీజేపీలో నూతనోత్సాహం కనిపిస్తోంది. గతంలో కోల్పోయిన స్థానాల్లో సగమైనా తమ ఖాతాలో వేసుకోవాలని కృతనిశ్చయంతో ఉన్న కాషాయ దళం ఇప్పటికే కసరత్తును ప్రారంభించింది. గెలుపు గుర్రాలను బరిలోకి దించి..20 స్థానాల్లో మెజారిటీ స్థానాలు కైవశం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. శనివారం ప్రత్యేకంగా భేటీ అయిన ఢిల్లీ బీజేపీ నేతలు ఉప ఎన్నికల అంశంపై కూలంకశంగా చర్చించినట్లు సమాచారం. ఎన్నికలు జరిగే అసెంబ్లీ స్థానాల్లో ప్రజాదరణ కలిగిన నాయకులను బరిలోకి దించడం ద్వారా ఆప్ కు షాక్ ఇవ్వడంతో పాటు అసెంబ్లీలో బలాన్ని పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా లాభదాయక పదవులు అలంకరించడంతో వారిపై అనర్హత వేటుపడింది.

20 మంది ఎమ్మెల్యేలు అనర్హులు కావడంతో వారి ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఉప ఎన్నికలు అనివార్యమ్యాయి. ఉపఎన్నికలు జరిగేద్వారక, చాంజినిచౌక్, గాంధీనగర్, కల్కాజి, నాజఫ్‌గర్, కస్తూర్బానగర్, కొండ్లీ, మేరౌలి, లక్ష్మీనగర్, జంగాపురా, వాజీర్‌పూర్, జనక్‌పురి, బురారి, రోహ్తాస్‌నగర్, సదాఖ్‌బజార్, నరేలా, మోతీనగర్, ముంద్కా, రాంజింద్రనగర్, తిలక్ నగర్ ఉన్నాయి. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేరని హామీలనే ప్రచారాస్త్రాలుగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

కేజ్రీ రెండున్నర నెలల పాలన

2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఆమ్ ఆద్మీ పార్టీ కంటే ఎక్కువ మెజారిటీ వచ్చాయి. మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ 32 స్థానాలు కైవశం చేసుకోగా.. ఆమ్ ఆద్మీ పార్టీ 28 స్థానాలను, కాంగ్రెస్ పార్టీ8 స్థానాలును కైవశం చేసుకున్నాయి. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ అనూహ్యంగా కాంగ్రెస్‌తో జతకట్టిప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. లోక్ జనపాల్ బిల్లుకు శాసనసభ వ్యతిరేకత తెలిపడంతో అందుకు నిరసనగా కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో కేజ్రీవాల్ రెండున్నర నెలల పాలన అంతమైంది.దీంతో 14ఫిబ్రవరి 2014 నుంచి 11 ఫిబ్రవరి 11,2015 వరకు దాదాపు ఏడాది కాలం ఢిల్లీలో రాష్ట్రపతి పాలన కొనసాగింది.

ఉప ఎన్నికలకు సిద్ధమైన ఆప్

ఢిల్లీలో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటంతో అధికార పార్టీ రెండు మార్గాలను అన్వేషిస్తోంది. ఒకటి న్యాయస్థానాలకు వెళ్లడం ద్వారా తమ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై సవాల్ చేయడం..రెండోది ఉప ఎన్నికలకు వెళ్లడం.. ఉప ఎన్నికలు అనివార్యం అని మెజారిటీ నిపుణలు స్పష్టంచేస్తుండటంతో ఎన్నికల కసరత్తును కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఉప ఎన్నికలు జరిగితే 20 స్థానాలను మళ్లీ తమ ఖాతాలోనే వేసుకోవాలని ఆప్ కృత నిశ్చయంతో ఉంది.

అసెంబ్లీలో అడుగుపెట్టేందుకు కాంగ్రెస్ కసరత్తు

గత అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికలొస్తే 20 స్థానాల్లో సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు దక్కించుకోవాలని కసరత్తును ప్రారంభించింది.

2015 ఎన్నికల్లో ఇదీ పరిస్థితి

2015లో చివరగా జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 54.3శాతం ఓట్లతో 67 స్థానాలను కైవశం చేసుకోగా..బీజేపీ 32.3 శాతం ఓట్లతో 3 స్థానాలు గెలుచుకుంది.ఇక కాంగ్రెస్ కు 9.7 శాతం ఓట్లు పోలవగా..,బీఎస్పీకి 1.3 శాతం, శిరోమణి అకాలీ దళ్ కు 0.5 శాతం, ఇండియన్ నేషనల్ లోక్ దళ్‌కు 0.6 శాతం,స్వతంత్రులకు 0.5 శాతం ఓట్లు దక్కినా ఒక్క ఎమ్మెల్యే స్థానాన్ని గెలుచుకోలేకపోయారు. నోటా బటన్ ను 35వేల 924 మంది నొక్కి...0.4 శాతం మంది నొక్కారు.

కాంగ్రెస్‌తో పొత్తు లేదు

కలసి పనిచేస్తాం : సీపీఎం



కోల్‌కతా: బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసే వారందరితో కలిసిపనిచేస్తామని సీపీఐ(ఎం) స్పష్టంచేసింది. కోల్‌కతాలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ కార్యదర్శివర్గ సమావేశాల్లో పార్టీ రాజకీయ తీర్మానంపై చర్చించి ఓటింగ్ నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ప్రసక్తే లేదని సమావేశం తీర్మానించింది. అయితే బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లకు పోరాటానికి కాంగ్రెస్ తో కలిసిపనిచేస్తామని సీపీఐ(ఎం)జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాల సూచనల మేరకు రాజకీయ తీర్మానానికి సంబంధించిన ముసాయిదాకు పలు సవరణలు చేశామని ఏచూరి స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు జరుగుతున్న పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సమావేశాల్లో చివరి రోజు ముసాయిదా తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. అయితే ప్రస్తుత జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రతిపాదించిన తీర్మానానికి కార్యదర్శి వర్గం వ్యతిరేకించింది. కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకోవాలన్న ఏచూరి ప్రతిపాదనలను తిస్కరించింది. మాజీ జాతీయ కార్యదర్శి ప్రకాశ్ కారత్ తీర్మానికి జాతీయ కార్యదర్శి వర్గం ఓకె చెప్పింది. బీజేపీ,ఆర్ ఎస్ఎస్ లపై పోరాటానికి అన్ని పార్టీలతో కలిసిపనిచేస్తాం కానీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమన్న కారత్ తీర్మానానికి మెజారిటీసభ్యులు మద్దతు పలికారు. దీంతో ఈ సమావేశాల్లో ఏచూరి- కారత్ మధ్య ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఏచూరి తీర్మానికి 31 ఓట్లు పోలవగా.. కారత్ తీర్మానానికి 55 ఓట్లు వచ్చాయి. ఏప్రిల్ లో హైదరాబాద్ లో జరగనున్న పార్టీ కీలక సమావేశాల నేపథ్యంలో సీపీఐ(ఎం) తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉప రాష్ట్రపతి నివాసంలో సంక్రాంతి సందడి

● ప్రధాని మోడీ, మన్మోహన్, హమీద్ అన్సారీ, అద్వానీ, జైట్లీ హాజరు

● దక్షిణాది సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు



సంక్రాంతి మిలన్‌కు హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ, మన్మోహన్‌సింగ్, హమీద్ అన్సారి, అమిత్‌షా, జైట్లీ, సుష్మా స్వరాజ్ తదితరులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్యుడికి అంకితం చేసే పండుగే మకర సంక్రాంతి అని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. ఢిల్లీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి మిలన్ కార్యక్రమంలో ఆయన సంక్రాంతి పండుగ విశిష్టత గురించి చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నప్పటి నుంచి ప్రతియేటా నిర్వహించడం ఆనవా యితీగా మార్చుకున్న వెంకయ్య, ఉప రాష్ట్రపతి అయ్యాక తొలిసారిగా తన నివాసంలో ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు.
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ, భారతీయ జనతా పార్టీ అధినేత అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఎల్.కే. అద్వాణీ, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి, కేంద్ర సమా చార కమిషనర్ మాడభూషి శ్రీధర్ సహా పలువురు సీనియర్ నేతలు, ఢిల్లీలో పనిచేస్తున్న తెలుగు అధికా రులు హాజరయ్యారు. తెలుగు పండుగలు, దక్షిణాది సంస్కృతిని ఎల్లప్పుడూ చాటిచెప్పే ఉప రాష్ట్రపతి వెం కయ్య నాయుడు, ఈ ఏడాది కూడా వివిధ సాంస్కృ తిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సూర్యుడు ఉత్త రాయణంలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో జరుపుకునే ఈ పండుగను దేశవ్యాప్తంగా వేర్వేరు పేర్లతో జరుపు కుంటారని ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకయ్య నాయుడు అన్నారు. మకర సంక్రాంతి లేదా పొంగల్ పేరేదైనా సరే పంట చేతికొచ్చే సమయంలో సాను కూల దృక్పథంతో ఈ పండుగను ఉత్సాహభరితంగా జరుపుకుంటారని అన్నారు. ఈ పండుగలో అసలైన హీరోలు రైతులేనని, వారి శ్రమను గుర్తించాల్సిన అవ సరం ఎంతైనా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.
సంక్రాంతి మిలన్ సందర్భంగా ఆయన వివిధ రకాల సంక్రాంతి పిండివంటలు, తీపి వంటకాలను రుచి చూపించారు. దక్షిణాదిన మాత్రమే లభించే తేగలు, అరిసెలు, బొబ్బట్లతో పాటు దక్షిణాది అల్పా హారాలను కూడా అందుబాటులో ఉంచారు. కార్యక్రమానికి హాజరైన ఉత్తరాది నేతలు, అధి కారులు ఎంతో ఇష్టంగా ఈ వంటకాలను రుచి చూశారు.

ఫిరాయింపుల ప్రోత్సాహానికే పరోక్షం

● 23 నుంచి గ్రామస్థాయి ఆందోళనలు ● పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్టీ ఫిరాయింపులు మరింతగా ప్రోత్సహించేందుకే పంచాయతీలకు పరోక్ష ఎన్నికలు నిర్వహించాలని సీఎం చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారెడ్డి ఆరోపించారు. పరోక్ష పద్ధతిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, 23 నుంచి గ్రామ స్థాయిలో ఉద్య మం చేపడుతామని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 27న అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాలు, 30 జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టి తాహసీల్దార్లకు, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. పంచాయతీలను నిర్వీర్యంచేయడానికే ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. పంచాయతీరాజ్ చట్టంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికలను బ్యాలెట్ ద్వారానే నిర్వహించాలన్నారు. ఈ నాలుగేళ్ల టీఆర్ఎస్ పాలనలో పంచాయతీల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. కేంద్రం ప్రభుత్వం విడుదల చేసే ఫైనాన్స్ నిధుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం కోతపెట్టిందన్నారు. పం చాయతీలకు పూర్తిగా అధికారాలు లేకుండా సర్పంచ్ వ్యవస్థను నిస్తేజం చేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నందునే.. ప్రభుత్వం పరోక్ష ఎన్నికలను నిర్వహించాలని భావిస్తోందన్నారు. ఎంపీటీసీల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను కొనుగోలు చేయడంలో సీఎం కేసీఆర్ రాటుతేలారని ఆయన విమర్శించారు. వార్డు సభ్యులను కూడా కొనుగోలు చేయాలనే ఆలోచనతోనే పరోక్ష పద్ధతిని ఎంచుకున్నారన్నారు. ప్రజా స్వామ్యం దెబ్బతిని డబ్బులున్నవారికే పదవులు దక్కు తాయని ఆయన వివరించారు. 72వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ సర్పంచ్‌లకు గౌరవం కల్పించారని ఉత్తమ్ చెప్పారు. ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రస్తుత సర్పంచ్‌లు ఆరు నెలల పదవీ కాలాన్ని కోల్పోతారన్నారు. ముందస్తు ఎన్నికలు నిర్వహించి సర్పంచ్‌లను అవమానించడం సరికాదన్నారు. డిసెంబర్ 15 నాటికి ప్రకటించాల్సిన ఓటర్ల జాబితాను ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో అనేక అనుమానాలున్నాయని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించాలని, కొత్తగా ఏర్పడే ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 50 లక్షలు ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయించాలని ఆయన కోరారు.

రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

● గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నేతలు భట్టి, వీహెచ్ అసహనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గవర్నర్ నరసింహన్‌పై కాంగ్రెస్ నేతలు మరోసారి విరుచుకుపడ్డారు. రాజ్యాంగం పరిరక్షకుడిగా ఉండాల్సిన గవర్నర్.. టీఆర్ఎస్ ప్రచారకుడిగా మారాడని దుయ్యబట్టారు. రాజ్‌భవన్‌ను తెలంగాణ భవన్‌గా మారుస్తాడేమోననే భయం కలుగుతోందని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన గాంధీభవన్ మాజీ ఎంపీ హనుమంతరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్‌లో గవర్నర్ నరసింహన్ మాట్లాడిన తీరు ఆయన హోదాను మర్చి మాట్లాడారని ఆయన ఆక్షేపణ వ్యక్తం చేశారు. గవర్నర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు భట్టి తెలిపారు.
అంబేద్కర్ ప్రాణిహిత- చేవెళ్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించిందని భట్టి తెలిపారు. రూ. 38,500 కోట్ల అంచనా వ్యయం ఉండగా గత కాంగ్రెస్ ప్రభుత్వమ రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు పేరు కాళేశ్వరంగా మార్చి రూ.80,500 కోట్ల అంచన వ్యయానికి పెంచిందన్నారు. మూడున్నరేళ్లలోనే రూ. 50 వేల కోట్ల తేడా ఎందుకు వచ్చిందో గవర్నర్ అడగాల్సింది పోయి.. సీఎం కేసీఆర్‌ను కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు అని, మంత్రి హరీశ్‌రావును కాళేశ్వర్‌రావు అని అభివర్ణించడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులలో జరిగిన అవినీతిపై ప్యాకేజీ వారిగా రాజ్‌భవన్‌లో రివ్యూ చేస్తే బాగుంటుందని భట్టి సూచించారు. ఏఐసీసీ కార్యదర్శి హనుంతరావు మాట్లాడుతూ గవర్నర్ మీద కూడా భవిష్యత్‌లో కేసులు పెట్టే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పొగుడుతున్న గవర్నర్‌కు అవినీతిలోనూ భాగస్వా మ్యం ఉందని ఆరోపించారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులను రాజ్‌భవన్‌కు పిలిపించుకుని మాట్లా డితే వాస్తవాలు తెలుస్తాయని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు.

గ్రామాల్లో డయాలసిస్ సేవలు

● వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి



ఆదిలాబాద్, ప్రభ న్యూస్ బ్యూరో : మెరుగైన వైద్యసేవలతో రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు కృషి చేస్తున్నామని త్వరలో గ్రామీణ ప్రాంతాల్లోను డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని, రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్యశాఖా మంత్రి డాక్టర్ లక్ష్మా రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖామంత్రి జోగు రామన్న, రాష్ట్ర దేవాదాయ గృహనిర్మాణ శాఖా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిలతో కలిసి ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రిలో ఉట్నూర్‌లోని సామాజిక ఆసుపత్రిలో పలు ప్రారంభోత్సవాలు చేశారు. నిర్మాణంలో ఉన్న ఆదిలాబాద్ ప్రధాన మంత్రి స్వచ్ఛ సంరక్షణ పథకం కింద నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన అనంతరం రిమ్స్ ఆసుపత్రిలో సిటిస్కాన్, రేడియాలజీ, డిజిటల్ ఎక్స్ రే రూమ్, ఐసీయూ, డయాలసిస్ సెంటర్, మెడిసన్ సెంటర్, స్టేయింగ్ రూమ్స్‌తో పాటు రిమ్స్ ఆవరణలో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను జిల్లా మంత్రులతో కలిసి మంత్రి లక్ష్మా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్య సౌకర్యాల కోసం వైద్య ఆరోగ్యశాఖలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రిమ్స్ అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయిస్తామని అన్నారు. రిమ్స్‌లో పారిశుధ్య నిర్వహణకు త్వరలో కొత్త టెండర్లను పిలుస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోగాల నివారణకు తమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు ఫలితాలను ఇచ్చాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విష జ్వరాలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చామన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన, అంటువ్యాధులపై అవగాహన లాంటి విషయాలపై మీడియా మరింత ప్రచారం చేయాలని సూచించారు. రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి లక్ష్మారెడ్డితో పాటు మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్ రెడ్డి వైద్యఆరోగ్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఉట్నూర్‌కు బయలుదేరి ఉట్నూర్‌లోని సామాజిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను మంత్రులు ప్రారంభించారు.

మరో నిజాం సీఎం కేసీఆర్

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ



వికారాబాద్, ప్రభన్యూస్ : తెలంగాణరాష్ట్రాన్ని భ్రష్టు పట్టించే విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పాలన ఉందని, కుట్ర పూరిత రాక్షస ప్రభుత్వం కొనసాగుతుందని 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు కేవలం నలుగురికే పరిమితం అయ్యాయని, మరో నిజాంను తలపించేలా కేసీఆర్ పాలన చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షులు, మాజీ మంత్రి ఎల్. రమణ ఆరోపించారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బి అతిథి గృహంలో జిల్లా పార్టీ అధ్యక్షులు సుభాష్ యాదవ్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామకృష్ణ, సీనియర్ నాయకులు చంద్రయ్యతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పటికి అప్పుల భారం మోపింది తప్ప చేసింది శూన్యమన్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణ పేరుతో కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 68 వేల కోట్ల రూపాయల అప్పులు ఉన్న బడ్జెట్‌ను రూ.2 లక్షల 30 వేల కోట్ల రూపాయలకు పెంచిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉద్యమకారులకు ఏమాత్రం సమచిత స్థానం కల్పించలేదని ఆయన దుయ్యబట్టారు. రాజకీయ గుత్తాధిపత్యం తప్ప ప్రజలకు చేస్తుంది శూన్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ తిరిగి పునర్వైభవం రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. నేటికి గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు దేశం పార్టీ హయాంలోనే జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికి దర్శనమిస్తున్నాయని దళితులకు మూడ ఎకరాల భూమి అంటూ ఏ ఒక్క దళితుడికి ఇచ్చిన దాఖలాలు లేవని ఆయన అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా 4 వేల పడకల ఆసుపత్రిని నిర్మిస్తామన్న టీఆర్ఎస్ ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. ప్రగతి భవన్ పూర్తిగా పైరవీ భవన్‌గా మారిందని గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు ఉన్నప్పటికి ఏ ముఖ్యమంత్రి సెక్రెటేరియట్ కు రాకుండా పాలన సాగించ లేదని అన్నారు. దేశంలో సెక్రటేరియట్‌కు రాకుండా పాలన సాగిస్తున్న తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆరోపించారు. హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను ఎత్తివేయడంతో పాటు మందకృష్ణ మాదిగను అరెస్టు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.

నేరరహిత రాష్ట్రంగా తెలంగాణ

● శాంతి భద్రతలపై నాలుగు జిల్లాల ఎస్పీలతో డీజీపీ మహేందర్‌రెడ్డి సమీక్ష



డీజీపీ మహేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న చిత్రం


ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : రాష్ట్రాన్ని నేర రహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీసు వ్యవస్థను పటిష్టం చేస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ ఎం. మహేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూర్‌లో ఆయన పర్యటించారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు అధికారులతో డీజీపీ సమావేశమై నూతన పోలీసు వ్యవస్థ, సాంకేతిక ఆధునీకరణపై దిశా నిర్దేశం చేశారు. రామగుండం నుంచి నేరుగా హెలికాప్టర్‌లో నార్త్ జోన్ ఐజిపి వై నాగిరెడ్డి, కరీంనగర్ రేంజ్ డిఐజి ప్రమోద్‌కుమార్‌తో కలిసి ఉట్నూర్‌కు చేరుకున్న ఆయన ఉట్నూర్‌లోని కుమ్రంభీం కాంప్లెక్స్‌లో జిల్లా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులతో పిఎంఆర్‌సీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు.
జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ భద్రత కల్పించడం కోసమే పోలీసు వ్యవస్థ ఉందని, ప్రజలకు జవాబుదారి ఉండేవిధంగా పోలీసులు పనిచేయాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులు ఫిర్యాదుదారులను గౌరవంగా చూడాలని అన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు పోలీసులు కట్టుబడి ఉండాలని అన్నారు. పోలీసుస్టేషన్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు ఒకే తరహాలో పోలీసింగ్ ఉండేవిధంగా మార్పులు తెస్తున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. ఏ సమయంలోనైనా బాధితులు పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఒకే విధంగా పోలీసు స్పందన ఉండాలని సూచించారు. పోలీసుల పనితీరు మెరుగుపర్చుటకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.
మారుమూల మండల స్థాయి పోలీసుస్టేషన్‌లను కూడ హైదరాబాద్ తరహాలో ఆధునీకరించి సౌకర్యాలు మెరుగుపర్చే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బలహీన వర్గాలు మహిళలు, బాలికలు అన్యాయానికి, దౌర్జన్యానికి గురికాకుండా చట్టబద్దంగా వారికి రక్షణ కల్పిస్తూ వారి సంక్షేమ భద్రత లక్ష్యంగా పనిచేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఇటీవల ఉట్నూర్‌లో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో జిల్లా పోలీసులు సంయమనంగా హుందాగా విధులు నిర్వహించాలని కితాబిచ్చారు.
సమావేశంలో నార్త్ జోన్ ఐజిపి వైనాగిరెడ్డి, కరీంనగర్ డిఐజి ప్రమోద్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ డి. దివ్య, ఎస్పీ విష్ణు ఎస్ వారియర్, నిర్మల్ అదనపు ఎస్పీ దక్షణమూర్తి, కుమ్రంభీం జిల్లా అదనపు ఎస్పీ గోద్రు, డిఎస్పీలు వెంకటేష్, కె నర్సింహారెడ్డి. టి మనోహర్ రెడ్డి, రాములు, సాంబయ్య, సత్యనారాయణ, ఎ విశ్వప్రసాద్, స్థానిక సిఐ టి వినోద్, ఎస్సై సాయన్న, తదితరులుపాల్గొన్నారు.

బర్కత్ అలీఖాన్ వివరాలెక్కడ?

న్యూఢిల్లీ : నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ హైదరాబాద్ రాష్ట్ర పాలకుడని భారత ప్రభుత్వం గుర్తించిన రికార్డులు ఎక్కడున్నాయో తెలపాలని కేంద్ర సమాచార కమిషన్ హోం శాఖను ప్రశ్నించింది. బర్కత్ అలీఖాన్‌కు సంబంధించిన ఆధారాలేమీ లభించడం లేదని హోంశాఖ వివరణపై సీఐసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. బర్కత్ అలీకి సంబంధించిన రికార్డులను గుర్తించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సమాచార కమిషనర్ యశోవర్ధన్ ఆజాద్ కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించారు. 1967లో ఉస్మాన్ అలీ ఖాన్ మరణంతో నాటి నుంచి నిజాం వారసుడిగా బర్కత్ అలీని భారత ప్రభుత్వం గుర్తిస్తూ సర్టిఫికెట్ ఇచ్చింది. అయితే ఆ తర్వాత కాలంగా ఖాన్ బంధువులు లేవనెత్తిన లిటిగేషన్లతో ఆస్తులన్నీ ఎవరి చెంతకు చేరాయనేది తెలియలేదు. ప్రస్తుతం ఆర్‌టీఐ ద్వారా బత్కల్ అలీఖాన్‌కు సంబంధించిన వివరాలు, వారసత్వ సర్టిఫికెట్‌ను ఆయన తాత మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మరణించిన నాటి నుంచి (ఫిబ్రవరి 24,1967) ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఆ సర్టిఫికెట్‌ను 1981 లోనే కేంద్ర హోంశాఖ నేషనల్ ఆర్కైవ్స్‌కు పంపామని చెబుతున్నా.. తమకు అందలేదని ఆర్కైవ్స్ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త కమిటీని వేసి బత్కత్ అలీఖాన్ వివరాలు సేకరించాలని కమిషన్ ఆదేశించింది.

ఏపీ ఎమ్మెల్సీ వాకాటి అరెస్టు?

● బెంగళూరులో విచారించిన సీబీఐ



నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో : నెల్లూరు జిల్లాకు చెందిన స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డిని సీబీఐ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. బ్యాంకులను మోసం చేశారనే ఆరోపణలపై ఆదివారం బెంగళూరు సీబీఐ విచారణకు పిలిచి అనంతరం అరెస్టు చేసినట్లు సమాచారం. గత ఏడాది మార్చిలో జరిగిన స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల్లో జిల్లా నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఆయనపై మే నెలలో ఐఎఫ్‌సీఐ బ్యాంకు సీబీఐకు ఫిర్యాదు చేసింది. గతంలో తమ బ్యాంకు నుంచి తీసుకున్న రూ. 180 కోట్ల రుణాలు తిరిగి చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో మే చివరి వారంలో నెల్లూరు వేదాయపాళెంలోని వాకాటి నివాసంపై సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి ఆస్తులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకుంది. అప్పట్లో అధికార పార్టీ ఎమ్మెల్సీ ఇంటిపై సీబీఐ సోదాలు చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడం అన్ని పత్రికల్లో పెద్ద ఎత్తున కథనాలు రావడంతో తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వాకాటిని తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఆయన గత 6 నెలలుగా పార్టీ ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అయితే జనవరి మొదటివారంలో జరిగిన పక్షుల పండుగ కార్యక్రమం నుంచి ఆయన చురుగ్గా ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు అధికారిక సమావేశాల్లో కూడా పాల్గొంటున్నారు.
ఈ నేపథ్యంలోనే ఆయనపై పార్టీ విధించిన సస్పెన్షన్‌ను కూడా తొలగించబోతున్నారని పార్టీ వర్గాలు కూడా భావించాయి. శనివారం నెల్లూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా ఆయన స్థానిక టీడీపీ ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. ఇంతలోనే ఆదివారం సీబీఐ ఆయనను విచారణ నిమిత్తం బెంగుళూరుకు పిలిపించడం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

మాజీ డీజీపీ ఆర్‌కె రాగాల మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ డీజీపీ రాగాల కొండలరావు (ఆర్‌కె రాగాల) (86) మరణించారు. గతకొంతకాలంగా అస్వస్థతగా ఉన్న ఆయన హబ్సిగూడ, కాకతీయనగర్‌లోని స్వగృహంలో ఆదివారం తుది శ్వాస విడిచారు.

ఐపీఈలో ఎగ్జిక్యూటివ్ పీజీ కోర్సు

● డైరెక్టర్ ఆర్‌కె మిశ్రా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైస్ సంస్థలో కొత్తగా ఏఐసీటీఈ ఆమోదం తెలిపిన ఎగ్జిక్యూటివ్ పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌కె మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో చేరడం కోసం ఈ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు ఐపీఈలో సంప్రదించాలని, 9000181276 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జనసంద్రం మేడారం

● అమ్మల దర్శనానికి వస్తున్న భక్తులు ● 20 లక్షలకు చేరిన భక్తుల సంఖ్య



మేడారం, ప్రభ న్యూస్ : సమ్మక్క- సారలమ్మ మేడారం జాతరకు భక్తుల సందడి రోజు రోజుకు పెరుగుతుంది. ఆదివారం వరకు మేడారంను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న సంఖ్య 20 లక్షలకు పైగా ఉంటుందని సమాచారం. జాతర ప్రారంభించి 20 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు తండోప తండాలుగా అమ్మవారి దర్శనానికి తరలి రావడంతో మేడారం గ్రామం మహానగరంగా విలసిల్లుతుంది. మామూలు సమయంలో ఎలాంటి క్రయ విక్రయాలు జరుగని ప్రదేశాలు సైతం అన్ని రకాల తినుబండరాలు స్నాక్స్ అందుబాటులో ఉండడంతో భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకుంటున్నారు. జాతరను దృష్టిలో పెట్టుకొని వివిధ రంగాలకు చెందిన వ్యాపారస్థులు కోట్లాది రూపాయల పెట్టుబడితో వ్యాపార రంగానికి సిద్ధమయ్యారు. జాతర ఏర్పాటు సమయంలో వారం రోజుల్లో సుమారు 5 కోట్లకు పైగా టర్నోవర్ జరిగే అవకాశం ఉంటుందని అంచనా. జాతరలో ఆధునీకరించడంతో రెండు దశాబ్దాల క్రితం ఎక్కడ చూసిన ప్రాంగణంలో ఎడ్ల బండ్లు సైకిళ్లు, గుడారాలు వేసుకొని విడిది చేసి వారం రోజుల ప్రయాణానికి సిద్ధం చేసుకొని ఉండేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించాల్సిన మొక్కులను చెల్లించుకొని ఆనందోత్సవాల మధ్య తిరుగుప్రయాణం అవుతున్నారు. పాఠశాలలకు, ఉద్యోగులకు వారంతపు సెలవులు శుక్ర, శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఎక్కువ మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరగడంతో పూర్తి స్థాయిలో మరుగుదొడ్లు సిద్ధం కాకపోవడంతో జాతర ప్రాంగణంలో సంచార మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అలాగే జాతరలోని ప్రధాన రహదారుల వద్దే కాకుండా ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసి సంచార మరుగుదొడ్లపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు. జాతర నిర్వహణకు ఏర్పాటు చేసిన అధికారులు పూర్తి స్థాయిలో విధులు నిర్వహించకపోవడంతో సౌకర్యాలు ఇంకా పూర్తి కాలేదు. ఆలయ ప్రాంగణంలోని గ్రిల్స్‌కే కాకుండా ముఖ్య రహదారుల ప్రాంగణంలోని ప్రధాన కట్టడాలైన గోడలకు సైతం ఇప్పుడే పెయింటింగ్ వేయడంతో దర్శనానికి వస్తున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
అధికారులు మేడారం జాతర నిర్వహణకు 3 నెలల ముందుగానే టెండర్లు నిర్వహించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కాకుండా అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో జాతర సమీపిస్తున్న కొద్ది నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయలేకపోతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల క్రితం అధికారులకు భాద్యతలు అప్పచెప్పిన ఇప్పటి వరకు అధికారులు విధుల్లో చేరకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు ఇప్పటికైన జాతర అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేస్తూ కొంతవరకైన పూర్తి చేయవచ్చని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

స్వచ్ఛతతోనే పర్యాటక అభివృద్ధి

జీహెచ్ఎంసీ కమిషనర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా స్వచ్ఛంగా ఉంచడం ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెంది ఆర్థికాభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని జీహెచ్ఎంసీ కమిషనర్ బి. జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ-2018పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, చారిత్రక సాంస్కృతి జనవారసత్వం కలిసిన హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛ నగరంగా చేయడం ద్వారా దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. తద్వారా నగర ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో గత మూడు సంవత్సరాలుగా చేపట్టిన ఎన్నో వినూత్న స్వచ్ఛ కార్యక్రమాలు భారత ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ స్వీకరించి దేశంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. నగరంలోని కాలనీలు, నివాస ప్రాంతాల్లో బిన్‌లెస్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు.





నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

● ఏడాదిలో ఎంతో సాధించాం ● ఎన్నో కంపెనీలు తీసుకొచ్చాం ● వార్షికోత్సవ సభలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎంతో బలంగా ఉందని, దేశం ఎంతో ప్రగతి సాధిస్తోందని గత ప్రభుత్వాలతో పోలిస్తే.. నిరుద్యోగం చాలా తగ్గిందని అగ్రదేశాధినేత డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అమెరికా అధ్యక్ష పదవి చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎంతో ఆనందంగా ఉందని, గతం కంటే ఎక్కువ అభివృద్ధి ఈ ఏడాదిలోనే జరిగిందని అన్నారు. వైట్‌హౌస్‌లోని రోస్ గార్డెన్ నుండి ఆయన లైవ్‌లో మాట్లాడారు. జూన్ 20 నాటికి 71 ఏళ్ల ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టి ఏడాది పూర్తయింది.

45వ అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. తాను అధికారంలోకి వచ్చాక స్టాక్ మార్కెట్ పరుగులు పెట్టిందని, ఎన్నో కంపెనీలు అమెరికాలో పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చాయని చెప్పుకొచ్చారు. అదేవిధంగా నిరుద్యోగం అనేది అమెరికా చరిత్రలో గత 17 ఏళ్లతో పోలిస్తే చాలా తగ్గిందని అన్నారు. మహిళలకు కూడా చేయూత ఇవ్వడంతో పాటు ఎన్నో రకాల అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టామని, 18 ఏళ్లలో చేయని అభివృద్ధి కేవలం ఏడాదిలో చేసి చూపించామని చెప్పారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించడంతో ఎంతో గర్వంగా ఉందన్నారు. వైద్యులు, నర్సులు, ఇతర వైద్య నిపుణుల స్వేచ్ఛను కాపాడటానికి గాను నూతన ప్రతిపాదనలు సైతం జారీ చేశామని తెలిపారు. నేషనల్ మాల్‌లో నిర్వహించిన వార్షికోత్సవ సభలో వేలాది మంది మద్దతుదారులు వచ్చారు. దీనికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎన్నో అభ్యంతరకరమైన పాలసీలు గత పాలకులు తీసుకొచ్చారని, వాటిని పక్కనపెట్టి ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సంస్కరణలు చేపట్టామని చెప్పుకొచ్చారు. భవిష్యత్ కాలంలో అమెరికన్లకు మరింత సంతోషదాయకమైన జీవితం ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

అనంతరం అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పీన్స్ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పాలన చేపట్టిన అనంతరం దేశం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి కూడా తిరగరాసిందని చెప్పుకొచ్చారు. పన్ను విషయంలో కూడా మధ్య తరగతితో పాటు వ్యాపారులకు కూడా ఎంతో లాభాలు తెచ్చేలా చట్ట రూపకల్పన చేసినట్టు వివరించారు.

ఏడాది పాలనపై వెల్లువెత్తిన నిరసనలు




అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి ఏడాది కావడంతో అతని మద్దతుదారులు సంబురాలు చేసుకుంటుంటే మరోవైపు పాలనపై కొందరు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళలు ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా కదం తొక్కారు. ఈ నిరసన ర్యాలీలు యూరప్, ఆసియా, ఆఫ్రికా, రిచ్‌మాండ్, వర్జీనియా, న్యూయార్క్, ఆస్టిన్, టెక్సాస్, మియామీ, మెల్‌బోర్న్, మునిచ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా కొనసాగాయి. కేవలం న్యూయార్క్‌లో చేపట్టిన నిరసన ర్యాలీలో సుమారు లక్ష మంది పాల్గొనట్టు తెలుస్తున్నది. అదేవిధంగా లాస్‌వేగాస్‌లో క ూడా నిరసన మంటలు అంటుకున్నాయి. పలు దేశాలతో కలిపి సుమారు 3లక్షల మంది నిరసనకారులు ప్లకార్డులు చేతపట్టుకుని ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2017లో ట్రంప్ విజయం సాధించిన సమయంలో ఇదే రీతిలో మహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అదేవిధంగా 2018లో ఇదే అతిపెద్ద నిరసనగా పలువురు రాజకీయ నిపుణులు చెప్పుకుంటున్నారు. అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పలువురు నిరసన కారులు వీధుల్లో వచ్చి ట్రంప్ పాలన, పథకాలపై ఉన్న ఆగ్రహాన్ని చూపించారు. ఈ నిరసన వారం రోజుల పాటు అమెరికా వ్యాప్తంగా 250 పట్టణాల్లో కొనసాగించడానికి నిర్ణయించుకున్నట్టు ప్రతిపక్ష పార్టీలు చెబుతున్నాయి. ట్రంప్‌ను ఓ మానసిక రోగిగా అభివర్ణిస్తూ గతేడాది నిరసన చేపట్టగా, ఈఏడాది అదే తరహాలో నిరసన చేపట్టారు. సరిగా ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసే ఒక రోజు ముందు నిరసన వెల్లువెత్తగా, ఈయేడు ఒక రోజు తరువాత తమ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుజరాత్‌లో 'పద్మావత్'పై అల్లర్లు షురూ

● అహ్మదాబాద్‌లోని రాజ్‌హంస్ సినిమాస్ కాంప్లెక్స్‌పై దాడి

● 25న దేశవ్యాప్త బంద్ః కర్ణిసేన పిలుపు

అహ్మదాబాద్: రాజ్‌పుత్ కర్ణిసేన గుజరాత్‌లో పద్మావత్ చిత్రం ప్రదర్శితం కాబోయే ఓ థియేటర్‌ను ధ్వంసం చేసేసింది. శనివారం అర్ధరాత్రి అహ్మదాబాద్‌లోని రాజ్‌హంస్ సినిమాస్ కాంప్లెక్స్‌పై దాడిచేసి విధ్వంసం సృష్టించారు. కర్ణిసేనలో కొందరు కార్యకర్తలు థియేటర్ కాంప్లెక్స్‌లోకి దూసుకొచ్చి అద్దాలు ధ్వంసం చేయటంతోపాటు బయట ఉన్న కొన్ని వాహనాలకు నిప్పు పెట్టారు. అడ్డువచ్చిన సిబ్బందిని కూడా వారు చితకబాదారు. ఈ ఘటనపై థియేటర్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా జంకుతున్నారు. అయితే, సినిమా చూసేందుకు వచ్చే ప్రేక్షకుల మీద కూడా దాడులు చేస్తామని కొన్ని థియేటర్ల ముందు హెచ్చరిక బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇదిలా వుండగా, 'పద్మావత్' చిత్రాన్ని ప్రదర్శించేందుకు గుజరాత్‌లోని మల్టీప్లెక్స్ థియేటర్ యజమానులు వెనుకాడుతున్నారు. సినిమాను ప్రదర్శిస్తే కర్ణిసేన మా థియేటర్లు తగులబెడతారని, ఆ నష్టాన్ని మేము భరించలేమని ఇప్పటికే సినిమాను ప్రదర్శించకూడదని నిర్ణయించుకున్నట్లు థియేటర్ యజమానులు చెబుతున్నారు.



పాక్ కాల్పుల్లో జవాన్ మృతి

కాశ్మీర్: పాకిస్థాన్ ఆదివారం రాత్రి జరిపిన కాల్పుల్లో సైనికుడు ఒకరు మృతిచెందారు.. పూంచ్ జిల్లాలో పాకిస్థాన్ జరిపిన ఫైరింగ్‌లో ఆదివారం రాత్రి ఒక సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. అనంతరం గాయపడిన సైనికుడిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ జవాన్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పాకిస్థాన్ నియంత్రణరేఖ వెంబడి, జమ్ము, కతువాలోని ఐదు జిల్లాల్లో, అంతర్జాతీయ సరిహద్దు సాంబ, పూంచ్ , రాజౌరి తదితర ప్రాంతాల్లో జరిపిన ఫైరింగ్‌లో గురువారంనాటికి 11మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. చనిపోయినవారిలో ఆరుగురు సాధారణ పౌరులు, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన ఇద్దరు, ముగ్గురు సైనికులు ఉన్నారన్నారు. మొత్తం 11మంది పాక్ దాష్టీకానికి ప్రాణాలు కోల్పోయారన్నారు. బీఎస్ఎఫ్ జవాన్‌తోపాటు, టీనేజ్ గర్ల్‌కూడా ప్రాణాలు కోల్పోయిందన్నారు.

కాబూల్‌లో ఉగ్రదాడి: 18మంది మృతి

● కాంటినెంటల్ హోటల్‌పై మెరుపు దాడి ● హోటల్ గదులకు నిప్పు ● విదేశీ అతిథులే లక్ష్యంగా కాల్పులు ● మృతుల్లో 14మంది విదేశీయులు ● అఫ్గాన్ బలగాల దాడిలో ఇద్దరు ముష్కరుల మృతి

కాబూల్: అఫ్గాన్ రాజధాని కాబూల్‌లో ఇంటర్ కాంటినెంటల్ హోటల్లో ఉగ్రవాదులు మారణకాండ సృష్టించారు. శనివారం ఉగ్రవాదుల చేసిన దాడిలో 14మంది విదేశీయులతో సహా మొత్తం 18మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కాల్పుల్లో పద్దెనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో నలుగురు అఫ్గాన్‌వాసులు, పద్నాలుగు మంది విదేశీయులు ఉన్నారని అఫ్గాన్



అంతర్గత మంత్రిత్వ ప్రతినిధి తెలిపారు. శనివారం రాత్రి భవనంలోకి ప్రవేశించిన నలుగురు దుండగులు హోటల్లోని అతిథులను బందీలుగా చేసుకుని విచక్షణారహితంగా ఫైరింగ్ చేశారని, హోటల్ గదులకు నిప్పు పెట్టడంతో దట్టమైన నల్లటి పొగలు ఆప్రాంతమంతా కమ్ముకున్నాయన్నారు.

హోటల్‌లోని అతిథులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారన్నారు. ఈ ఘటనలో 18మంది మరణించారని అఫ్గాన్ అధికారులు తెలిపారు. అఫ్గాన్ బలగాలు ఉగ్రవాదులతో పోరాడుతున్నారని అంతర్గత మంత్రిత్వశాఖ ప్రతినిధి నర్సత్ రహిమి తెలిపారు. తమ బలగాలు ఇద్దరు దుండగులను హతమార్చినట్టు వెల్లడించారు. ఆదివారం జరిగే సమాచార సాంకేతిక సదస్సు కోసం విదేశీయులు ఈ హోటల్‌లో బస చేశారని ఆయన అన్నారు. వీరినే టార్గెట్ చేసుకుని ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారన్నారు. ఉగ్రదాడికి భయపడిన చాలామంది హోటల్ గదుల్లోనే ఉండిపోయారన్నారు. డిన్నర్ చేసేందుకు అతిథులు ఒకచోటకు చేరుకుంటుండగా ఉగ్రవాదులు దాడి చేశారన్నారు. ఉగ్రవాదులు కొందరిని బందీలుగా చేసుకున్నారని తెలిపారు. ఉగ్రవాదుల వద్ద చిన్న ఆటోమెటిక్ తుపాకులు, గ్రెనెడ్స్ ఉన్నాయని రహిమి తెలిపారు. ఈ దాడిలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామన్నారు. ఉగ్రవాదుల నుంచి 150మందిని రక్షించామని, వారిలో అధికమంది విదేశీయులు ఉన్నారని ఆయన తెలిపారు. 2011 జూన్‌లో క ూడా ఆత్మాహుతి దళాలు ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై దాడి చేశాయి. ఆ దాడిలో సుమారు 21మంది ప్రాణాలు కోల్పోయారు. తాజా దాడిపై అమెరికా ఎంబసీ ముందుగానే హెచ్చరించిందని సంబంధిత అధికారులు తెలిపారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఎవరనేది ఇంకా వివరాలు తెలియలేదన్నారు. ఈ దాడికి బాధ్యతవహిస్తూ ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించలేదన్నారు.

దావోస్ సదస్సులో యోగా

ఢిల్లీ : ప్రపంచ ఆర్థిక వేదికపై తొలిసారిగా యోగాను ప్రదర్శించనున్నారు. సోమవారం నుండి స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా డబ్ల్యుఈఎఫ్ వార్షిక సదస్సు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ సమావేశాల్లో ప్రముఖ యోగా గురువు రాందేవ్ తరపు నుంచి ఇద్దరు ఆచార్యులు హాజరుకానున్నారు. రెండు సెషన్స్‌లో ప్రత్యేకంగా యోగాను ప్రదర్శించనున్నారు. ఈ యోగా సెషన్‌లో ప్రధాని మోడీ కూడా పాల్గొనే అవకాశం ఉన్నట్టు సమాచారం. భారత్ నుండి సుమారు 130 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. దాదాపు మూడువేల మంది వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, కళాకారులు, విద్యావేత్తలు, సామాజిక వేత్తలు పాల్గొననున్నారు. మోడీ వెంట పలువురు కేంద్ర మంత్రులు సైతం ఉంటారు. డబ్ల్యుఈఎఫ్ ఛైర్మన్ క్లాస్ స్చ్వాబ్ సమ్మిట్ విషయాలను వివరించారు. ముక్కలైన ప్రపంచంలోనే భాగస్వామ్య భవిష్యత్తు సృష్టించాలి అనే నినాదంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళా నేతల భాగస్వామ్యమూ అధిక స్థాయిలో ఉండనుందని ఆయన చెప్పుకొచ్చారు.

రవాణా, విద్యుత్తే అజెండా


● దావోస్ వేదికగా ప్రసంగిచనున్న రైల్వే మంత్రి పీయూష్



న్యూఢిల్లీ : దావోస్‌లో ప్రారంభం కానున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు ప్రధాని నరేంద్ర మోడీ వెంట రైల్వే, బొగ్గు గనుల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. భారత్‌లో పెట్టుబడులే ఎజెండాగా పీయూష్ గోయల్ సదస్సులో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ కంపెనీలైన పిలిప్స్, హిటాచీ, హెవ్‌లెట్ ప్యాకర్డ్, వోక్స్‌వ్యాగన్, సీమెన్స్ ప్రతినిధులతో పీయూష్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ట్రాన్స్‌పోర్టుతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు. రైల్వే శాఖలో కూడా అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడిపెట్టేలా చేసేందుకు కసరత్తు చేశారు. జాతీయ రవాణా వ్యవస్థలో అత్యధిక పెట్టుబడులు ఎవరు పెట్టారో వారితో పీయూష్ భేటీ అవుతారు. ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి రేచల్ కైట్‌తో కలిసి పీయూష్ గోయల్ వేదిక పంచుకోనున్నారు. గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా పని చేసిన పీయూష్ గోయల్ రైల్వేలో విద్యుత్ సంస్కరణల గురించి వివరిస్తారు. అదేవిధంగా 2025 నాటికి 25శాతం విద్యుత్ స్వయంగా ఉత్పత్తి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌లో ప్రత్యామ్నాయంగా ఇంధన ఉత్పత్తి విషయమై మాట్లాడనున్నారు. ఇందులో స్మార్ట్ సిటీస్‌ల భాగస్వామ్యంతో లక్ష్యాన్ని ఛేదించే విధంగా డిజిటల్, మోబిలిటీ, మౌలిక పరిశ్రమల యజమానులతో చర్చించే విషయమై ప్రస్తావిస్తారు. రవాణా వ్యవస్థ మెరుగుపడితే దేశం, రాష్ట్రం, పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుంది..? అనే అంశంపై దావోస్ వేదికగా పలు సూచనలు ఇవ్వనున్నారు. అనంతరం ప్రయివేటు సెక్టార్ కంపెనీ ప్రతినిధులతో పీయూష్ వర్క్‌షాపు నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. బస్సులు, సముద్రం, ఓడలు, వాయు మార్గాలు, రైలు మార్గాల ద్వారా జరిపే వ్యాపారంపై చర్చించనున్నారు. రవాణా అనేది వేగం, భద్రతా వ్యవస్థను దృష్టిలో పెట్టుకుని జరిపించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జేబీఐసీ) చీఫ్ ఎగ్జిక్యూటీవ్ తడాషీ మయిడా, బీజింగ్‌లోని ఏషియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్ అధ్యక్షుడు జిన్ లిక్విన్‌తో కూడా రైల్వే మంత్రి పీయూష్ గోయల్ భేటీ అవుతారని అధికార వర్గాలు తెలిపాయి.

నూతన సీఈసీగా ఓపీ రావత్

23న బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీః నూతన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా ఓంప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. ఈనెల 23న రావత్ సీఈసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ అచల్ కుమార్ జోతి పదవి కాలం ఈనెల 23తో ముగుస్తుండటంతో కొత్త సీఈసీగా ఓపీ రావత్ ను నియమిస్తున్నట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సిఫార్సులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదిస్తూ 22న ప్రధాన ఎన్నికల కమిషనర్ గా రావత్ ను నియమించారు. 1977 బ్యాచ్ ఏఐఎస్ అధికారి అయిన ఓపీ రావత్ మధ్యప్రదేశ్ కేడర్ అధికారిగా సేవలిందించారు. ఆగస్టు 14,2015 నుంచి ఆయన కేంద్ర ఎన్నికల కమిషన్ లో ఎన్నికల కమిషనర్ గా కొనసాగుతున్నారు. 1993 లో కేంద్ర సర్వీసులకు వెళ్లిన రావత్. రక్షణశాఖడైరెక్టర్ , జాయింట్ కార్యదర్శిగా సేవలందించారు. తన పదవికాలంలోనే దక్షిణాఫ్రికా కు డిప్యుటేషన్ పై వెళ్లారు. 1994లో సౌతాఫ్రికాలో జరిగన వర్ణవివక్ష కారణంగా వచ్చిన ఎన్నికల సమయంలో రావత్ అక్కడ పనిచేశారు. 2004-2006 మధ్య అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి బాబులాల్ గౌర్ కు ప్రిన్స్‌పల్ సెక్రటరీగా రావత్ పనిచేశారు. అడవుల హక్కులకు సంబంధించి ఆయన తీసుకున్న చొరవకు గాను పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నుంచి 2010లో ప్రైమ్ మినిస్టర్ అవార్డు అందుకున్నారు.

కొత్త ఈసీ అశోక్ లావా

తన పదవి కాలంలో దరావత్ సీఈసీగా నియమకవడంతో రావత్ స్థానంలో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసాను ఎన్నికల కమిషనర్ గా నియమించారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఉంటారు. ప్రస్తుతం మరో ఎన్నికల కమిషనర్ గా సునిల్ అరోరా కొనసాగుతున్నారు.

కేంద్రం వేధిస్తోంది



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లాభదాయక హోదాలు అనుభవిస్తున్న 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేయడం వెనక కేంద్ర ప్రభుత్వ హస్తముందని ఆరోపించారు. కేంద్రం తమను వేధిస్తోందని బీజేపీపై పరోక్ష విమర్శలు గుప్పించారు. ''ఎవరైనా న్యాయం వైపు నడిస్తే ఆ వ్యకి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొకతప్పదు. మేం ప్రభుత్వానికి చెందిన ప్రతీ పైసాను ఆదా చేస్తున్నాం. కానీ మేం వెళ్తున్న దారిలో ఎన్నో సమస్యలు వస్తున్నాయి. వాళ్లు మమ్మల్ని అన్నిరకాలుగా వేధించేందుకు ప్రయత్నిస్తున్నారు. మాపై, మా ఎమ్మెల్యేలపై తప్పుడు కేసులు బనాయించారు. నా ఆఫీస్ పై సీబీఐ దాడులు చేయించారు. 24 గంటల పాటు సీబీఐ దాడులు చేస్తే నా 4 మఫ్లర్లు మాత్రమే దొరికాయి. మా ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయించారు. ఢిల్లీ లెఫ్ట్ నెంట్ గవర్నర్ ప్రభుత్వానికి సంబంధించిన 400 ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించారు. కానీ గతరెండేళ్లలో ఒక్క తప్పుకూడా దొరకలేదు. వాళ్లకెందుకూ తప్పులు దొరకపోవడంతోనే ఇప్పుడు మా పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

జైపూర్: రాజస్థాన్‌లోని బన్స్వారా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో 13మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఖమెరా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జవహర్‌లాల్ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. పిపాల్‌కూంట్ నుంచి ఖెర్వాకు వెళుతున్న టెంపో వంతెనపైనుంచి పయనిస్తుండగా అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోవటంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. వేగంగా వెళుతున్న టెంపోను వాహన డ్రైవరు నియంత్రణ కోల్పోయి అదుపు చేయలేకపోవడంతో దాదాపు 15అడుగుల ఎత్తునుంచి టెంపో కిందకు పడిపోయిందన్నారు. డ్రైవరు శంకర్ సర్కుట(48) సంఘటన ప్రాంతంలోనే మృతి చెందగా, సోనా దిన్డోర్ అనే 20ఏళ్ల యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిందన్నారు. ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. ప్రమాదంలో గాయపడినవారిని ఆసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్స అందిస్తున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆప్‌కు షాక్

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ నేడు విచారణకు రానుంది. మరోవైపు తాజాగా రాష్ట్రపతి నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచనలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేతలు ఉన్నారని తెలుస్తోంది. 20 మంది ఎమ్మెల్యేల పదవులు ఊడగొట్టిన లాభదాయక పదవుల కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే, 2015 మార్చి నెలలో కేజ్రీవాల్ సర్కారు 21 మంది ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియ మించింది. అయితే చట్ట సభల సభ్యులు ఏ ఇతర లాభదాయక పదవులను చేపట్టకూ డదని చట్టం చెబుతోంది. చట్టంలో నిర్దేశించిన పదవులు తప్ప మరే ఇతర పదవులు చేపట్టకుండా నిరోధిస్తోంది. అయితే వీటిని పట్టించుకోకుండా కేజ్రీవాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని కొన్ని ఎన్జీవోలు న్యాయస్థానాల్లో సవాల్ చేశాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ విచారణ జరిపింది. ఇదే సమయంలో కేజ్రీవాల్ సర్కారు తమ ఎమ్మెల్యేలపై వేటు పడకుండా ఒక చట్టాన్ని అప్పటికప్పుడు తయారు చేసింది. పార్లమెంటరీ కార్యదర్శుల పదవులను లాభదాయక పదవుల జాబితా నుంచి మినహాయిస్తూ పాత తేదీలో చేసిన ఈ చట్టాన్ని నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదించకుండా తిప్పిపంపించారు. ఇక్కడ ఆప్ సర్కారుకు తొలి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో పార్లమెంటరీ కార్యదర్శులుగా పదవులు ఇచ్చినప్పటికీ అదనంగా తాము ఎటువంటి జీతభత్యాలు చెల్లించలేదని ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల కమిషన్ ముందు వాదనలు వినిపించింది. తద్వారా ఆ పదవులు సభ్యులకు లాభదాయకం కాదని చెప్పుకొచ్చింది. అయితే అదనంగా జీతభత్యాలు తీసుకోనప్పటికీ, ప్రభుత్వం కల్పించిన బంగ్లా, కారు వంటి ఇతర సదుపాయాల ద్వారా కేబినెట్ ర్యాంకు సదుపాయాలు పొందుతున్నారని, తద్వారా లాభదాయక పదవుల నిర్వచనం పరిధిలోకే ఈ చర్య వస్తుందని ఎన్నికల కమిషన్ అభిప్రాయపడింది. గత ఏడాది రాజీనామా చేసిన జర్నయిల్ సింగ్‌ను మినహాయించి, మిగతా 20 మందిని అనర్హులుగా పేర్కొంటూ రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. తాజాగా ఆదివారం రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో అనర్హత వేటుకు అధికారిక ముద్ర పడింది. ఈ నిర్ణయంపై ఆప్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు.

కేజ్రీ సర్కారుకు ఢోకా లేదు

రాష్ట్రపతి ఆమోదముద్ర కారణంగా 20 మంది ఆప్ ఎమ్మెల్యేలు పదవులు కోల్పోయినప్పటికీ ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపే కేజ్రీ సర్కారు ఎలాంటి ఢోకా లేదు. ఎందుకంటే మొత్తం 70 మంది సభ్యులున్న ఢిల్లీలో అసెంబ్లీలో కేజ్రీవాల్ నేతృత్వంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఏకంగా 66 సీట్లు గెలుచుకుంది. నిజానికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 35 మంది సభ్యుల కంటే ఒక్కరు ఎక్కువగా ఉన్నా సరిపోతుంది. అయితే ఇప్పుడు 20 ఖాళీలు ఏర్పడిన, ప్రభుత్వాన్ని నడపడానికి సరిపడే 36 మంది సభ్యుల కంటే మరో 10 మంది అదనంగానే ఉన్నారు.

శత్రువుల ఏరివేతకు సరిహద్దులు అడ్డుకావు

● పాకిస్తాన్‌కు హోంమంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక ● విదేశీ భూభాగంలోకి చొచ్చుకెళ్లేందుకు సిద్ధమని వ్యాఖ్య ● జమ్మును స్నేహ వారధిగా మార్చాలని భారత్- పాక్‌కు ముఫ్తీ అభ్యర్థన

లక్నోః శత్రువుల ఏరివేతలో భారత సరిహద్దును దాటేందుకైనా వెనకాడబోమని కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. శత్రువులను నిలువరించేందుకు భారత భూభాగంలోనే కాదు.. విదేశీ భూభాగంలోకి చొచ్చుకుపోయేందుకైనా భారత్ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. గత నెల పాక్ దాడులకు ప్రతీకారంగా దాయది దేశం భూభాగంలోకి భారత జవాన్లు చొచ్చుకుపోయి పాక్ రేంజర్లను హతమార్చడంతో ఈ విషయం తేటతెల్లమైందని గుర్తు చేశారు. జమ్ము కాశ్మీర్ రాజౌరి జిల్లాల్లోని కేరీ సెక్టర్ లో నలుగురు భారత జవాన్లను పాక్ బోర్డర్ యాక్షన్ టీం హతమార్చినందుకు ప్రతీకారంగా భారత ఆర్మీ కమాండర్లు జమ్ములోని పూంచ్ సెక్టర్ మీదుగా సరిహద్దును దాటి ముగ్గురు పాకిస్తాన్ సైనికులను హతమార్చడంతో పాటు ఓ బోర్డర్ పోస్ట్ ను ధ్వంసం చేసిన నెలరోజుల తర్వాత రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధ్యాన్యత సంతరించుకుంది. కొన్ని నెలల క్రితం 17 మంది భారత జవాన్లపై కాల్పులు జరిపి పాకిస్తాన్ పిరికిచర్యలకు దిగిన సందర్భంగా ప్రధాని మోడీ స్పందిస్తూ.. ఇది చాలా తీవ్రమైన అంశంగా ప్రస్తావించారని రాజ్ నాథ్ చెప్పుకొచ్చారు. పాక్ దుశ్చర్యకు ప్రతీకారంగా భారత జవాన్లు సరిహద్దుల్లోని మిలిటెంట్లను హతమార్చారని లక్నోలో జరిగిన ఓ బహిరంగ సభలో వెల్లడించారు. ప్రపంచ దేశాలు భారత్ బలమైన దేశంగా గుర్తించిన ఈ తరుణంలో శత్రువులను నిలువరించడంలో భారత్ లోనే కాదు.. విదేశీ గడ్డపైకూడా పోరాటం చేస్తామన్న సందేశాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేయాల్సిన



అవసరముందని రాజ్ నాథ్ స్పష్టం చేశారు. పాకిస్తాన్ తో భారత్ స్నేహ బంధాన్ని కోరుకుంటుంటే..దాయాది దేశం మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోందని రాజ్‌నాథ్ చెప్పుకొచ్చారు.

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారత్ ఆర్థికంగా దూసుకుపోతోందని గుర్తుచేశారు. ప్రపంచంలోని ఆర్థికవేత్తలు, నిపుణులు ఈ విషయాన్ని ఆమోదించారని స్పష్టంచేశారు.

జమ్ముకాశ్మీర్‌ను భారత్- పాక్ మధ్య స్నేహ వారధిగా మార్చండిః ముఫ్తీ

జమ్ము కాశ్మీర్‌ను భారత్- పాకిస్తాన్ దేశాల మధ్య స్నేహ వారధిగా మార్చాలని జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి రెండు దేశాలను అభ్యర్థించారు. జమ్ము కాశ్మీర్ రెండుదేశాల మధ్య స్నేహ వారధిగానే ఉండాలి తప్ప యుద్ధ క్షేత్రంగా మారకూడదని ఆమె పేర్కొన్నారు. మన సరిహద్దులు దేవుడి ఇళ్లలో రక్తపుటేరులు పారడానికి సాక్షంగా నిలుస్తున్నాయి. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి అంశాలపై పాకిస్తాన్ తో చర్చలు జరిపేందుకు స్నేహ హస్తం ఇస్తుంటే.. పాకిస్తాన్ లో మాత్రం అందుకు విరుద్ధంగా జరగుతోంది. మన పాఠశాలు మూతబడ్డాయి. పిల్ల ఇళ్లకే పరిమితమౌతున్నారు.. పాకిస్తాన్ ప్రధానికి నేను చేసే అభ్యర్థన ఒక్కటే.. జమ్ము కాశ్మీర్‌ను భారత్- పాక్ మధ్య వారధిలా తయారుచేయండని.. రెండు దేశాల మధ్య స్నేహబంధం పెంపొందించుకుని..జమ్ము కాశ్మీర్‌ను యుద్ధభూమిగా కాకుండా స్నేహ వారధిగా మార్చండి అని విజ్ఞప్తి చేశారు. శ్రీనగర్ లో కొత్త పోలీస్ కానిస్టేబుల్ పాసింగ్ అవుట్ పటేల్ కార్యక్రమంలో ప్రసంగించిన ముఫ్తీ.. సరిహద్దుల్లో కాల్పుల కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మంచి కథ విన్నప్పుడు ఉద్వేగానికి గురవుతానని చెబుతున్నారు కథానాయకుడు చియాన్ విక్రమ్. ఈ విలక్షణ నటుడు ప్రతిసారీ కొత్తగా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటారు. భిన్నంగా లేని పాత్రలు చేయను అని చెప్పే విక్రమ్...తన నట ప్రయాణంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. కమల్ హాసన్ తర్వాత నటుడిగా అంతటి పేరు తెచ్చుకున్నారు. విక్రమ్ నటించిన ప్రతి తమిళ చిత్రం తెలుగులోకి అనువాదమవుతుంటుంది. అలా తాజాగా తెలుగు తెరపైకి వస్తున్న సినిమానే స్కెచ్. తమన్నా నాయికగా నటించింది. దర్శకుడు విజయ్ చందర్ రూపొందించిన స్కెచ్ చిత్రం గురించి విక్రమ్ చెప్పిన విశేషాలు...

స్కెచ్ వేసింది హిట్ కోసమే



- చియాన్ విక్రమ్

- ఏదైనా ఆలోచన చేసి ప్రణాళిక వేస్తుంటాం. దాన్నే స్కెచ్ అని పిలుస్తాం. అయితే ఇందులో స్కెచ్ ఎందుకు వేశామన్నది ప్రస్తుతానికి గోప్యమే. అది చెబితే చిత్ర ముగింపులో ఆసక్తి ఉండదు. బ్యాంకుల్లో అప్పులు తీసుకుని చెల్లించిన వారి నుంచి తిరిగి డబ్బులు వసూలు చేయడమే చిత్రంలో నా పాత్ర పని. నాతో ఓ బృందం పనిచేస్తుంటుంది. ఈ సందర్భంలో ఓ పెద్ద వ్యక్తితో గొడవ పడతాను. అప్పుడు కథ మరో మలుపు తీసుకుంటుంది. పూర్తి స్థాయి మాస్ ఎంటర్‌టైనర్. గతంలో నేను ధూల్, సామి, జెమినీ లాంటి వాణిజ్య విలువలున్న చిత్రాల్లో నటించాను. తర్వాత పూర్తిగా భిన్నమైన ప్రయోగాలు చేశాను. మళ్లీ ఇన్నాళ్లకు నాతో వినోదాత్మక చిత్రాన్ని చేయించారు దర్శకులు విజయ్ చందర్.

- మాస్ డైలాగులు, పంచ్‌లతో సినిమా సాగుతుంది. సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. కథలో మలుపులు ఉంటాయి. ముఖ్యంగా చిత్ర పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కథను నాకు చెప్పేందుకు దర్శకుడు నెలల పాటు వేచి చూశారు. అప్పుడు తీరిక లేక వినలేదు. కానీ ఒక్కసారి కథ విన్నాక...చాలా బాగుందని అనిపించింది. తమన్నా కూడా బాహుబలి తర్వాత అంతమంచి కథ చేస్తున్నానని చెప్పింది.

- తమిళనాట సినిమా ఇప్పటికే విడుదలైంది. అక్కడ బీసీ సెంటర్‌లతో పాటు అన్ని చోట్లా మంచి స్పందన వస్తోంది. ఓవర్‌సీస్‌లో కూడా ఆదరణ బాగుంది. నా గత చిత్రాలు అపరిచితుడు, మనోహరుడు, ఇంకొక్కడు దక్షిణాది భాషల్లో బాగా పేరు తెచ్చుకున్నాయి. స్కెచ్‌కు కూడా అలాంటి స్పందన దక్కుతుందని ఆశిస్తున్నాను. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు బాగా నచ్చే సినిమా అవుతుంది. ఇక్కడి వాళ్లకు నచ్చే అంశాలు స్కెచ్ కథలో ఉన్నాయి.

- నేను బాగా రఫ్‌గా కనిపిస్తాను. తమన్నా అమ్ము అనే పాత్రలో నటించింది. ఆమె నాకు భిన్నమైన పాత్ర. చక్కగా మన సంప్రదాయానికి తగినట్లు ఉంటుంది. మా ఇద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలు బాగా వచ్చాయి.

- గతంలో చేసిన చిత్రాలు భిన్నంగా స్కెచ్ చేశాను. నాన్న, శివ పుత్రుడు లాంటి సినిమాల్లో నా నటనకు ప్రశంసలు దక్కాయి. అయితే ఈ సినిమా చూసిన వాళ్లు కూడా నా నటనను మెచ్చుకుంటున్నారు. బాగా నటించావని అంటున్నారు. భిన్నమైన చిత్రాలు, ఇలాంటి మాస్ ఎంటర్‌టైనర్స్ రెండూ నాకు ఇష్టమే. మంచి కథ విన్నప్పుడు ఉద్వేగానికి గురవుతాను.

- ప్రాంతీయ సినిమాలకు వ్యాపారానికి విస్తృతి పెరిగిపోయింది. ప్రస్తుతం ఓ తమిళ సినిమా, తెలుగు సినిమా ఆయా భాషలకే పరిమితం కాదు. దేశ వ్యాప్తంగా విడుదలవుతున్నాయి. గతంలో అపరిచితుడు, రోబో సినిమాలు దీన్ని నిరూపించాయి. తాజాగా బాహుబలి వ్యాపార హద్దులను మరింత పెంచింది. దక్షిణాది చిత్రాలు చేసే వారిలో ఆత్మవిశ్వాసం నింపింది.

- మా అబ్బాయి అర్జున్ రెడ్డి తమిళ పునర్నిమాన చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమా హక్కులు తీసుకున్న నిర్మాత నా దగ్గరకు వచ్చి అడిగారు. అప్పటికి వాడింకా అమెరికాలో మెథడ్ యాక్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. మరో మూడేళ్ల తర్వాత అతన్ని పరిచయం చేద్దామనుకున్నా...అయితే మంచి కథ, నిర్మాతలు బాగా చేస్తామని హామీ ఇవ్వడంతో సరే అన్నాను. నేను వయసు గురించి పట్టించుకోను. మా అబ్బాయికి కుదరకుంటే నేనే అర్జున్ రెడ్డిలో నటిస్తాను.

- నాకు పంచె కట్టుకోవడం రాదు. కాబట్టి రాజకీయాలు కూడా తెలియవనే అనుకోవాలి. నాకు సిగ్గెక్కువ. కెమెరా ముందు మాత్రం ఎలా కావాలంటే అలా నటిస్తాను. బోనులో సింహాన్ని కొట్టమన్నా కొడతాను. నటనకు వచ్చేసరికి కేవలం ఆ పాత్రలా మారిపోతాను.

- గౌతమ్ మీనన్‌తో ధృవనక్షత్రం, సామి స్క్వేర్ అనే చిత్రాల్లో నటిస్తున్నాను. వీటితో పాటు కమల్ హాసన్ నిర్మాణంలో ఓ చిత్రాన్ని చేస్తున్నాను. మహావీర కర్ణ చిత్రంలో కర్ణుడి పాత్రను పోషించబోతున్నాను. ఈ సినిమా దాదాపు 300 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మితం కాబోతోంది.



వేడుకలో పాల్గొన్న అనుష్క

అనుష్క కథానాయికగా అశోక్.జి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మించిన భాగమతి చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో అనుష్క, ఇతర చిత్రబృందంతో పాటు అల్లు అరవింద్, మారుతి, నాని తదితరులు పాల్గొన్నారు.

63వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానం



ఇర్ఫాన్‌ఖాన్



విద్యాబాలన్



అశ్విని అయ్యర్ తివారి

63వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానం ముంబాయిలోని వర్లీలో కన్నుల పండువగా జరిగింది. గతేడాది విడుదలైన బాలీవుడ్ చిత్రాలను ఈ అవార్డుల కోసం ఎంపికచేశారు. ప్రముఖ కథానాయకుడు షారుక్‌ఖాన్, దర్శక, నిర్మాత కరణ్‌జోహార్‌లు వ్యాఖ్యానంతో ఆహ్లాదభరితంగా కార్యక్రమం సాగింది.

ఉత్తమ చిత్రం అవార్డు హిందీ మీడియంకు లభించగా, ఆ చిత్రంలో అభినయానికి ఇర్ఫాన్‌ఖాన్‌కు ఉత్తమ నటుడి అవార్డును దక్కించుకున్నారు. తుమారీ సూలూ చిత్రంలో రేడియో జాకీగా ఆకట్టుకున్న విద్యాబాలన్‌కు ఉత్తమ నటి అవార్డు సొంతమైంది. బరేలీ కి బర్ఫీ చిత్రానికి అశ్విని అయ్యర్ తివారీకి ఉత్తమ దర్శకురాలి అవార్డు లభించింది. ఇక మిగతా అవార్డుల విషయానికి వస్తే...విమర్శకుల ప్రశంస పొందిన ఉత్తమ చిత్రంగా న్యూటన్, విమర్శకుల ప్రశంస పొందిన ఉత్తమ నటుడిగా రాజ్‌కుమార్‌రావ్ (ట్రాప్డ్), విమర్శకుల ప్రశంస పొందిన ఉత్తమ నటిగా జైరా వాసిమ్ (సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ నూతన దర్శకుడిగా కొంకణా సేన్‌శర్మ (ఎ డెత్ ఇన్ ది గంజ్), ఉత్తమ సహాయ నటుడిగా రాజ్‌కుమార్‌రావ్ (బరేలీకి బర్ఫీ), ఉత్తమ సహాయనటిగా మెహర్‌విజ్ (సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ మాటల రచయితగా హితేష్ కేవల్య (సుభ్ మంగళ్ సావధాన్), ఉత్తమ కథనం అవార్డును సుభాషిశ్ భుటియాని (ముక్తిభవన్), ఉత్తమ కథ అవార్డును అమిత్ మస్రూకర్ (న్యూటన్), ఉత్తమ గాయకుడిగా అర్జిత్‌సింగ్ (రొకే నా రుకే నైనా: బద్రినాథ్‌కి దుల్హనియా), ఉత్తమ గాయని అవార్డును మేఘనా మిశ్రా (నాచిది ఫిరే..సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ గీత రచయితగా అమితాబ్ భట్టాచార్య (ఉల్లుకా పట్టా...జగ్గా జాసూస్), ఉత్తమ నేపథ్యసంగీతం అవార్డును ప్రీతమ్ (జగ్గా జాసూస్), ఇక జీవిత సాఫల్య పురస్కారాలను మాలా సిన్హా, బప్పీలహరి అందుకున్నారు.

తీరిక లేదు మరి



సోనాక్షీ సిన్హా

బాలీవుడ్ బ్యూటీ సోనాక్షీ సిన్హాకు ఈ ఏడాది తీరిక దొరకడం కష్టమే. ఐదు వరుస సినిమాలతో ఆమె డైరీ నిండిపోయింది. వెల్‌కమ్ టు న్యూయార్క్, హ్యాపీ బాగ్ జాయేగీ, దబాంగ్ 3 లాంటి ఆసక్తికరమైన చిత్రాలతో పాటు మరో రెండు సినిమాలు ఆమె ఖాతాలో చేరాయి. ఈ చిత్రాలు కొత్త క్యాలెండర్ వచ్చే వరకు సోనాక్షీకి చేతి నిండా పని అందిస్తున్నాయి. ప్రతి పనిలో సంతోషాన్ని వెతుక్కోవాలి, సాధ్యమైనంత ఎదగాలి అని చెబుతుందీ భామ. నటిగా ఇప్పుడు పరిపక్వంగా ఆలోచిస్తున్నానని... కెరీర్ ప్రారంభంలో చేసిన మూస పాత్రలకు ఇప్పుడు బాధపడుతున్నట్లు చెప్పింది.

ఇటీవల సోనాక్షీ సిన్హా మాట్లాడుతూ....కొత్త కథల్లో నటించేందుకు ప్రయత్నిస్తున్నాను. గతంలోలా మూస పాత్రలు చేయడం లేదు. భిన్నమైన సినిమాలు చేయడం ఎప్పుడూ ప్రమాదమే. అయితే ఆ ధైర్యాన్ని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. నేనే కాదు చిత్ర పరిశ్రమ అంతా సాహసాలు చేస్తోంది. ఇలా ఆలోచనలు వచ్చినప్పటి నుంచి అఖిలా, ఫోర్స్ 2 లాంటి నటనకు అవకాశమున్న చిత్రాలు చేస్తూ వస్తున్నాను. అని చెప్పింది.

తొలి ప్రేమ గీతాలు



వరుణ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా నటిస్తున్న చిత్రం తొలి ప్రేమ. శ్రీ వెంకటేశ్వరా సినీ చిత్ర ఎల్ఎల్‌పీ పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తొలి ప్రేమ ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ఆడియో విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాతలు అల్లు అరవింద్, దిల్ రాజు అతిథులుగా హాజరై బిగ్ సీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా కథానాయకుడు వరుణ్ తేజ్ మాట్లాడుతూ...నా మనసుకు దగ్గరైన కథ ఇది. లోఫర్, ఫిదా కంటే ముందే విన్నాను. అయితే కొన్నాళ్లు వేచి చూడమని వెంకీకి చెప్పాను. తను వేచి చూసి నాతో సినిమా చేశారు. నా ఎత్తుకు సరిపోయే నాయికను వెతకటం కష్టమని అంతా అంటారు. రాశీ ఖన్నా నాకు జోడీగా బాగా సరిపోయింది. ఈ సినిమా చేస్తున్న క్రమంలో ఏ టైటిల్ పెడదామని ఆలోచించాము. తొలి ప్రేమ బాగుంటుందని దర్శకుడు వెంకీ అనగానే భయమేసింది. బాబాయ్ పవన్ కళ్యాణ్ నట ప్రయాణంలో గుర్తుండిపోయే సినిమా తొలి ప్రేమ. తేడా వస్తే ఇబ్బంది అనుకున్నాం. అయితే పేరుకు తగినట్లే సినిమా ఉంటుంది. మేమంతా చిత్రాన్ని చూశాం. బాగా వచ్చింది. రేపు ప్రేక్షకులను మెప్పిస్తుందనే నమ్మకం కలిగింది. అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ....నేను పరిశ్రమకు వచ్చిన తొలినాళ్లలో నన్ను నమ్మి, ప్రోత్సహించిన వ్యక్తి నిర్మాత దిల్‌రాజు. పరిశ్రమపై నాకు నమ్మకం కలిగించారు. నేను ఆత్మవిశ్వాసం కోల్పోతున్న సమయంలో నమ్మకాన్ని ఇచ్చారు వరుణ్ తేజ్. నిర్మాత బాపినీడు నమ్మి సినిమా చేసే అవకాశం ఇచ్చారు. మంచి సంగీతం కోసం థమన్‌ను, సాహిత్యం కోసం శ్రీమణిని ఇబ్బందిపెట్టాను. సాంకేతిక నిపుణులు, నటీనటులు దర్శకుడిగా నా కలను సాకారం చేశారు. అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ...నా హృదయానికి దగ్గరైన చిత్రమిది. తొలి ప్రేమ నేను గర్వపడే సినిమా అవుతుంది. వెంకీ అట్లూరి నా పాత్రను చక్కగా మలిచారు. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది. వరుణ్ అంకితభావం గల నటుడు. సినిమా కోసం ఎంతైనా కష్టపడతాడు. అని చెప్పింది. ఈ కార్యక్రమంలో ప్రియదర్శి, సీనియర్ నరేష్, సంగీత దర్శకుడు థమన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యమణి పాటలు విడుదల



మెహ మాయా ఎంటర్‌టైన్‌మెంట్స్, రెడ్‌నోడ్ మీడియా పతాకాలపై గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం దివ్యమణి. యోగా, మార్షల్ ఆర్ట్స్ అధ్యాపకుడు సురేష్‌కమల్ హీరోగా, వైశాలి, కిమయా హీరోయిన్లుగా నటిస్తున్నారు. గిరిధర్ గోపాల్, స్టీవ్‌శ్రీధర్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదలచేశారు. మధుర ఆడియో ద్వారా మార్కెట్ చేస్తున్న ఈ చిత్రం ఆడియోను ప్రముఖ నాట్యకళాకారులు యామినీ కృష్ణమూర్తి విడుదలచేశారు. ఈ సందర్భంగా కథానాయకుడు సురేష్‌కమల్ మాట్లాడుతూ, నటుడిగా ఇది నా తొలి చిత్రం. ప్రపంచమంతా యోగా నేర్పటం కోసం తిరిగినా నాకు తెలుగు నేలంటే చాలా ఇష్టం. గిరిధర్‌గారు మంచి కథ చెప్పారు. ఆయన మంచి ప్రతిభాశాలి. యాక్షన్ అంతా నేను ఒరిజనల్‌గా చేశాను. ఈ సినిమా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది. దర్శకుడు గిరిధర్ గోపాల్ మాట్లాడుతూ, మనిషి తనని తాను జాగృత పరచుకోవటానికి సృజనాత్మకత ఎంతో అవసరం. పాటలు బావున్నాయని అంటున్నారు. సినిమా అందరినీ అలరింపజేస్తుంది. ఈ సినిమా అనంతరం యామిని కృష్ణమూర్తిగారి బయోఫిక్‌ను భారీగా తీయబోతున్నాం అని అన్నారు. ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ మాట్లాడుతూ, సురేష్‌కమల్ రియల్ హీరో. మంచి పాపులార్టీ ఉన్న ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలోని ప్రతీ స్టంట్ వాస్తవికతతో ఉంటుంది అని అన్నారు. నటుడు సాయికుమార్ మాట్లాడుతూ, గిరిధర్‌గోపాల్ ఇందులో ఎన్నో అద్భుతాలను చూపించారు. ఈ సిని మాలో స్టంట్స్ చాలా హైలైట్‌గా ఉన్నాయి అని చెప్పారు. బలభద్రపాత్రుని రమణి మాట్లాడుతూ, ఈ సినిమాకు కథ, దర్శకత్వం, పాటలు, సంగీతం, సింగింగ్ ఇలా ఎన్నో విభాగాల్లో దర్శకుడు గిరిధర్ ప్రతిభను చూపారు. అతనికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. యామిని కృష్ణమూర్తి మాట్లాడుతూ, నా భాష, నా మనుషుల మధ్య జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందదాయకం. చిత్రబృందానికి విజయం లభించాలని ఆకాంక్షిస్తున్నా అని అన్నారు.

రొమాంటిక్‌గా మనసుకు నచ్చింది



అమైరాదస్తూర్, సందీప్‌కిషన్

సందీప్‌కిషన్, అమైరాదస్తూర్, త్రిదాచౌదరి నాయకానాయికలుగా మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతున్న చిత్రం మనసుకు నచ్చింది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి సెన్సార్ యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఫిబ్రవరి 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, ఇప్పటివరకు విడుదలైన పోస్టర్స్, ట్రైలర్, టీజర్‌కు విశేషమైన స్పందన లభించింది. కొత్తదనంతో కూడుకున్న రొమాంటిక్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా దీనిని మలిచాం. రాధన్ సంగీతం పెద్ద ఎస్సెట్‌గా నిలుస్తుంది. ప్రేక్షకులకు ఓ మంచి సినిమా చూశామనే భావనను కలిగిస్తుంది అని చెప్పారు.

ఇంకా ఈ చిత్రంలో ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ ఆదిత్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సినిమాటోగ్రఫీ: రవియాదవ్, సంగీతం: రాధన్, ఎడిటింగ్: సతీష్‌సూర్య, కళ: హరివర్మ, నిర్మాతలు: పి.కిరణ్, సంజయ్‌స్వరూప్, రచన, దర్శకత్వం: మంజుల ఘట్టమనేని.



భారత క్రికెట్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లి చెప్పిందే వేదం! అతని మాటే మంత్రం... నడిచిందే రాజమార్గం. కెప్టెన్‌గా టీమ్ఇండియా పగ్గాలు చేపట్టిన తర్వాత విరాట్‌కు ఎదురులేదు. జట్టును శాసించాడు. కెప్టెన్‌గా అతని ప్రతి మాటకు... ప్రతి చర్యకు, ప్రతి నిర్ణయానికి ఎనలేని విలువ. ఒక్క మాటలో చెప్పాలంటే జట్టులో విరాట్ తిరుగులేని శక్తి. దానికి తగ్గట్టు జట్టు కూడా గత రెండేళ్లలో అప్రతిహత విజయాలు సాధిస్తూ వచ్చింది. ఇటు టెస్టుల్లో... అటు వన్డేల్లో రికార్డు వరుస విజయాలు సాధించింది. వ్యక్తిగతంగానూ ఐసీసీ వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠం. టెస్టుల్లో రెండో స్థానం. జట్టు విజయాలు సాధిస్తున్నపుడు భారత మీడియా, విమర్శకులు కెప్టెన్‌ను ఆకాశానికి ఎత్తేస్తారు. ఇంతకాలం పొగడ్తలే విన్న కోహ్లికి... దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ కోల్పోగానే తొలిసారి విమర్శల శస్త్రాలు ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి. విజయాలు సాధించినపుడు ప్రశంసల్ని సగర్వంగా స్వీకరించిన విరాట్.. ఇపుడు విమర్శల్నీ అంగీకరించాల్సిందే! టెస్టు సిరీస్ చేజారినా... ఇంకా మరో మ్యాచ్ మిగిలే ఉంది. వాండరర్స్ టెస్టుకు కోహ్లి ఏం చేయబోతున్నాడన్నదే ఇపుడు జరుగుతున్న ఆసక్తికర చర్చ. ప్రతి టెస్టుకు కూర్పులో మార్పు చేసే విరాట్ ఇపుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాడన్నదే ఆసక్తిగొలుపుతున్న అంశం!

ఇపుడేం చేస్తాడో!

ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

దక్షిణాఫ్రికా పర్యటనే సందేహాల మధ్య ఆరంభమైంది. అంత కఠినమైన సిరీస్‌కు ముందు కనీసం ఓ ప్రాక్టీసు మ్యాచ్ అయినా లేకుండా నేరుగా టెస్టులోకి అడుగుపెట్టడంపై క్రికెట్ పండితులు ఆశ్చర్యపోయారు. కేప్‌టౌన్ తొలి టెస్టుకు ప్రకటించిన తుది జట్టును చూసి మరింత ఆశ్చర్యపోయారు. టెస్టుల్లో... అదీ విదేశాల్లో మెరుగైన రికార్డున్న రహానేను కాదని.. ఈ ఫార్మాట్లో కుదురుకోని రోహిత్ శర్మను తీసుకోవడం... ఓపెనర్‌గా తిరుగులేని టెక్నిక్ సొంతమైన రాహుల్‌ను కాదని ధావన్‌ను ఎంచుకోవడం... అందరినీ విభ్రాంతికి గురి చేసింది. పేస్ బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞులైన ఇషాంత్, ఉమేశ్‌లను పక్కనపెట్టి పరిమిత ఓవర్ల క్రికెట్లో తురుపుముక్క బుమ్రాకు తుది జట్టులో చోటు కల్పించడంపై కూడా పండితులు పెదవి విరిచారు. తొలి టెస్టులో భారత్‌ను ఓటమి తప్పకనే పలకరించింది. దీంతో విమర్శకులు తమ అస్త్రాలకు పదును పెట్టారు. ధావన్, రోహిత్‌లను ప్రస్తుత ఫామ్ ఆధారంగానే తీసుకున్నామని... రహానేను సిరీస్‌కు ముందు వద్దన్నవాళ్లే ఇపుడు కావాలంటున్నారంటూ విరాట్ ఎదురుదాడికి దిగాడు. విమర్శలకు భయపడో లేక పాత అలవాటుతోనో జట్టులో మార్పులు తలపెట్టాడు. ధావన్‌ను తప్పించి రాహుల్‌ను తెచ్చాడు. కానీ రోహిత్ ను పక్కన పెట్టడానికి ససేమిరా అన్నాడు. వ్యూహాల్లో పాలుపంచుకునే రహానేను తీసుకోకపోవడం సరి కాదన్నా వినలేదు. అన్నిటి కంటే ఆశ్చర్యకరమైన మార్పు... భువనేశ్వర్‌ను తప్పించడం. తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్‌ను కూల్చి... బ్యాటింగ్‌లో తన వంతు సాయం చేసి టీమ్ఇండియాకు మంచి అవకాశాన్నిచ్చిన భువనేశ్వర్‌పై వేటు వేస్తూ విరాట్ తీసుకున్న నిర్ణయం క్రికెట్ పండితులకు సైతం కొరుకుపడలేదు. ఉపఖండపు పిచ్‌ను తలపించిన సెంచూరియన్ వికెట్ పైనా భారత్ బ్యాట్స్‌మెన్ బోల్తా పడ్డారు. రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెత్తగా ఆడి ఓటమిని కొనితెచ్చుకున్నారు.

ఏమిటి కర్తవ్యం?: విరాట్ కోహ్లి ఇపుడు మూడో టెస్టుకు వ్యూహాల గురించి జొహాన్నెస్‌బర్గ్‌లో తీవ్రంగా మథనం చేస్తున్నాడు. అతను వేసుకోవలసిన ప్రశ్నలు... విదేశీ పరిస్థితుల్లో ఒత్తిడిని తట్టుకొని గెలవగల సత్తా అసలు టీమ్ఇండియాకు ఉందా? విదేశాల్లో మెరుగైన రికార్డున్న రహానేను తొలి రెండు టెస్టులకు తప్పించడం సమంజసమేనా? బుమ్రా హఠాత్తుగా దక్షిణాఫ్రికా మేటి బ్యాట్స్‌మెన్ ముందుకు తోయడం సరైన నిర్ణయమేనా? ఇలాంటి కఠిన పర్యటనకు జట్టులోని ఆటగాళ్లు నిజంగా సంసిద్ధంగా ఉన్నారా? ఈ ప్రశ్నల్లో కొన్నింటికి సమాధానాలు చేదుగా ఉండొచ్చు. ఈ సారి భారత క్రికెట్ అభిమానికి కోహ్లిసేనపై నమ్మకం కలగడానికి కొన్ని అంశాలే కారణం. అవి...సత్తా చాటుతున్న పేస్ దళం. కొత్త బంతిని ఎదుర్కోవడంలో టాప్ ఆర్డర్‌లోని ముగ్గురు బ్యాట్స్‌మెన్ ప్రతిభ. ఓపెనర్‌గా రాహుల్ టెక్నిక్‌పై... మురళీ దృక్పథంపై... వన్‌డౌన్‌లో శిలాసదృశమైన పుజారాలపై అపార నమ్మకం. నాలుగు, ఐదు స్థానాల్లో కోహ్లి, రహానేలకు వీరు సరైన వేదికను అమరుస్తారన్న విశ్వాసం.

టెస్టులకు కావలసింది... ధావన్, రోహిత్ వంటి దూకుడు బ్యాట్స్‌మెన్ కాదు... మురళీ, రాహుల్ వంటి సాంకేతికత, దృక్పథం గల ఆటగాళ్లు. విరాట్ ఇపుడేం చేస్తాడు? రోహిత్‌ను తప్పించి రహానేను తీసుకుంటాడా...? బుమ్రాను పక్కన పెట్టి భువనేశ్వర్‌ను చేర్చుకుంటాడా? ప్రముఖ క్రికెట్ చరిత్ర కారుడు అన్నట్లు... కోహ్లి నిర్ణయాల్లో దూకుడు కంటే పొగరు పాళ్లు కనిపిస్తున్నాయా? ఈ లక్షణాలను పక్కన పెట్టి తుది టెస్టులో గెలిచి పరువు కాపాడుకోవడం కోసం సంయమనంతో నిర్ణయాలు తీసుకుంటాడా!



ప్రపంచ నెంబర్ వన్ రఫెల్ నాదల్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దూసుకుపోతున్నాడు. ఆదివారం ప్రి క్వార్టర్ ఫైనల్లో గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌లో మారిన్ సిలిక్ (క్రొయేషియా)తో తలపడతాడు. ఏడో రోజు స్థానిక టెన్నిస్ అభిమానులకు నిరాశ ఎదురైంది. ఆసీస్ ఫేవరెట్ కిర్గియోస్ ప్రి క్వార్టర్స్‌లో ఓటమి పాలై అభిమాలకు నిర్వేదం కలిగించాడు. కిర్గియోస్‌ను బల్గేరియా ఆటగాడు దిమిత్రోవ్ ఓడించాడు. బ్రిటన్ ఆశా కిరణం, అన్‌సీడెడ్ ఆటగాడు కీల్ ఎడ్మండ్ కూడా క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. అతను దిమిత్రోవ్‌ను ఢీకొంటాడు. మహిళల్లో మాజీ నెంబర్ వన్ కరోలినా వోజ్నియాకి (డెన్మార్క్) ప్రి క్వార్టర్స్‌లో సునాయాసంగా గెలిచి క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. అక్కడ కార్లా సురెజ్ నవర్రో (స్పెయిన్)తో తలపడుతుంది.

ఉత్సాహంగా... ఉల్లాసంగా...

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో చివరి టెస్టు పోరు కోసం భారత జట్టు సమాయత్తమవుతోంది. ఇప్పటికే సిరీస్‌ను 0-2తో కోల్పోయినా మూడో టెస్టులో గెలిచి పరువును కాపాడుకోవాలని టీమ్ఇండియా కృతనిశ్చయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకు తొలి ప్రయత్నంగా ఆదివారం ఇక్కడి వాండరర్స్ మైదానంలో 4 గంటల పాటు తీవ్ర ప్రాక్టీసు చేసింది. ఆ ప్రాక్టీస్ సెషన్ ఉత్సాహంగా సాగింది. రెండో టెస్టులో ఓడిన అనంతరం మీడియా సమావేశంలో ఉగ్రుడైన కెప్టెన్ విరాట్ కోహ్లి... ప్రాక్టీసు సందర్భంగా ఉల్లాసంగా కనిపించాడు. 3 రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం మైదానంలోకి అడుగుపెట్టిన ఆటగాళ్లు విరామంలో నగరానికి సమీపంలో ఉన్న వివిధ సఫారీ, థీమ్ పార్క్‌లను సందర్శించారు. తిరిగి మైదానంలోకి అడుగుపెట్టగానే చమటోడ్చారు. నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. విరాట్ సహచరులతో, స్థానిక బౌలర్లతో పిచ్చాపాటీ మాట్లాడుతూ కనిపించాడు. ఎప్పటిలాగే ఫుట్‌బాల్ మ్యాచ్ అయిన తర్వాత ఆటగాళ్లు తమ తమ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకున్నారు. పార్థీవ్, రాహుల్, రహానేలతో ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్ స్లిప్ క్యాచింగ్ ప్రాక్టీస్ చేయించాడు. అనంతరం రోహిత్, కార్తిక్ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీసు చేశారు. వికెట్లపై రాహుల్, విజయ్, పుజారా... శార్దూల్, సైనిలను ఎదుర్కొన్నారు. విజయ్, రాహుల్ స్పిన్ బౌలింగ్‌లో కూడా ప్రాక్టీసు చేశారు. భారీ షాట్లు ఆడారు. జడేజా, అశ్విన్ వీరికి బౌలింగ్ చేశారు. రాహుల్ ఎడమ మోకాలికి చిన్నపాటి దెబ్బ తగిలింది. కోహ్లి,, పుజారా, రహానే, విజయ్ నెట్స్‌లో రెండు వైపులా బ్యాటింగ్ ప్రాక్టీసు సాగించారు. ఆదివారం చాలా వరకు పచ్చికను తొలగించినా వాండరర్స్ పిచ్ ఇపుడింకా పచ్చికతో కళకళలాడుతోంది. పిచ్‌పై కావలసినంత పచ్చిక ఉంచానని, మ్యాచ్‌కు ముందు తొలగించబోనని క్యురేటర్ తెలిపాడు. దక్షిణాఫ్రికా జట్టు చెప్పినట్లే వికెట్‌ను తయారు చేశానన్నాడు.



ఫైనల్లో భారత్ ఓటమి

- నాలుగు దేశాల హాకీ టోర్నీ

తౌరంగ (న్యూజిలాండ్): నాలుగు దేశాల ఇన్విటేషనల్ హాకీ టోర్నీ ఫైనల్లో భారత్ ఓటమి పాలైంది. ఆదివారం ఇక్కడ బెల్జియం 2-1 తేడాతో టీమ్ఇండియాపై విజయం సాధించింది. బెల్జియం తరపున టామ్ బూన్ (4వ నిమిషం), సెబాస్టియన్ డాకియర్ (36వ ని.) గోల్స్ సాధించగా.. భారత్‌కు 19వ నిమిషంలో మన్‌దీప్ సింగ్ గోల్ అందించాడు. 24న రెండో అంచె ఆరంభమవుతుంది. తొలి పోరులో న్యూజిలాండ్‌ను భారత్ ఢీకొంటుంది. ఆట ఆరంభమైన మూడో నిమిషంలోనే బెల్జియం పెనాల్టీ కార్నర్ సంపాదించింది. కానీ దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఐతే నాలుగో నిమిషంలో తొలి గోల్‌ను బూన్ అందించాడు. దీంతో కంగుతిన్న భారత ఆటగాళ్లు పదేపదే ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులు చేశారు. రెండో క్వార్టర్ ఆరంభం అయ్యాక ఆట జోరందుకుంది. 19వ నిమిషంలో భారత్ అవకాశాలు సృష్టించుకుంది. ఫలితంగా రుపిందర్‌సింగ్ బెల్జియం పాస్‌ను అడ్డగించి మిడ్‌ఫీల్డ్‌లో మన్‌ప్రీత్‌కు అందించాడు. మన్‌ప్రీత్ సర్కిల్ మధ్యలోకి బంతిని పంపాడు. దాన్ని అందుకున్న మన్‌దీప్ బెల్జియం గోల్‌కీపర్‌ను దాటుకొని గోల్ కొట్టాడు. మరో ఐదు నిమిషాల్లోనే బెల్జియం రెండో గోల్ కొట్టి ఆధిక్యాన్ని 2-1కి పెంచుకుంది. చివర్లో రెండు జట్లు ఎంత ప్రయత్నించినా గోల్ సాధించలేకపోయాయి.

బట్లర్ అజేయ సెంచరీ

- మూడో వన్డేలోనూ ఇంగ్లండ్ గెలుపు; సిరీస్ వశం

సిడ్నీ: మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ జోసెఫ్ బట్లర్ (100 నాటౌట్, 83 బంతుల్లో, 6 ఫోర్లు, 4 సిక్స్) అజేయ సెంచరీ సాధించడంతో మూడో వన్డేలో ఇంగ్లండ్ 16 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై గెలిచింది. 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో వశం చేసుకుంది. టెస్టు సిరీస్‌ను గెలుచుకున్న స్మిత్ సేనకు వన్డే సిరీస్‌లో మాత్రం వరుస పరాజయాలు ఎదురయ్యాయి. టాస్ ఓడి బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లండ్ 6 వికెట్లు కోల్పోయి 302 పరుగులు సాధించింది. బట్లర్ సరిగ్గా 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ మోర్గాన్ (41, 50 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించాడు. చివర్లో ఆల్‌రౌండర్ వోక్స్ (53 నాటౌట్, 36 బంతుల్లో, 5 ఫోర్లు, 2 సిక్స్) అర్ధసెంచరీతో అజేయంగా ఉన్నాడు. అనంతరం 303 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన ఆసీస్ 6 వికెట్లు కోల్పోయి 286 పరుగులు మాత్రమే చేయగలిగింది.


బట్లర్

స్పెయిన్ బుల్ కుమ్మేశాడు

- స్వార్జ్‌మన్‌పై విజయం
- క్వార్టర్ ఫైనల్లో ప్రవేశం
- వోజ్నియాకి, స్విటోలినా, సిలిక్, దిమిత్రోవ్ కూడా
- కిర్గియోస్ ఓటమి

మెల్‌బోర్న్: మాజీ చాంపియన్ రఫెల్ నాదల్ (స్పెయిన్)కు ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి కఠిన సవాలు ఎదురైంది. అర్జెంటీనా ఆటగాడు డిగో స్వార్జ్‌మన్ నుంచి నాదల్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఆదివారం హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్ పోరులో నాదల్ 6-3, 6-7, (4-7), 6-3, 6-3తో డిగోపై చమటోడ్చి గెలిచాడు. క్వార్టర్స్ చేరడంతో నాదల్ ఈ టోర్నీ ముగిసిన తర్వాత కూడా నెంబర్ వన్‌గానే కొనసాగుతాడు. రాడ్ లెవర్ ఎరీనాలో దాదాపు 4 గంటల పాటు సాగిన నాలుగు సెట్ల సుదీర్ఘ పోరులో నాదల్ గెలుపు కోసం విపరీతంగా శ్రమించాల్సి వచ్చింది. అతనికిది పదో ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్. ఈ స్పెయిన్ దిగ్గజం కంటే స్విస్ దిగ్గజం ఫెదరర్ మాత్రమే ముందున్నాడు. క్వార్టర్స్‌లో ఆరో సీడ్ సిలిక్‌ను నాదల్ ఢీకొంటాడు. గతంలో నాదల్ అతనిపై 5 సార్లు గెలిచి ఓ సారి ఓడాడు. ఆదివారం నాటి పోరుతో కలుపుకొని డిగోపై నాదల్ గెలవడం నాలుగో సారి. ఐతే గత మ్యాచ్‌ల కంటే ఈ సారి డిగో నుంచి తీవ్ర సవాలు ఎదురైంది. 2015 యుఎస్ ఓపెన్ రెండో రౌండ్లో వరుస సెట్లలో గెలిచిన రఫెల్‌కు డిగోపై ఇదే కఠిన పోరాటం. డిగోతో పోరులో చాలా అలసిపోయానని మ్యాచ్ అనంతరం నాదల్ అంగీకరించాడు. కానీ పోరును ఆస్వాదించానని చెప్పాడు. చివరకు పోరాడగలిగానన్నాడు. "2018లో నేనాడిన భారీ మ్యాచ్ ఇదే" అన్నాడు.

తొలి సెట్ సునాయాసంగా...:

తొలి సెట్‌ను రఫెల్ సునాయాసంగా గెలుచుకున్నాడు. ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ సాధించి సెట్‌ను వశం చేసుకున్నాడు. రెండో సెట్లో డిగో నుంచి ప్రతిఘటన ఎదురైంది. డిగో శక్తివంతమైన గ్రౌండ్ షాట్లతో నాదల్‌కు పరీక్షపెట్టాడు. ఆ సెట్లో ఆరు సార్లు సర్వ్‌లు బ్రేక్ అయ్యాయి. ప్రత్యర్థిని అడ్డుకోవడం నాదల్ తరం కాలేదు. టైబ్రేకర్‌లో నాదల్ ఫోర్‌హ్యాండ్ షాట్ కోర్టు వెలుపల పడడంతో ఆ సెట్ డిగో వశమైంది. దీంతో స్కోర్లు 1-1తో సమమయ్యాయి. మూడో సెట్లో నాదల్ ఆధిపత్యం చెలాయించాడు. నాలుగో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సాధించి సెట్‌ను గెలుచుకున్నాడు. ఐతే నాలుగో సెట్లో నాదల్ ఐదు బ్రేక్ పాయింట్లు కాచుకోవడానికి తీవ్రంగా శ్రమించాడు. రెండో గేమ్ 13 నిమిషాల పాటు సాగింది. మూడో గేమ్‌లో నాదల్ బ్రేక్ సాధించాడు. అనంతరం సర్వ్‌ను కాపాడుకొని... ఓ బలమైన రిటర్న్‌తో మూడో మ్యాచ్ పాయింట్ సాధించాడు. మ్యాచ్ అనంతరం డిగో కోర్టంతా కలియ తిరిగి ప్రేక్షకులకు అభివాదం చేశాడు. సిలిక్ 6-7 (2-7), 6-3, 7-6 (3), 7-6 (7-3)తో కరెనో బుస్తా (స్పెయిన్)పై గెలిచాడు. ఎడ్మండ్ (బ్రిటన్) 6-7 (4-7), 7-5, 6-2, 6-3తో ఇటలీ ఆటగాడు సెపిని ఓడించాడు. దిమిత్రోవ్ (బల్గేరియా) 7-6 (7-3), 7-6(7-4), 4-6, 7-6 (7-4)తో కిర్గియోస్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు.

వోజ్నియాకి అలవోకగా: మహిళల ప్రి క్వార్టర్స్‌లో రెండోసీడ్ కరోలినా వోజ్నియాకి 6-3, 6-0తో మగ్దలినీ రిబరికోవా (స్లొవాకియా)పై అలవోకగా గెలిచింది. వీరిద్దరి పోరు కేవలం గంటలో ముగిసింది. ఈ పోరులో వోజ్నియాకి మూడే గేమ్‌లు కోల్పోయింది. రెండో సెట్లో ఆరు పాయింట్లే ఇచ్చింది. వోజ్నియాకి 2012 తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్ చేరడం ఇదే తొలిసారి. సురెజ్ నవర్రో 4-6, 6-4, 8-6తో కొంటావిట్ (ఎస్తోనియా)పై విజయం సాధించింది. మెర్టెన్స్ (బెల్జియం) 7-6 (7-5), 7-5తో మార్టిన్ (క్రొయేషియా)పై గెలిచింది. స్విటోలినా (ఉక్రెయిన్) 6-3, 6-0తో అలెర్టోవా (చెక్)ను ఓడించింది.


సురెజ్ నవర్రో


సిలిక్


దిమిత్రోవ్



పేస్-రాజా ఓటమి

వెటరన్ లియాండర్ పేస్, పురవ్ రాజా జోడీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో రెండో రౌండ్లో వెనుదిరిగింది. రెండో రౌండ్‌పోరులో ఆదివారం పేస్, రాజా 1-6,, 2-6తో కొలంబియా జోడీ జువాన్ సెబాస్టియన్, రాబర్ట్ ఫరా చేతిలో పోరాడకుండానే ఓడారు. ఐదు సార్లు బ్రేక్ పాయింట్లు సాధించడానికి అవకాశం వచ్చిన రాజా, పేస్ వినియోగించుకోలేకపోయారు. దీంతో ఈ పోరు గంటా 9 నిమిషాల్లోనే ముగిసింది.





1. ఆదివారం ముంబై మారథాన్ 2018లో పాల్గొన్న ఎలైట్ అథ్లెట్లు

2. పసిడి గెలిచిన సొలోమన్ (మధ్య), రజతం నెగ్గిన షుమెట్ అకాల్నా (ఎడమ), కాంస్యం సొంతం చేసుకున్న జోషువా కిప్కొరిర్. ముగ్గురూ ఇథియోపియా అథ్లెట్లే

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.